యర్రంశెట్టి శాయి

పారిపోయి ఉన్నారు జాగ్రత్త!

-: ప్రచురణ :-
ఇంద్రధనుస్సు పబ్లికేషన్స్
3-2-57, శాతవాహన నగర్,
యల్.బి.నగర్, హైదరాబాద్-500 074.
సెల్ : 98482 64364

PATAKULUNNA JAGRATHA
by ***Yerramsetti Sai***

© ***with author***
No part of this book may be utilized in any form or by any means including electronic recording or retrieval system without permission in writing from the publishers.

Third Edition : 2012

Price : 150/-

Cover Illustration:

Published by:
INDRADHANUSSU PUBLICATIONS,
3-2-57, Satavahana Nagar,
L.B.Nagar, Hyderabad-500 074.

Books Available at :
Vishalandra Book House, Ph : 24744580.
Navodaya Book House, Ph : 24652387.
Navayuga Book House, Ph : 24754688.
Indradhanussu Publications, Cell : 98482 64364.
Telugu Book House, Cell : 9247446497.
Ganesh Book stall, Dilsukhnagar, Cell: 9393804466.
Gandhi Book Stall, Koti, Cell : 9293226169.

DTP & Layout
Hari : 9393 5254 61
H.No. 11-13-193/3/1-B, Near Astalaxmi Arch,
Dwarakanagar, Kothapet, Hyderabad-35.

Printed at :
S.P. Graphics
Bagh LIngampally, Hyderabad.
Cell : 93968 00098.

ఎన్నో ప్రాంతాలనుంచి ఎంతోమంది తరచుగా ఫోన్లు చేస్తూంటారు.
"ఫలానా మీ నవల కావాలి మార్కెట్‌లో లేవు. ఎక్కడ దొరుకుతాయో చెప్పగలరా?" అంటూ -
మరికొంతమంది విదేశాల్లో ఉన్న అభిమానులు వారికి నచ్చిన రచనలు ఏ పబ్లిషర్ దగ్గర దొరుకుతాయ్ అని అడుగుతూంటారు.
నా రచనలను ఇష్టపడే అభిమానులందరి కోసం -

www.yerramsettisai.com
or
www.indradhanussu.com

వెబ్‌సైట్లను ప్రారంభించాము. ఇందులో ఇప్పటికే కొన్ని నవలలు చేర్చటం జరిగింది. త్వరలో మిగతా కూడా లభిస్తాయ్. ఇవన్నీ మీరు ఉచితంగా చదువుకోవచ్చు. డౌన్‌లోడ్ చేసుకోవచ్చు! ఇవేకాక నేను రాసిన ఫీచర్స్, కథలు, నాటికలు, పొలిటికల్ సెటైర్ అవన్నీ మీరు ఎంజాయ్ చేయవచ్చు. రాబోయే నవలల గురించి ఇన్‌ఫర్మేషన్ ఉంటుంది. ముఖ్యంగా లేటెస్ట్ పొలిటికల్ డెవలప్‌మెంట్స్ మీద సెటైరికల్ ఆర్టికల్స్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం జరుగుతుంది.

శ్రీదేవితో లవ్‌లో పడ్డ
సింహాద్రి, చిరంజీవిని తోడు తీసుకుని
శ్రీదేవి బర్త్‌డేకని వైజాగ్ వచ్చాడు -
బాంబ్ నిలయంలో ఎంటరయాకగానీ
వాళ్ళిద్దరికీ అర్థం కాలేదు -
తామిద్దరూ ఆ బాంబ్ నిలయంలోనే
కర్నల్ చేతిలో సమాధి అయిపోవటం ఖాయమని-
ప్రాణాలు ముఖ్యమా?
శ్రీదేవి లవ్వా?
డిసైడ్ చేసుకునే లోపలే
పరిస్థితులు క్షీణించి పోయాయ్.

పాఠకులున్నారు జాగ్రత్త!

చాలా విచారంగా హోటల్లోకొచ్చి కూర్చున్న సింహాద్రిని చూసి సర్వర్ రామనాథం ఆశ్చర్యపోయాడు. తను సింహాద్రికి సంవత్సరం నుండి భోజనం సర్వ్ చేస్తున్నాడు. కానీ ఏరోజూ అతనింత దిగులుగా ఉండగా, చూడలేదు. ఆఖరికి వర్షాకాలంలో వరుసగా వారంరోజులపాటు రోజూ వంకాయ కూరే వండినా అతను చలించలేదు. చిరునవ్వుతో ఆ కూరను పక్కకు తోసేసి పచ్చడితోనే అన్నం తినేసేవాడు.

అలాంటి వ్యక్తి ఇప్పుడిలా విచారంగా ఉండడం అతనికి బాధ కలిగించింది. బాధల్లో ఉన్న వ్యక్తికి ఎవరయినా కొంచెం రెండు మాటలు ధైర్యం చెప్తే చాలు– వాళ్ళు ఇట్టే ఆ విచారం నుంచి బయటపడి చిన్న పిల్లలా కేరింతలు కొడుతూ వెళ్ళిపోతారని ఓ వారపత్రికలో ప్రశ్నలూ జవాబులూ శీర్షికలో చదివాడు తను.

అంచేత ఇప్పుడు అతనికి ధైర్యం చెప్పాలి. అతనూ ఆ బాధలన్నీ మర్చిపోయి– చిన్న పిల్లాడిలా కేరింతలు కొడుతూ ఇంటికెళ్ళాలి. బాధల్లో ఉన్న కస్టమర్‌కి ఆమాత్రం సహాయం చేయడం తన ధర్మం. అదీగాక అతను తనకు చాలాసార్లు “టిప్” ఇచ్చాడు. ఓసారి మర్చిపోయి ఒకేరోజున రెండుసార్లు “టిప్” ఇచ్చాడు కూడా.

“గురూగారూ!” పిల్చాడు రామనాథం.

‘ఊ!” అన్నాడు సింహాద్రి.

“మీరలా దిగులుపడడం బావుండలేదండీ! కష్టాలు కలకాలం కాపురముండవు” అని మా ఫ్రెండ్ అంటే– శ్రీకృష్ణా కాఫీ విలాస్‌లో సీనియర్ సర్వర్ రామానుజం అంటూండేవాడు. అంచేత ధైర్యం తెచ్చుకోండిసార్! కావడి కొయ్యేనోయ్– కుండలు మన్నేనోయ్ అని పెద్దలన్నారు. అందులో ఎంత గొప్ప నిజం ఉంది... ఒక్క నిమిషం ఆలోచించండి! కావడి విరిచిచూస్తే అందులో నిజంగా కొయ్యే ఉంటుంది. అలాగే కుండలు పగలగొట్టి చూస్తే అందులో మట్టేగా ఉండేది. కాపోతే కాల్చినమట్టి లేదా బంకమట్టి ఏదొకటి – మొత్తానికి అది మట్టే. అంతెందుకు సార్! శ్రీనాథుడేమన్నాడు? రాసెడిది భాగవతమట రాయించెడివాడు రామచంద్రుడట– నేరాసిన .. నేరాసిన... ఏమిటో గుర్తు లేదు అది అగునట! చూశారా ఎంత అద్భుతంగా చెప్పాడో? అంచేత మీరు...”

సింహాద్రి వాలకం గమనించిన రామనాథం తన స్పీచ్ ఠక్కున ఆపేశాడు– అతను తను చెప్పే మాటలు పిసరంతా కూడా వినడం లేదని అనుమానం కలగడంతో.

అంచేత తను ప్రస్తుతం అతని దృష్టిని అర్జంటుగా ఆకర్షించాలని నిర్ణయించుకున్నాడు.

"గురూగారూ!" వినయంగా పిలిచాడతనిని.

"ఊ!" అన్నాడు సింహాద్రి.

"నేను మీతో మాట్లాడుతున్నాను. వింటున్నారా?" అనుమానంగా అడిగాడు.

సింహాద్రి అయోమయంగా అతని వంక చూశాడు.

"ఏమిటన్నావు?"

"నేను చెప్తోంది వింటున్నారా?"

"నువ్వు చెపుతోందా?"

"అవునండీ!"

"ఏమిటి చెప్పటం?"

"అదేనండీ! ధైర్యం చెపుతున్నాను"

"ధైర్యమా?"

"అవునండీ! తమరికే!"

"ఎందుకు ధైర్యం చెప్పడం?"

"అదేనండి... మీరు ఎంతో దిగులుగా ఉన్నారు కదా? అందుకని"

"దిగులా?"

"అవునండీ! అలా దిగు పడకూడదండీ! కావడి కొయ్యేనోయ్ కుండలు మట్టేనోయ్ అని పెద్దలన్నారు చూడండి! అది గుర్తుంచుకోవాలన్న మాటండీ మనం. కష్టాలు కలకాలం కాపురం ఉండవ్ అని కూడా మా రామానుజం అంటాడండీ"

సింహాద్రికేమీ అర్థం కాలేదు.

"రామానుజమా?"

"అవునండీ!"

"ఎవరతను?"

"శ్రీకృష్ణా కాఫీ విలాస్‌లో సీనియర్ సర్వరండి! నాకు మంచి ఫ్రెండ్"

"అతనేమన్నాడు"

"కావడి మట్టేనోయ్, కుండలు కొయ్యేనోయ్ అన్నమాట ఎప్పుడూ కోట్ చేస్తూంటాడండీ అతను. కష్టాలు కలకాలం కాపురం చేయవు అని కూడా అతనే అంటూంటాడండీ!"

"ఎందుకలా అనటం?"

రామనాథ ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"ఎందుకంటే.. అది.. అలా ... అనటం ... మరి అతని మనుసులోని విషయం

అన్నమాటండీ అది! అదేకాదండి! ఇంకెన్నో అలాంటి మాటలు చెప్తాడండి! అది విన్నప్పుడు మనకి భలే ఓదార్పుగా వుంటుందన్న మాటండీ! మీకు తెలుసో తెలీదో ఎవరయినా సరే ఎలాంటి కష్టాల్లో ఇరుక్కున్నాసరే. అందులోనుంచి బయట పడటం చేతకానప్పుడు రామానుజం దగ్గరకెళ్తాడన్న మాటండీ"

"ఎందుకు?"

"అతను ఎవరి కష్టాలకు సరిపోయే గొప్ప కొటేషన్లు వాళ్ళకు చెప్పి ఓదారుస్తాడన్న మాటండి!"

"ఎవరు ఓదారుస్తారు?"

"అదేనండీ! రామానుజం"

"రామానుజమా?"

"అవునండీ!"

"రామానుజం ఎవరు?"

రామానాధానికి అర్థమయిపోయింది. అతను తను చెప్పింది వినకపోవడమే కాదు తనతో మాట్లాడుతన్నది కూడా మనసు కెక్కించుకోవడం లేదు. ఇప్పుడు మళ్ళీ రామానుజం హిస్టరీ అంతా అతనికి రిపీట్ చేసినా ఆ శ్రమంతా వృథా అని తెలిసిపోతోంది.

సరిగ్గా అప్పుడే అతనిని రక్షించడానికన్నట్లు హొటల్ మేనేజర్ వచ్చాడక్కడికి.

"ఏం సార్! రూమ్ మారారా?" ఆప్యాయంగా సింహాద్రిని పలుకరించాడతను. సింహాద్రి అతనివంక అయోమయంగా చూశాడు.

"రూమా?"

"అవునండీ!"

"ఏ రూము?"

"ఏ రూమేమిటి? మీరు ఇప్పుడుంటున్న శివాజీనగర్ రూమ్ నుంచి మలక్‌పేట్ రూమ్‌కి మారుతున్నానన్నారు కదా?"

"ఓ... అదా!" పూర్తిగా స్పృహలోకొచ్చేశాడు సింహాద్రి.

"అవును– మారేశాను... మారేశాను.." అన్నాడు హడావుడిగా.

"ఇప్పుడున్న రూమెక్కడ?" అడిగాడు మేనేజర్.

"అదే– శవం బ్రదర్స్ బ్రాందీషాపు లేదూ? దాని కెదురుగ్గా వందమీటలర్లు వెళ్తే..."

"శవం బ్రదర్స్ కాదండి శివం బ్రదర్స్!"

"శివం బ్రదర్సా?"

"అవునండీ!"

"మరి శవం బ్రదర్స్ అని రాసి ఉందేమిటి బోర్డు?"

"శివం' అనే రాశారుగానీ పెయింటర్ 'శి' కొంచెం చెడగొట్టాడటండీ!"

"ఎవరా పెయింటర్?"

"తంగవేలు అనీ కుచన్ పచేరీ లెండి"

"కుచన్ పచేరీయా?"

"అవునండీ!"

"అంటే?

"అంటే- ఏమోనండీ! నాకూ సరిగ్గా తెలీదు. ఆ పేరు గలవాళ్ళు సికింద్రాబాద్‌లో ఉంటారండి. చాలా ఫేమస్. అతనికి తెలుగు రాదు కదండీ! అందుకని. ఇంతకూ రూమ్ ఎక్కడన్నారు?"

"శవం బ్రదర్స్ బ్రాందీషాపు కెదురుగ్గా సందులో వందమీటర్లు నడుస్తే ఆకుపచ్చ ఇల్లు వస్తుంది"

"ఆకుపచ్చ ఇల్లా?" ఆశ్చర్యంగా అడిగాడు మేనేజర్.

"అవును!"

"అందులోకేనా మారింది?"

"ఏం? అందులో ఏమయినా దెయ్యాలు గట్రా వున్నాయా?" అనుమానంగా అడిగాడు సింహాద్రి.

"అబ్బెబ్బే అదేం కాదండి! ఆ గదిలో ఇంతకుముందు ప్రఖ్యాత రచయిత ధనుంజయగారుండేవారు"

"ధనుంజయా?"

"ఆ ఆయనేనండీ! ధరూ జెంటిల్మన్. ఓసారి మన హోటల్లో భోజనం చేసి భోజనం అద్భుతంగా వుందని రాత్రి మూడింటివరకూ పొగుడుతూ ఇక్కడే కూర్చున్నాడు. వస్తానండి! పాపం మీ చేయి ఎండిపోయినట్లుంది. భోజనం కానీండి" అనేసి కాష్ కౌంటర్ దగ్గర కెళ్ళిపోయాడతను. ఈలోగా రామనాథం మరోసారి అతనికి ధైర్యం చెప్దామని దగ్గర కొచ్చాడు.

"భోజనం చేయండి సార్! బాధపడకండి! కావడి కొయ్యేనోయ్ కుండలు మన్నేనోయ్! అన్నట్లు మీరు రామానుజం ఎవరని అడిగారు కదూ? శ్రీకృష్ణా కాఫీ విలాస్‌లో సీనియర్ సర్వర్‌లెండి. బాల్డ్ హెడ్! ఈ సారి వెళ్తే కలుసుకోండి. ఎంత మంచాడంటే ఆరుసార్లు తడవకు ఇరవై ఆరూ రూపాయల చొప్పున నాకు అప్పిచ్చాడు. మళ్ళీ నేనిచ్చే వరకూ అడగలేదండి! నేనూ ఇంకా ఇవ్వలేదనుకోండి! అంత గొప్ప మనిషి! అసలు అతని ఖర్మ

అలా కాలిందిగానీ వాళ్ళ వంశం ఏమిటనుకున్నారు? జమీందారుల ఫామిలీ! అరె! ఎలా వెళ్ళిపోతున్నారేమిటి? భోజనం పూర్తి కాలేదుగా?"

"ఆ! భోజనమా?" అర్థం కానట్లు అడిగాడు సింహాద్రి.

సింహాద్రి వెనక్కు వచ్చి మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు.

"తమరేదో చాలా చికాకులో ఉన్నట్లున్నారండీ!" జాలిగా అన్నాడు రామనాథం.

"అవునోయ్" ఒప్పుకున్నాడు సింహాద్రి.

ఆ సమయంలో రామనాథం కంటే ఆత్మీయులెవరూ లేరనిపించిందతనికి. రామనాథం విస్తట్లో భోజనం వడ్డించాడు.

"చికాకులనేవి ఎప్పుడూ ఉంటాయండీ! "కావడి కొయ్యేనోయ్ కుండల మన్నేనోయ్" అని ఊరికే అన్లేదు. అయినా మనం పట్టించుకోకూడదు. నా సంగతే తీసుకోండి. నా ఇంటి చిరాకులేవో నాకున్నాయ్! అయినాగాని ఇక్కడికి భోజనాని కొచ్చేవాళ్ళ చిరాకులు – హోటల్ ప్రొప్రయిటర్ చిరాకులు, ఇవన్నీ కూడా కలిసి పిచ్చెక్కిపోతుందొకోసారి. అయినా నేను ఆ చిరాకులన్నీ పట్టించుకోను. పక్కకు నేట్టేసి..."

"నాకు చికాకులేమీ మీద పడలేదోయ్!" అన్నాడు సింహాద్రి.

"అలాగాండీ!" మరోసారి దెబ్బతిన్నందుకు అసంతృప్తి కలిగింది రామనాథానికి. సింహాద్రి పడుతున్న ఆవేదనను, తన గొప్ప అనుభవపూర్వకమయిన మాటలతో తొలగించాలనుకున్నా ఆ కోరిక నెరవేరడం లేదు.

"అయ్యో! అదేంటండీ. అన్నంలో మంచినీళ్ళు కలుపుతున్నారు?" సింహాద్రి చేస్తున్న పని చూసి కంగారుగా అడిగాడు రామనాథం.

సింహాద్రి ఉలిక్కిపడి తేరుకుని విస్తట్లోకి చూశాడు.

అవును. తాను అన్నంలో నీళ్ళు పోసి కలుపుతున్నాడు.

"ఊహు! లాభం లేదోయ్ – ఇవాళ భోజనం చేయలేను"

"ఎందుకండీ? ఏం జరిగింది?" ఇంక లాభం లేదని డైరెక్టుగా అడిగేశాడు రామనాథం. సింహాద్రి చేయికడుక్కుని వచ్చాడు.

"ఇప్పుడు కాదోయ్- మరోసారి చెప్తాను" అనేసి సీరియస్‌గా వెళ్ళిపోయాడతను. రామనాథానికి ఆశ్చర్యంతో పాటు జాలి కలిగింది. సింహాద్రిని అలా మార్చేసినది కష్టాలూ కాదు. చికాకులూ కాదు- మరేమయి ఉంటుంది? హఠాత్తుగా అతనికో ఆలోచన కరెంట్‌లాగా బుర్రలో పాకింది.

'హా! అవును! గురూగారు ప్రేమలో పడ్డారు" అనుకున్నాడు హుషారుగా.

* * * * *

సింహాద్రి స్టేట్‌బాంక్ దగ్గర బస్ దిగి అబిడ్స్ రోడ్ మీద నడవసాగాడు. రోడ్డంతా జనంతోనూ వాహనాలతోనూ క్రిక్కిరిసిపోయి వుంది.

దూరంగా మైక్‌లో ఓ తెలుగు సినిమాలోని బూతుపాట అందంగా, వివరంగా వినబడుతోంది.

సింహాద్రి మనసు మాత్రం ఆ పాటనూ, జనాన్నీ పట్టించుకోవడం లేదు. ఎక్కడో, ఏవేవో ఆలోచనల్లో మునిగిపోయి ఉన్నాడు.

ఉండుండి శ్రీదేవి ఫోటో కళ్ళముందు కనబడి అతని పరిస్థితిని మరింత దిగజార్చేస్తోంది.

"అంత అందమయిన అమ్మాయిలు నిజంగా ఉంటారా? ఉండే ఉంటారు. లేకపోతే ఆ ఫోటో తనకెలా కనబడుతుంది? ఒరిజినల్ ఉంటేనే గదా– ఫోటో అంటూ వచ్చేది?

అవును! ఆ అమ్మాయి ఉంది. ఆ అమ్మాయికో ఇల్లు కూడా ఉంది. ఆ ఇంటి అడ్రసూ ఉంది. శ్రీదేవి, బాంబ్ నిలయం, రెడ్‌ఫీల్డ్, విశాఖపట్నం, అంతా బాగానే ఉంది గానీ "బాంబ్ నిలయం" అన్న పేరే తనకర్థం కావటం లేదు.

బాంబ్‌నిలయం అంటే బాంబులకు నిలయం అన్నమాట. అంటే ఇంట్లో బాంబ్‌లుంటాయా?

సింహాద్రికి ఆ మాట నచ్చలేదు. అంత అందమైన అమ్మాయి నివసించేచోట బాంబులు కూడా నివసిస్తాయా?

నోనో – నెవర్!

ఆ అమ్మాయి ఉన్నచోట నెమళ్ళూ, పావురాళ్ళూ, కుందేళ్ళూ, లేళ్ళూ, జింకలూ– అలాంటి అందమయిన జంతువులూ, పక్షులూ తప్పితే బాంబులుండడానికి వీల్లేదు.

హఠాత్తుగా సింహాద్రి భుజం విరిగిపోయినట్లయనిపించింది. సింహాద్రి తూలి పక్కకు పడబోయి ఆగాడు.. మరుక్షణం అతని భుజాన్ని అతని నుంచీ వేరు చేయడానికి ప్రయత్నించిన పెద్ద మనిషి సైకిల్‌తో సహా అతనిని దూసుకెళ్ళి ముందు నడుస్తున్న మరో ఇద్దరిని కూడా పక్కకు తోశాక, ఆ తరువాత ఇంకా ముందు చేయి చేయిపట్టుకుని నడుస్తున్న మరో ఓ సర్దార్జీనీ, అతని భార్యనూ సైకిల్‌తో విడదీయబోయి కుదరక మధ్యలో దబ్బున పడిపోయాడు. అతని మీద సైకిల్ పడింది. సైకిల్ ఫ్రంట్ వీల్ మీద సర్దార్జీ, బాక్‌వీల్ మీద అతని భార్య కూలబడిపోయారు. మరుక్షణం ఆ సైకిల్ బాధితులంతా చుట్టూ మూగిపోయారు. ముందు సర్దార్జీనీ లేపారెవో. సర్దార్జీ లేచి తన భార్యను లేపాడు. ఆ తరువాత అయిదారుగురు కలసి సైకిల్ పైకి తీశారు. అప్పుడు అడుగునున్న వ్యక్తి లేచి నిలబడ్డాడు.

సర్దార్జీ ఇంకేమాత్రం ఆలస్యం చేయకుండా అతని చొక్కా పట్టుకున్నాడు. పట్టుకుని ఆ శాల్తీని గాలిగోలకి లేపాడోసారి. అప్పుడు చూశాడు సింహాద్రి.

చూస్తూనే ఆనందంతో గావుకేక పెట్టాడు.

"ఒరే చిరంజీవి!"

"గాలిలోకి తేలిన చిరంజీవి ఆశ్చర్యంగా చుట్టూ చూశాడు. అతని కళ్ళకు సింహాద్రి కనిపించేలోగానే సర్దార్జీ అతనిని కిందకు దింపేశాడు.

"ఆంఖ్ బంద్ కరకే చలారియా సైకిల్?" కోపంగా చిరంజీవి చొక్కా కాలర్ పట్టుకుని కిందకు దింపి ఊపుతూ అడిగాడు సర్దార్జీ.

"ప్లీజ్ లిఫ్ట్ మీ అప్ ఎగైన్" సర్దార్జీ నడిగాడు చిరంజీవి. మరోసారి గాలిలోకి లేస్తే తనను పిలిచినావారెవరో చూద్దామని అతని కోరిక! కానీ సర్దార్జీ అతని కోరిక తీర్చలేదు.

"పాగల్ హొగయోహొ తుమ్‌ణే?"

"అయ్ డోన్ట్‌నో హిందీ" అన్నాడు చిరంజీవి– సర్దార్జీ చేతిలోంచి తన చొక్కా కాలరు విడిపించుకోవడానికి ప్రయత్నిస్తూ.

"దెన్ అయ్ విల్ డీల్ ఇన్ ఇంగ్లీష్ ఓన్లీ–" అంటూ భుజాలు కొట్టుకుపోయిన నలుగురు బాధితుల్లో ఒకడు ముందు కొచ్చి చిరంజీవి షర్టులో మరికొంత భాగం పట్టుకున్నాడు.

"బాగా ఉతకండి! అప్పుడుగాని కళ్ళు తెరచి సైకిల్ తొక్కడు నేర్చుకోడు" అన్నాడు మరొకరు.

"అవును ఉతకాల్సిందే" అన్నాడు ఇంకోడు.

సరిగ్గా ఆ సమయంలో సింహాద్రి ఆ గుంపుని తోసుకుంటూ ముందుకెళ్ళాడు ఉత్సాహంగా.

మరోసారి ఇద్దరి గుప్పెళ్ళల్లో నలిగిపోతున్న చొక్కా ఓనర్‌ని పరీక్షగా చూశాడు. సందేహం లేదు. వాడు చిరంజీవే!

"ఓరే చిరంజీవీ" మరోసారి అప్యాయంగా పిలిచాడు మరో రెండడుగులు ముందుకేస్తూ.

చిరంజీవి సింహాద్రిని చూసి ఆశ్చర్యపోయాడు.

"నువ్వా?" అన్నాడు ఆనందంగా.

"అవును నేనే" అన్నాడు సింహాద్రి చిరునవ్వుతో.

"ఇందాక నేను గాలిలోకి లేచినపుడూ పిలిచింది నువ్వేనా?"

"అవును అప్పుడే గదా నీ వ్యూ బాగా కనిపించింది?"

"నాకా పిలుపు వినిపించిందిగానీ నువ్వనుకోలేదు."

"అబ్బే– నేనే!"

"భలే తమాషాగా కలుసుకున్నాం కదూ?"

"అవును!"

"నిన్నిక్కడ కలుసుకుంటానని నేను ఎప్పుడూ అనుకోలేదు."

"నేనూ అంతే!"

"చాలా కాలమయిపోయింది మనం కలుసుకుని."

"అవును! నైన్‌టీన్ సెవెంటీ ఎయిట్ మే లో ఆఖరి సారి కలుసుకున్నాం"

"ఎగ్జాక్ట్లీ"

ఇద్దరూ కరచాలనం చేసుకున్నారు.

"పద. ఆ హోటల్లో కూర్చుని మాట్లాడుకుందాం" అన్నాడు సింహాద్రి.

"అవును. చాలా విషయాలు మాట్లాడాలి. పద" అన్నాడు చిరంజీవి.

ఇద్దరూ అడుగులు వేయబోయారుగాని చిరంజీవి చొక్కా అప్పటికే ఇద్దరి చేతిలో వుండటం వల్ల అతనికి నడవడం సాధ్యం కాలేదు.

"నా చొక్కా మీ చేతిలో వుంది వదలండి" అన్నాడు చిరంజీవి సర్దార్జీతో వినయంగా.

"ఇదిగో ఆయన చేతిలో కూడా కొంచెం వుంది" అన్నాడు సింహాద్రి ఇంకో వ్యక్తిని చూసి.

"మీరు వదిలేయండి. ఫరవాలేదు. నేనింక మామూలుగా నిలబడగలను" అన్నాడు చిరంజీవి ఆ రెండో వ్యక్తితో.

"మొహం పగలగొడతాను రాస్కెల్! మమ్మల్నందర్నీ కిందపడేసి తప్పించుకుని పోదామనా?" అన్నాడు రెండో వ్యక్తి కోపంగా.

చిరంజీవి ఆశ్చర్యంగా సింహాద్రివేపు చూశాడు.

"ఎవరి గురించి అతను మాట్లాడుతోంది?"

సింహాద్రి పెదవి విరిచాడు. "నాకూ అదే అర్థం కావటం లేదు. బహుశా సర్దార్జీ గురించేమో"

"సర్దార్జీ గురించి కాదురా ఇడియట్! నీ గురించే. నిన్నే అనేది" ఇంకా కోపంగా అన్నాడా వ్యక్తి.

"సినిమాకి టైమయిపోతోంది" అంది అతని భార్య హిందీలో.

ఇలా కాలనిర్ణయం లేకుండా గంటలకొద్దీ చిరంజీవి చొక్కా పట్టుకుని నిలబడటం సర్దార్‌జీకి నచ్చలేదు. చేయదల్చుకుందేదో తకీమని చేసేసి తన దారిన తాను వెళ్ళడం

ఉత్తమంగా కనిపించిందతనికి.

వెంటనే పళ్ళు బిగించి, తన బలమంతా ఉపయోగించి రెండో చేత్తో చిరంజీవి నెత్తిమీద గట్టిగా కొట్టాడు.

కానీ చిరంజీవి ఆ పరిస్థితిని ముందే గ్రహించడంచేత తక్కున తల కిందకు వంచేశాడు. దాంతో ఆ బలమయిన సర్దార్‌జీ చేయి అదే స్పీడ్‌లో వెళ్ళి చిరంజీవి చొక్కా రెండో భాగాన్ని పట్టుకొన్న మరో పెద్దమనిషికి తగిలింది. ఆ పెద్ద మనిషికి గూబ అదిరిపోయింది.

"అబ్బా" అంటూ చిరంజీవిని వదిలేసి రెండు చేతుల్లో తన తల పట్టుకున్నాడు. అదిచూసి సర్దార్జీ కంగారుపడ్డాడు.

కానీ అప్పటికే దెబ్బతిన్న వ్యక్తి తాలూకు మరో వ్యక్తి భీకరంగా ఘర్జిస్తూ సర్దార్జీ మీదకొచ్చాడు.

సర్దార్‌జీ భయం భయంగానే వెనక్కు తగ్గుతూ పొరబాటెలా జరిగిందో వివరించాడానికి ప్రయత్నించసాగాడు.

అదే సమయమనుకుని చిరంజీవి, సింహాద్రీ సైకిల్‌తో సహా గుంపు బయటకు జారుకున్నారు.

ఆ తరువాత చాలా సేపటివరకూ ఆ గుంపు అలానే ఉండడం, సర్దార్జీ తరపు కొంతమందీ, దెబ్బతిన్న వ్యక్తి తరపు కొంతమందిగా విడిపోయి చొక్కాలు పట్టుకుని తోసుకోవడం అంతా ఎదురుగ్గానే హోటల్లో కూర్చున్న సింహాద్రికీ, చిరంజీవికీ కనబడుతూనే వుంది.

"నువ్విక్కడెలా ఉన్నావ్‌రా?" అడిగాడు సింహాద్రి 'టీ' తాగుతూ.

"ఉద్యోగం ఇక్కడే కదా మరి! ఇంకెక్కడుంటాను?"

"ఉద్యోగమా?" మరీ ఆశ్చర్యపోయాడు సింహాద్రి"

"అవును!"

"నీకు ఉద్యోగం ఎలా దొరికింది?"

"యాక్సిడెంటల్‌గా అయిపోయిందిలే!" చాలా తాపీగా చెప్పాడతను.

"అంటే?"

"అంటే ఏముందీ? ఇంటర్వ్యూలో నా సర్టిఫికెట్లన్నీ వివరంగా చూళ్ళేదు వాళ్ళు"

"అసలు పరీక్ష ఎలా పాసయ్యావ్?"

"రైల్వే సర్వీస్ కమిషన్‌కదా! పెద్ద కష్టమేముంటుంది? పరీక్ష పేపర్ ఎలాగూ రెండు రోజుల ముందు మార్కెట్లో దొరుకుతుందిగా!"

"ఏడ్చావ్‌లే. మిగతా పేపర్లు మాత్రం దొరకవేంటి? అంతెందుకూ? టెన్త్‌క్లాస్‌వీ,

ఇంటర్వీ మాత్రం మార్కెట్లో దొరకలేదూ? నాలుగు రోజులముందే దొరికాయ్! అయినా నువ్వు ఫెయిలవ్వలేదూ?"

"అఫ్‌కోర్స్! అది నిజమేననుకో! కానీ అప్పుడు ఫెయిలవటానికి కారణం ఉంది"

"ఏమిటది?"

"ఇవేవీ అవసరం లేకుండానే బీఏ పాస్ సర్టిఫికెట్లు ఒకచోట అమ్ముతున్నారని తెలిసి అక్కడికెళ్ళాను. మన ఆంధ్రప్రదేశ్‌లో ఆ సౌకర్యాలు చాలా ఏర్పాటుచేశారుగా! మార్కులు కొనుక్కోవడం దొంగ బస్‌పాస్‌లు కొనుక్కోవడం, డిగ్రీ సర్టిఫికెట్లు కొనుక్కోవడం..."

"అయితే మరా బీఏ సర్టిఫికెట్ కొన్నావా?"

"కొంచెంలో మిస్సయింది!"

"ఎలా?"

"పాపం ఆ సర్టిఫికెట్లమ్మేవాడికి హఠాత్తుగా ఏదో జబ్బు వచ్చిందట. అందుకని అమెరికా వెళ్ళిపోయాడు. దాంతో ట్రబులయిపోయింది. ఇలా లాభంలేదని ఇంటర్ పరీక్ష పేపర్లే కొని ఆ తరువాత సంవత్సరం పాసయ్యాను."

"ఇంతకూ నువ్ చేసే ఉద్యోగం ఏమిటి?"

"అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్"

సింహాద్రి ఉలిక్కిపడ్డాడు.

"ఆ వుద్యోగం ఇచ్చారా నీకు?"

"బతిమాలి ఇచ్చారు!"

"ఎందుకు?"

"సాధారణంగా అందరూ ఆ వుద్యోగం అంటే పారిపోతూంటారు, అందుకని మనలాంటి వాళ్ళకు ఛాన్స్ ఇస్తారన్నమాట!"

"అంటే అది రైళ్ళు నడపడంతో సంబంధం వున్న ఉద్యోగం కదూ?"

"అవును"

"అయితే మొన్న ఇక్కడికి దగ్గర్లో జరిగిన రైలు యాక్సిడెంట్ నీ పనేనా?" అనుమానంగా అడిగాడు సింహాద్రి.

"ఛ! కాదు!"

"ఒట్టు అను!"

"ఒట్టు"

"అయితే మరెవరు చేశారు?"

"అదింకా తెలీదు. ఇంజనీరింగ్ వాళ్ళ ఫాల్ట్ అని కారేజ్ వాగన్ డిపార్ట్‌మెంట్ వాళు ళ్ళ- కాదు కారేజ్ వాగన్ వాళ్ళదే అని ఇంజనీరింగ్ వాళ్ళు వాదించుకుంటున్నారు. అది తేలాలంటే ఇంకో ఆర్నెల్లు పడుతుందిలే!"

"ఓహో" అసంతృప్తిగానే అన్నాడు సింహాద్రి.

"అయితే ఓ పనిచెయ్! మన సీనియర్ రత్నారావ్‌గాడు ఇక్కడే వున్నాడు. వాడెప్పు డయినా కనబడితే నువ్వు చేస్తున్న ఉద్యోగం సంగతి వాడికి ఛస్తే చెప్పకు!"

"ఎందుకని?"

"మొన్న జరిగిన రైలు ప్రమాదంలో వాడి ప్రియురాలి మొఖం కాస్తా పద్దెనిమిది గాయాలతో అందవికారంగా తయారయిందట. అప్పటినుంచీ కనబడ్డ అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ నల్లా పొడుస్తానని కత్తి తీసుకు తిరుగుతున్నాడు."

"కానీ దానికి బాధ్యత 'ఏఎస్సెమ్'ది కాదు గదా!"

"వాడదేమీ వినిపించుకోవటం లేదు. వాడికెవడో చెప్పాడట- రైలు ప్రమాదాలకు ముఖ్య కారణం అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్లని!"

"చెప్పినవాడెవడో పెద్ద ఇడియట్ అంటాను"

"కానీ రత్నారావ్‌గాడు మాత్రం అలా అనుకోవటం లేదు"

"పూర్ ఫెలో!"

"ఏదేమయినా నువ్వు మాత్రం వాడు కనబడితే నువ్ చేసే ఉద్యోగం గురించి చెప్పకు"

"ఛస్తే చెప్పను!"

"మరేమని చెప్తావ్?"

"ఆర్టీసీలో డ్రయివర్నని చెప్తాను"

"వద్దు! అది కూడా వాడికిష్టం లేదు"

"ఎందుకు?"

"వాడు ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న కుక్క ఓసారి రోడ్డుమీద కెడితే ఆర్టీసీ బస్సొకటి దానిమీద నుంచి వెళ్ళిపోయిందట!"

"వెరీబాడ్!"

"అవును. పాపం అప్పటినుంచీ వాడు ఆర్టీసీ డ్రయివర్ల మీద కూడా కోపంగా ఉన్నాడు!"

"అయితే ఇంకేం చెప్పను?"

"ఏదోవోటి చెప్పు- ఆ రెండూ తప్పించి"

"ఓకే! ఏదో డిస్పెన్సరీలో కాంపౌండర్నని చెప్తాను."

"నన్నడిగితే అదీ మంచిది కాదు"

"అయితే మరేం చెప్పమంటావ్?"

"ఏదో కంపెనీకి సేల్స్ రిప్రజెంటేటివ్ అను"

"ఓకే! ఎగ్రీడ్"

ఇద్దరూ 'టీ' తాగేశారు.

"ఇంతకూ నువ్వేం చేస్తున్నావిక్కడ?" అడిగాడు చిరంజీవి.

"ఉద్యోగం"

"పాపం- నువ్ చేసేది ప్రైవేట్ కంపెనీయా, గవర్నమెంటా?" జాలిగా అడిగాడు చిరంజీవి.

"ప్రైవేట్ కంపెనీయే"

"గవర్నమెంట్ అయితే మనం ఇంత జాలిపడాల్సిన పరిస్థితి ఉండేది కాదు"

"అవును!"

"వాళ్ళనంత బలవంతం చేసిన రికమండేషన్ ఎవరిది?"

"మా మామయ్య వాళ్ళ ఫ్రెండ్‌ది"

"ఏమిటంత ప్రేమ మీ మామయ్యకు"

"ప్రేమ కాదు.. గుడ్డూ కాదు"

"మరి?"

"అదొక పెద్ద కథ! తరువాత చెప్తాలే గానీ- ఇంతకూ నీ మకాం ఎక్కడ?" అడిగాడు సింహాద్రి."

"కేరాఫ్ రైల్వే ప్లాట్ ఫారం!"

"అదేమిటి?"

"క్వార్టర్స్ దొరకలేదురా మరి! ఇంకేం చేస్తాను?"

"అల్‌రైట్. అయిదే ఓ పనిచెయ్"

"ఏమిటో చెప్పు?"

"రేపే నా రూమ్‌కొచ్చెసెయ్"

చిరంజీవి ఆనందంతో పొంగిపోయాడు.

"అయితే మళ్ళీ పాతరోజులు తిరిగి వచ్చేశాయన్నమాట"

"నిస్సందేహంగా"

"కాలేజీ హాస్టల్లోలాగా గడపొచ్చు"

"దాని బాబులాగా!"

"నిజంగా అవి గోల్డెన్ డేస్‌రా!"

"ప్లాటినమ్"

"మనల్ని హాస్టల్ నుంచి ప్రిన్సిపాల్ గెంటేయక పోయినట్టయితే ఇంకా చాలా ఎంజాయ్ చేసేవాళ్ళం"

"అయినా మనం రూమ్‌లో కుక్కల్ని పెంచుతే ఆ వార్డెన్ కెందుకు మంట?"

"అదే నాకు తల్చుకున్నప్పుడల్లా వళ్ళు మండేది! కుక్కలన్నాక ఇరవై నాలుగ్గంటలూ రూమ్‌లో ఉండమంటే ఉంటాయా? పైరుకెళ్ళవూ?"

"నల్ల కుక్కయినా వార్డెన్‌కి కరిచేది కాదు. వాడు దానిని చూసి భయపడి పరుగెత్తుతే దానికి అనుమానం వచ్చి- "సమ్‌థింగ్ రాంగ్ విత్ దిస్ ఫెలో" అనుకుని కాలుపట్టుకుంది. ఆ మాత్రానికే నానా రాద్ధాంతం చేసేశాడు"

"అక్కడికీ మనమే, మన ఖర్చుతో బొడ్డు చుట్టూ ఇంజక్షన్లు చేయిస్తామని ప్రామిస్ చేశాం కదా! అయినా వినిపించుకోకుండా ప్రిన్సిపాల్‌కి చెప్పాడు"

"అసలు అది పిచ్చికుక్కని వాడి అనుమానం"

"ఛ పాపం. అప్పటికసలు పిచ్చిలేదు దానికి! ఆ తరువాతయినా మననెందుకు కరవబోయిందంటే వాడిని కరవడం మూలానా వాడి పిచ్చే దీనికి ఎక్కి ఉంటుంది. వాడు మొదటి నుంచీ క్రాకే కదా!"

"అవునవును"

"కానీ రూమ్ ఖాళీ చేసే రోజు మాత్రం అది మరీ కోపంగా ఉండి మన వెనకపడింది చూడు. నిజంగా మనం భలేలక్కీగా తప్పించుకున్నాం. లేకపోతే ఇద్దరినీ కరిచేది"

"అదిప్పుడెక్కడుందో?"

"నేను ఆ మధ్య వెళ్ళినప్పుడు చూశాను. దుర్గామహల్ దగ్గర తిరుగుతోంది. నన్ను చూసి గుర్తుపట్టింది గానీ ఏను తెలీనట్లు సైకిల్ స్పీడ్‌గా తొక్కి తప్పించుకున్నాను"

"పూర్ డాగ్! మంచి ఫీట్స్ చేసేది!"

"ఒండర్‌ఫుల్ ఫీట్స్! ముఖ్యంగా ఎగ్జామినేషన్ రూమ్ కిటికిలో నుంచి మనిద్దరికీ కాపీలు అందించేది. గుర్తుందా? సూపర్బ్ ఫీట్! ఓసారి ఆ సీన్ చూసి మన వాచర్లే తప్పట్లు కొట్టారు! కదూ?"

"అవునవును!"

"కాపోతే దానిక్కొంచెం కోపం ఎక్కువ"

"అవును! ఆ కోపం చూసి పిచ్చి అనుకునేవాళ్ళు పిచ్చి వెధవలు!"

"రియల్లీ మాడ్ ఫెలోస్!"

"అఖరి పరీక్షనాడు పాపం అది ఎంతోకష్టపడి అందిస్తోన్న ఆఖరి కాపీ కాగితం ఆ వాచర్‌గాడు లాక్కోబోయి నప్పుడే కదా ఒళ్ళుమండి వాడిచేయి పట్టుకుంది."

"అవును! వాచర్ ఎంత తన్నుకున్నా వదిలింది కాదు. నాకు అదే తల్చుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది. వాచర్ చేయి వదిలేయమని మనం చెప్పినా విన్లేదు"

"ఒకోసారి అంతే అది! మనం చెప్పగానే వాచర్ చేయి వదిలేస్తే మనం అప్పుడే ఇంటర్ పాసయిపోయే వాళ్ళం"

"దాని మూలాన ఒక సంవత్సరం నష్టపోయాం"

"వాటెవర్ ఇట్ మేబి. స్టిల్ అలాంటి కుక్క, అయ్‌మీన్ అలాంటి ఇంటెలిజెంట్ డాగ్ మనకి దొరకడం చాలా కష్టం."

"కష్టమే అనుకో! బట్ స్టిల్ వుయ్ కెన్ ట్రై!"

"అంటే మళ్ళీ కుక్కని పెంచుదామంటావా?"

"డెఫినెట్‌లీ! ఎలాగూ ఇద్దరం కలసి ఉండబోతున్నాం కదా! చాలా సరదాగా ఉంటుంది. దానికి అన్నీ నేర్పడం, దాన్తోనే బోలెడు పనులు కూడా చేయించుకోవచ్చు. పాన్ దుకాన్‌నుంచి సిగరెట్లు, కిళ్ళీలు తెప్పించుకోవడం, పుస్తకాలు సర్దించడం"

"ఓకే అయితే వెతుకుదాం. మాంచి బ్రీడ్ కోసం"

"అబ్బే వెతకక్కర్లేదు. నా దృష్టిలో ఒక కుక్క వుంది"

"ఎక్కడ?" ఆశ్చర్యంతో అడిగాడు చిరంజీవి.

"నా రూమ్ కెదురుగ్గా వున్న ఎలక్ట్రిక్ పోల్ పక్కనే కూర్చుని వుంటుంది. వైట్ బాడీ బ్లాక్ ఫేస్".

"ఐసీ"

"వెరీగుడ్ డాగ్. రూమ్‌లో దిగినరోజే కనిపెట్టాను. నేను చూస్తూండగానే ఎవరో సైకిల్‌కి సంచీ తగిలించుకుని నడిచి వెళ్తోంటే ఒక్క ఎగురెగిరి సంచీలో పైకి కనబడుతున్న రొట్టె ఎత్తుకుపోయింది."

"వెరీ డేరింగ్ కదూ?"

"మనం కొంచెం ట్రైనింగ్ ఇస్తే చాలు! ఫర్‌ఫెక్ట్‌గా తయారవుతుంది. ఎందుకయినా మంచిదని దానికి నేను నిన్నే బిస్కెట్లు కొనిపెట్టాను. అప్పటినుంచి గది చుట్టూ తిరుగుతోంది."

"వెరీగుడ్" సంతృప్తిగా అన్నాడు చిరంజీవి.

"ఇంక నేను వెళ్ళనామరి? ఇప్పటికే అరగంట ఆలస్యం అయిపోయింది ఆఫీస్‌కి!" అన్నాడు సింహాద్రి టైమ్ చూసుకుంటూ.

"ఓకే! అన్నట్లు నీ రూమ్ అడ్రసేమిటి?"

"అడ్రసేముందిరా! కనుక్కోవడం చాలా తేలిక! మలక్‌పేట్‌కు వచ్చేసెయ్. అక్కడ శవం బ్రదర్స్ బ్రాందీ షాప్ కెదురుగ్గా.."

"శవం బ్రదర్సా?"

"ఓసారి శవం బ్రదర్స్ కాదు. శివం బ్రదర్స్."

"శవం బ్రదర్స్ అంటావేమిటి?"

"అది పెయింటర్ తప్పని హొటల్ మేనేజర్ చెప్పాడ్లే! పెయింటర్ పేరు తంగవేలు అనీ చకున్ చికేరి జాతి!"

"చకున్ చికేరియా?"

"యస్! చకున్ చికేరీయో, లేక కచిన్ పరాచీయో, పచిన్ కరాచీయో ఏదో సరిగ్గా గుర్తులేదు. అతనికి తెలుగు రాదు కదా! వాళ్ళు సికింద్రాబాద్‌లో వెరీ ఫేమస్. కనుక నువ్వెప్పుడయినా బ్రాందీషాపు పెడితే సికింద్రాబాదుని గుర్తుంచుకుని బోర్డు రాయించేటప్పుడు ఎవైడ్ చేసెయ్"

"డెఫినెట్‌లీ! ఇంతకూ ఆ శవం బ్రదర్స్ బ్రాందీషాపు కెంతదూరంలో వుంటుంది రూమ్?""

"శవం కాదు! శివం బ్రదర్స్ అనాలి! ఆ బ్రాందీషాపు కెదురుగ్గా సందులో వందమీటర్లు కొలచినడు! అంతే ఎదురుగ్గా ఆకుపచ్చ బిల్డింగ్! రోడ్‌మీదకే రూమ్. ఎదురుగ్గా ఎలక్ట్రిక్ పోల్. దానికింద కుక్క వైట్‌బాడీ, బ్లాక్ కలర్ మొఖం"

"ఇంటి నెంబర్?"

"ఇంటి నంబరా? 6-6-3-2-8-1-3-1-629/369-ఓ-ఎస్-కె-ఎన్-సి-బి-29-బార్.."

చిరంజీవి కంగారుపడ్డాడు.

"అది ఇంటినంబరా?"

"ఇంకా రెండు అంకెలు చెప్తే పూర్తి అవుతుంది!"

"అదేదో కోడ్ నంబర్‌లాగుందేమిటి? ఇంటినెంబర్లా లేదు."

"కాదు! ఇంటినెంబరేనని చాలామంది చెప్పారు"

"ఎవరువాళ్ళు?"

"చుట్టుపక్కవాళ్ళు. అదీగాక అదంతా ఇంటిగోడమీద కూడ రాసి వుంది!"

"సాదారణంగా బ్యాంకుల్లో స్ట్రాంగ్ రూమ్‌ల తాళం చేతుల కాంబినేషన్ నెంబర్లు

ఇలా వుంటాయని ఎక్కడో చదివాను"

"అదే హైదరాబాద్ కార్పొరేషన్‌వాళ్ళు కాపీ కొట్టారేమో"

"సరే. అదంతా ఇదుగో ఈ పుస్తకంలో రాసివ్వు. గుర్తుపెట్టుకోవడం నా వల్ల కాదు."

"పూర్ రిమెంబరెన్స్ పవర్" అతని మీద జాలిపడ్డాడు సింహాద్రి.

చిరంజీవి చేతిలోని పుస్తకం తీసుకుని నెంబర్ అంతా రాసిచ్చాడు.

"ఆఖరి రెండునంబర్లూ కొంచెం డౌటుగా వుంది. అయినా ఫరవాలేదులే! ఆ వీధిలోనే వున్నాయి ఆ రెండు నెంబర్లు కూడా. కనుక పెద్ద ప్రాబ్లెమ్ ఏమీ వుండదు"

"ఓకే సాయంత్రం అయిదున్నరకల్లా వచ్చేస్తాను" అన్నాడు చిరంజీవి.

"సరే" ఇద్దరూ బయటకు నడిచారు.

చిరంజీవి సైకిల్ ఎక్కేశాడు.

* * * * *

సింహాద్రి మళ్ళీ రోడ్డుమీద నడవసాగాడు. హఠాత్తుగా అతనిని దిగులు ఆవహించింది మళ్ళీ. ఆ దు:ఖం నుంచి ఎలా బయటపడాలో తెలీటం లేదు. శ్రీదేవి- శ్రీదేవి- శ్రీదేవి.

ఆ అమ్మాయి ఫోటో ఆ అమ్మాయి పేరు. అంతే! ఈ రెండే గత రోజున్నరనుంచీ తనను చిత్రహింసలు పెట్టేస్తున్నాయ్.

అలా ఎందుకు తను కృంగిపోతతున్నాడో తనకే అర్థం కావటం లేదు.

రెండు రోజులక్రితం అసలు ఆ అమ్మాయి ఎవరో, ఆమె పేరేమిటో తనకు తెలీదు. అసలు అలాంటి అమ్మాయి బాంబ్ నిలయం, రెడ్‌ఫీల్డ్, విశాఖపట్నంలో నివసిస్తోందనీ తెలీదు.

కాని ఈరోజు ఆ పిల్ల లేన్దే తన జీవితమే లేదు అనుకునే స్థితికొచ్చేశాడు.

ఎంత తమాషాగా వుంది?

ఆహా... విధి ఎంత లబీయమైనది- ఊహ! లభీయమైనది కాదు. గభీయమైనది అని వుండాలి. ఊహూ. అది కూడా కాదు. ఇంకేదో వుండాలి. టెన్త్‌క్లాస్‌లో చదివాడు తను. ఊహు టెన్త్ క్లాసులో కాదు. నైన్త్-నో- ఎయిత్ యస్. ఎయిత్ క్లాసులో. ఏ సబ్జెక్టులో? ఇంగ్లీష్‌లోనో, తెలుగులోనో? హార్నీ ఇంగ్లీష్‌లో అదెందుకుంటుంది? తెలుగులోనే. అవును. ఆరోపాఠంలోనో ఎనిమిదో పాఠంలోనో వుండాలి ఆ వాక్యం. విధి ఎంత భగీయమైనది. అవును గుర్తుకొచ్చేసింది. విధి ఎంత భలీయమౌనది. కరెక్ట్ తనకు తెలుసు. తనేదీ అంత ఈజీగా మర్చిపోడు!

రెండ్రోజుల క్రితం ఆ ఉత్తరం రాకుండావుంటే ఇవాళ తనకి దిగులు, బాధ నిరుత్సాహం ఇవేమీ వుండేవి కాదు గదా!

పోనీ కవరు చింపేముందయినా తను దానిమీద అడ్రస్ తనదో కాదో ఒకసారి చూసి వుంటే- ఆ కవర్ చింపేవాడే కాదు గదా!

పోనీ చింపెనుబో... చింపినవాడు ఆ ఉత్తరంలోనుంచి కిందపడిన ఫోటో చూసి తనకు సంబంధించినది కాదని తెలుసుకుని మళ్ళీ కవర్లో వుంచి మళ్ళీ పోస్ట్‌లో పడేస్తే దాన్దారిన అది పోయేది కదా!

అదీ చేయలేదు తను.

ఉత్తరం మొదట్లో శ్రీ ధనుంజయ్‌గారికి అన్న సంబోధన చూసినప్పుడయినా తను చదవడం ఆపి ఆ ఉత్తరం అంతకుముందు వరకూ ఆ రూమ్‌లో అద్దెకువుండి మరో ఇంటికి మారిపోయిన ప్రఖ్యాత రచయిత ధనుంజయ్‌కి ఎవరో రాసిన ఉత్తరం అని తెలిసికొని రీడైరెక్ట్ చేస్తే ఎంత బాగుండేది!

అదీ చేయలేదు తను.

ఆ ఫోటో పట్టుకుని రెండుగంటలు అలా నిలబడి చూస్తూ నిలబడిపోయాడు, ఆ తరువాత వుత్తరం చదివాడు.

"శ్రీ ధనుంజయ్‌గారికి!

నమస్తే. ఎవరా అనుకుంటున్నారు కదూ? నేనేనండీ! మీ అభిమాన పాఠకురాలు శ్రీదేవిని! ఏమిటీ! కోపం వచ్చిందా ఫోటో పంపలేదని! సారీ- ఈ మధ్య పరీక్షలుండడం వల్ల మీకు ఉత్తరం రాయలేకపోయాను. ఈ మధ్యే మీరు రాసిన "గతి తప్పిన మతి" నవల చదివాను. ఇటీజ్ రియల్లీ సూపర్బ్! అందులో హీరో విలన్‌ని హిప్నటైజ్ చేయడం- తద్వారా అతను చేసిన కిరాతకాలన్నీ తెలుసుకోవడం- నిజంగా అద్భుతంగా వుంది. ఈ నవల చదివాక ఎలాగయినాసరే మిమ్మల్నోసారి కలుసుకుని పర్సనల్‌గా అభినందించాలని నిశ్చయించుకున్నాను. నేనూ, మా డాడీ వచ్చే శుక్రవారం పనిమీద హైదరాబాద్ వస్తున్నాం. అక్కడ ఆ ఒక్కరోజే వుంటాము కనుక ఆ రోజు సాయంత్రం వీలు చూసుకుని మీ ఇంటికి వస్తున్నాం, దయచేసి నాకోసం ఎదురు చూస్తుంటారని ఆశిస్తాను. మీరు లేకపోతే చాలా డిజప్పాయింట్ అవ్వాల్సి వస్తుంది- వుంటారు కదూ! శ్రీదేవి"

ఆ క్షణంలో తనకు ఆ రచయితగాడి మీద ఎక్కడలేని ఈర్ష్య కలిగింది. అంత అందమయిన అమ్మాయి అభిమానం సంపాదించుకోవడం ఎంత అద్భుతం! ఇంతకాలం స్పోర్ట్సుమెన్‌కీ, సినిమా స్టార్స్‌కీ మాత్రమే గ్లామర్ వుందనుకుంటూ వచ్చాడు తను. రచయితలకు కూడా గ్లామర్ వుంటుందని తెలిస్తే తనూ కాలేజ్‌డేస్‌లోనే రచయిత అయిపోయేవాడు. ఇప్పుడు మాత్రం మించిపోయిందేముందీ! త్వరత్వరగా అయిదారు నవలలు రాసేయవచ్చు! కానీ అర్జెంటుగా శ్రీదేవి అభిమానం సంపాదించటం కష్టం

కదా!

తనకు శ్రీదేవి కావాలి ఎలా?

ఆమె వచ్చే శుక్రవారం తన రూమ్‌కొస్తుంది.

"నమస్తే" అంటుంది.

తనూ "నమస్తే" అంటాడు.

"మీరేనా ధనుజంయ్‌గారు?" అంటుంది.

"కాదు" అంటాడు తను.

"మరి మీరెవరు?" అంటుంది.

"నేనీ రూమ్‌లో కొత్తగా అద్దెకు వచ్చాను. నాపేరు సింహాద్రి. బిజిలీ అండ్ బిజిలీ కంపెనీలో క్లర్క్‌ని. అహహ– మేనేజర్‌ని!"

"ఓ.. అయామ్ సారీ! ఇప్పుడు రచయిత ధనుంజయ్ గారు ఎక్కడుంటున్నారో మీకు తెలుసా?" అనడుగుతుంది.

"సారీ! తెలీదు" అంటాడు తను.

"థాంక్స్" అనేసి ఆమె వెళ్ళిపోతుంది.

ఆ దు:ఖం భరించలేక తను మూర్ఛపోతాడు. అంతే! ఇంక ఆమె కనిపించదు. ఆ సీన్ తల్చుకోడానికే దారుణంగా వుంది.

ఆఫీస్‌కి చేరుకున్నాడు సింహాద్రి.

సాయంత్రం అయిదున్నరకల్లా ఓ చేతిసంచీ తీసుకుని రూమ్‌కొచ్చేశాడు చిరంజీవి.

"మిగతా సామానేది?" ఆశ్చర్యంగా అడిగాడు సింహాద్రి.

"మిగతా సామానేమిటి?" ఇంకా ఆశ్చర్యంగా అడిగాడు చిరంజీవి.

"అదే– నీ మిగతా సామాను!"

"నా మిగతా సామానేముంది?"

"అదేమిటి? ఇంకేం సామానులేదూ?"

"ఇదిగో– సామానంతా ఈ సంచీలోనే వుంది"

"మరి పక్కబట్టలూ వగయిరా"

"పక్కబట్టలా?" పగలబడి నవ్వాడు చిరంజీవి. "మాకు పక్కబట్టలెందుకు?"

"అంటే?"

"ఎప్పుడూ నైట్ డ్యూటీలు చేసేవాళ్ళకు పక్కబట్టలెందుకురా?"

"మరి రెస్ట్ రోజున ఏం చేస్తావ్?"

"రెస్ట్ రోజున ఫస్ట్ షోకీ సెకండ్‌షోకీ వెళ్తాం కదా! ఆ తరువాత చార్‌మినార్ దగ్గరున్న రెడ్‌రోజ్ ఇరానీ హోటల్‌కెళ్ళి 'టీ' తాగి రావాలికదా! అప్పటికి తెల్లారిపోతుంది. అది సరేగానీ ఇల్లు చాలా బావుందిరా. ఎంతక్కొన్నావ్?"

"పిచ్చివాగుడు వాగకు. ఈ మధ్యే అద్దెకు దిగాను. కొన్నావ్ గిన్నావ్ అంటే ఇంటి ఓనర్ ఇద్దరినీ బయటకు గెంటుతాడు"

"ఓకే! ఆ టాపిక్ మానేసి ఎడ్జస్టయిపోదాం!" సంచీ ఓ పక్కనపెట్టి కుర్చీలో కూలబడ్డాడతను.

"ఆహా! ఎంత కాలమయిందిరా పడక్కుర్చీలో కూర్చుని! అదిసరేగాని మన భోజనం మాటేమిటి? మన భోజనవసతి గృహం ఏది?"

"దగ్గరేలే!"

"రుచికరంగా వుంటుందా, లేక మా రైల్వే కాంటీన్‌లో భోజనం లాగుంటుందా?"

"అంత గొప్పగా వుండదుగానీ, మరీ రైల్వే కాంటీన్‌లోలా మాత్రం వుండదు"

"అయితే ఫరవాలేదు. రోజూ భోజనం చేయవచ్చు" ఆనందంగా అన్నాడు చిరంజీవి.

రామనాథం సింహాద్రితోపాటు వచ్చిన చిరంజీవిని చూసి ముచ్చటపడ్డాడు.

మన "ఫ్రెండాండీ?" అనడిగాడు వినయంగా.

"అవును" అన్నాడు సింహాద్రి.

"అంటే– ఇదివరకు వచ్చిన రాధాకృష్ణగారి లాగానండీ!"

"అవును"

"అంటే వీరు కూడా టేబుల్‌మీద కత్తిగుచ్చి బాంక్ పరీక్షలు రాసి బాంక్ ఆఫీసర్‌గా సెలక్టయారాండీ?"

"నో నో నాటెటాల్! నీ పేరేంటోయ్?" అతన్నడిగాడు చిరంజీవి.

"రామనాథం అండీ!"

"చూడు రామనాథం! టేబుల్ మీద కత్తిగుచ్చటం మన పాలసీకాదోయ్! అది మా బాచ్‌మేట్ రాధాగాడి పాలసీ. దానికి మేమేమాత్రం బాధ్యులం కాదు. నాది అంతా శాంతియుతమయిన పాలసీ! లివ్ అండ్ లెట్ లివ్ అంటే బతుకు బతకనీ పాలసీ అన్నమాట! కత్తులతో సర్వీస్ కమిషన్ పరీక్షలు రాయడం మన పాలసీకి విరుద్ధం! నేనెప్పుడూ పరీక్ష తాలూకు ప్రశ్నా పత్రాలు కొని రాస్తాను. రెండ్రోజులు ముందే కొంటానన్నమాట. అంతేగాని కత్తులూ కటార్లూ ఛఛ! అవుట్ డేటెడ్! ట్రైబల్ కల్చర్ అది. వాళ్ళు కూడా కత్తులు వాడటం లేదిప్పుడు"

రామనాథం ఆనందించాడు.

"మా బాగా చెప్పారు సార్! నిజమే! కత్తులేమిటండీ నాకర్థం కాదు. అలాంటి వెధనపన్లు బొత్తిగా నచ్చవండీ నాకు. మా తమ్ముడు కూడా రాధాకృష్ణగారి లాగానే కత్తి తీసుకుని పరీక్ష కెళ్తూంటే నేను కత్తి లాగేసుకున్నానండీ! అందుకే ఆడు వాచర్ని మెడపిసికి చంపినా కోర్టులో కేసు నిలవలేదండీ! మా వాడు నిర్దోషి అని వదిలేసి పరీక్ష పాస్ చేయించేశారు. అదే నేను గనుక కత్తి లాక్కోపోయినట్లయితే మరి రుజువులు దొరికిపోయి మా వాడిని జైల్లో వేసేవారే కదండీ!"

"అవునవును" ఒప్పుకున్నాడు చిరంజీవి.

"నువ్ చాలా ఇంటెలిజెంట్ పనిచేశావ్! అందుకే మనమెప్పుడూ కత్తుల జోలికి పోగూడదోయ్! ఆంధ్రప్రదేశ్‌లాంటి అద్భుతమైన రాష్ట్రంలో వుండి మనకా ఖర్మెందుకు చెప్పు! ఏ పరీక్ష రాయాలన్నా వారం రోజులు ముందే ఆ పరీక్ష కొశ్చెన్ పేపర్లు ఓపెన్ మార్కెట్లో దొరుకుతుంటే కత్తులేమిటోయ్? మీ తమ్ముడు చాలా అనవసరమయిన అభిప్రాయాల్తో నిండిపోయినట్లున్నాడు. నన్నడిగితే వాచర్ని మెడ పిసకడం కూడా అనవసరం అంటాను. వాళ్ళు మాత్రమేం చేయగలరు? పూర్ ఫెలోస్! కావాలంటే డొక్కలో రెండు పిడిగుద్దులు వేస్తే చాలు. కిక్కురుమనకుండా పడివుంటారు. నన్నడిగితే అది కూడా అనవసరం అంటాను. కొశ్చెన్ పేపర్లు ఈవెనింగ్ మార్కెట్లో ఫుట్‌పాత్‌ల మీద గుట్టలు గుట్టలుగా అమ్ముతుంటే..."

రామనాథానికి విసుగు పుట్టుకొచ్చింది.

"ఇప్పుడే భోజనం వడ్డిస్తాను" అనేసి లోపలకు పరుగెత్తాడు.

* * * * *

"అవున్రా! నాకు తెలీకడుగుతాను- నీకీ దిక్కుమాలిన బతుకెందుకు? డిజిగ్నేషన్ లేని ఉద్యోగం, ఈ గదిలో ఈసురోమంటూ ఉండడం. ఆ హెటల్ రామనాథం గాడు భోజనం అన్న పేరుతో వడ్డించే చెత్తంతా తినడం- ఎందుకొచ్చిన చావు" గదిలో కొచ్చాక నిద్రావస్థలోకి జారిపోతూ అడిగాడు చిరంజీవి.

"హా..." అని ఆవలించి ఆవలింతలోనే మాట్లాడాడు సింహాద్రి.

"ఇంకేం జేయమన్టావురా"

"నీ తాతెవరో నీ పేరుమీద కొంచెం ఆస్తి వదిలి వెళ్ళాడు కదా! అది తింటూ ఏసీ రూమ్‌లో జీవితం గడపక ఎందుకొచ్చిన తిప్పలు ఇవి?"

"అదో పెద్ద కథరా!"

"సీరియల్ నవలంత కథా?"

"అంతకంటే కొంచెం చిన్నది"

"అయితే చెప్పు"

"ఆ ఆస్తికి మా వయ్యకు ట్రస్టీగా పెట్టాడు తాతయ్య. నాకు పాతికేళ్ళొచ్చే వరకూ ఆ ఆస్తిలో ఒక్క పైస కూడా రాదు."

"వెరీ బాడ్" జాలిపడ్డాడు చిరంజీవి.

"చాలా బాడ్" వప్పుకున్నాడు సింహాద్రి.

"ఇప్పుడు నీ ఏజ్ ఎంత?"

"ఇరవై నాలుగు"

"అడెడెడెడె... నువ్వు ఇంకొక్క సంవత్సరం ముందు పుట్టి వుంటే ఈపాటికి నీ చేతికొచ్చేసేది"

"అవును. కానీ అలా కుదర్లేదు కదా"

కొద్దిసేపు ఆలోచనలో పడ్డాడు చిరంజీవి. తను ఏదో ఉపాయం ఆలోచించి సింహాద్రిని ఆ ట్రస్టీ కోరల నుంచి రక్షించాలనిపించిదతనికి.

"ఆ! బ్రహ్మాండమయిన అయిడియా దొరికింది" గట్టిగా అరచి లేచి కూర్చున్నాడతను.

"ఏమిటది? తనూ లేచి కూర్చుంటూ అడిగాడు సింహాద్రి.

"నీ యస్సెల్సీ రిజిష్టరులో డేటాఫ్ బర్త్ సంవత్సరం మార్చెయ్"

"అదీ మావయ్య ఇనప్పెట్టెలో ఉంది"

"ఓహో! అక్కడ దెబ్బతిన్నావన్నమాట! పోనీ ఈ ఒక్క సంవత్సరం ఖర్చులకుగాను ఓ లక్ష అప్పుగా ఇమ్మనకపోయావా?"

"అడిగాన్రా బాబూ! లక్ష కాదుగదా ఒక్క పైసా కూడా ఇవ్వనన్నాడు"

"వట్టి క్రాక్‌లాగ ఉన్నాడు"

"పరమ క్రాక్"

"ఆరోజు కాలేజీ హాస్టల్ నుంచి ప్రిన్సిపాల్ మనను బయటకు గెంటినప్పుడు కూడా మనిద్దరి మీదా చాలా అసహ్యంగా అరిచి గొడవచేశాడు"

"మనం కాబట్టి ఊరుకున్నాంగానీ అదే ఇంకెవరైనా అయితే 'గెట్‌లాస్ట్' అనేవాళ్ళు"

"అనేవాళ్ళేంటి గెంటేసేవాళ్ళు"

"ఫైనలియర్లో ఉండగా మనం సెకండ్‌షో సినిమాకెళ్తే హాల్లో ఆటమధ్య మనని సిగరెట్ తాగుతూండగా పట్టుకుని పోలీసుల కప్పజెప్పాడు గుర్తుందా?"

"హారబుల్ సైట్ అది! ఎలా మర్చిపోతాం? పోలీస్ స్టేషన్లో ఆ నల్లులు, లాకప్‌లో ఉన్న వాళ్ళ కేకలు, ఏడుపులతో పిచ్చెక్కిపోయింది. అవునూ అలా రాత్రంతా లాకప్‌లో

ఎందుకు పడేశారా అనేది నాకింతవరకూ అర్థం కాలేదు"

"ఎందుకేమిట్రా.. అలా చేయమన్జెప్పి మావయ్యే ఆ పోలీసులకు బోలెడు డబ్బిచ్చాడట"

"కర్కోటకుడు"

"మహా కర్కోటకుడు"

"గుడ్‌నైట్. నిద్రొచ్చేసింది" అనేసి గురక మొదలుపెట్టి నిద్రలోకి జారిపోయాడు చిరంజీవి.

* * * * *

హఠాత్తుగా తమ పక్కనే ఏదో పెద్ద ప్రేలుడు సంభవించిన శబ్దమయేసరికి ఇద్దరకూ ఛటుక్కున మెలకువల వచ్చింది.

"ఏదో పెద్ద శబ్దం అయినట్లుంది కదూ?" కళ్ళు నులుముకుంటూ అన్నాడు సింహాద్రి.

చిరంజీవి ఒప్పుకున్నాడు.

"రెండు రైళ్లు హెడాన్ కొలీజన్ అయినట్లు నాకు కలవచ్చింది. సరిగ్గా అదే సమయానికి ఆ శబ్దం వినిపించే సరికి నిజంగా యాక్సిడెంట్ అయిందేమో అని భయం వేసింది"

"ఇంతకూ ఆ శబ్దం ఏమిటంటావ్?"

"ఏమో అదే అర్థం కావటం లేదు"

ఇద్దరూ మళ్ళా పడుకోబోతూండగా మరోసారి తలుపు మీద పేలుడు పదార్థం విసిరినట్లు తలుపుకొట్టారెవరో!

"అది మన తలుపుకొడుతున్న శబ్దం లాగుంది" అన్నాడు సింహాద్రి లేవకుండానే.

"అవును ఏం చేద్దామంటావ్?"

"తలుపు తీసి చూడు"

"ఇంత అర్థం రాత్రివేళ ఎవరయి ఉంటారంటావ్?"

"ఏమో! ఇంటి ఓనరుకి మొన్నే అద్దె కట్టేశాను కదా– ఇకెవరబ్బా..."

ఇద్దరూ ఆలోచనలో వుండగానే తలుపులు ఊడిపడేట్లు బాదారెవరో. ఆసారి ఆ శబ్దంతోపాటు ఓరే సింహాద్రి అన్న బండగొంతుకొకటి కూడా కలిసి వినిపించింది.

చిరంజీవి లేచి వెళ్ళి తలుపు కొద్దిగా తెరచి చూశాడు.

మరుక్షణం ఆ సందులోనుంచి లోపలకు దూసుకొచ్చాడు విశ్వనాథం.

అతన్ని చూడగానే సింహాద్రి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"నువ్వా మా వయ్యా!" అన్నాడు గాబరాగా.

"నీకేమైనా బుద్ధుందా?" అన్నాడు విశ్వనాథం ఉగ్రరూపం దాల్చి.

సింహాద్రి కేమీ అర్థం కాలేదు. అసలు ఇంత రాత్రివేళ మావయ్య తన రూమ్‌కి

రావడమే అయోమయంగా వుంటే, రాగానే "నీకు బుద్ధుందా" అని అడగడం ఇంకా అయోమయంగా ఉంది.

"బుద్ధా?" అడిగాడతను ఆశ్చర్యంగా.

"అవును"

"ఏం బుద్ధి?"

"ఇంకేం బుద్ధి – అదే– బుద్ధంటే కూడా తెలీని చవటా!"

సింహాద్రి పరిస్థితి ఇట్టే గ్రహించాడు. తాను అలా బుద్ధి గురించి అడిగిన కొద్దీ ఆయన రెచ్చిపోతాడు. అదివరకూ ఓసారి ఇలాగే తను అడిగిన ప్రతి విషయానికీ రెచ్చిపోయి నూట పధ్నాలుగు తిట్లు తిట్టాడు తనను. అంచేత ఇప్పుడు వెంటనే టాపిక్ మార్చేయాలని నిర్ణయించుకుని "ఇంత అర్ధరాత్రి వచ్చావేమిటి మావయ్యా" అన్నాడు అమాయకంగా.

విశ్వనాథం కోపంతో ఎగిరి దూకినంత పన్జేశాడు.

"ఏమిట్రా కూశావ్? ఇంత అర్ధరాత్రి ఎందుకొచ్చాననా? ఇంత అర్ధరాత్రి ఎందుకొచ్చాననా?"

సింహాద్రికి చిరాకేసుకొచ్చింది.

ఏమిటలా తనడిగే ప్రతిదీ పదిసార్లు రెట్టిస్తాడు? చిరంజీవి వేపు చూశాడతను.

చిరంజీవి తనకూ ఆ పెద్దమనిషి ధోరణి ఆశ్చర్యంగానే ఉందన్నట్లు భుజాలెగరవేశాడు.

"అవును మా మయ్యా! అర్ధరాత్రి వచ్చేవేమిటి మావయ్యా అనడిగేను. ఏమిటి తప్పందులో?" అడిగాడు సింహాద్రి కూడదీసుకుని.

"ఒరేయ్ ఉష్ట్రపక్షీ! ఇది అర్ధరాత్రి కాదురా.. పగలు పట్టపగలు! తెల్సిందా? మంద్రగబ్బ మొఖం నువ్వూనూ! లేచి ఓసారి బయటికొచ్చి చూడు. ఉదయం పదయిందిరా!"

సింహాద్రి ఆశ్చర్యపోయాడు.

ఉదయం పదయిందా?

నమ్మకం చాలక కిటికీ తెరచి చూశాడు. చుట్టూ జనం. తన గది చుట్టూ ఓ పాతిక మంది నిలబడి విచిత్రంగా తనవంక చూస్తూ కనిపించారు.

"వీళ్ళందరూ ఎవరూ?" చిరంజీవి వేపు చూసి ఆశ్చర్యంగా అడిగాడతను.

"ఎవరేమిట్రా? 'జూ' చూడ్డానికొచ్చిన వాళ్ళు. తలుపులు రెండు గంటల నుంచీ కొడుతున్నా నిద్రలేవని జంతువులెలా వుంటాయోనని చూడ్డానికొచ్చారు."

సింహాద్రి కేమాత్రం అర్థం కావటం లేదాయన మాటలు. అసలు ఒకదానికొకటి సంబంధం లేకుండా ఉంటున్నాయ్?

ఇలా మాట్లాడుతుంటే ఎవరికి మాత్రం ఏమి అర్థమవుతుంది?

“నీకేమయినా అర్థమయినయ్యా?” చిరంజీవి నడిగాడతను.

చిరంజీవి అడ్డంగా తలూపాడు.

“నేనూ ఫస్ట్‌టైమ్ వింటున్నాను. ఇలా ఇంతసేపు అర్థం లేకుండా మాట్లాడడం చాలా గొప్ప సంగతే!” అన్నాడు నెమ్మదిగా.

“నోర్మూసుకోండి...” మళ్ళీ చెవులు పగిలేట్లు అరిచాడు విశ్వనాథం.

ఇద్దరూ సైలెంటయిపోయారు.

“అంటే రోజూ పన్నెండింటివరకూ నిద్రపోతూ ఆఫీసెగ్గొడుతున్నావన్నమాట! అంతేనా?” అడిగాడతను.

“ఛ ఛ అదేం లేదు మావయ్యా! సాధారణంగా రోజూ తెల్లవారుజామున ఏడున్నరకే లేస్తాను. కావాలంటే వాడి నడుగు”

“అవునండీ! పాపం వాడు ఏడున్నరకే లేచేసి– లేచేసి.... అంతేనండీ! లేచేస్తాడు”

విశ్వనాథానికి చిరంజీవి మీద వళ్ళు మండిపోయింది.

“నీ బోడి సాక్ష్యం ఎవ్వడూ అడగలేదిక్కడ” అన్నాడు విరుచుకుపడుతూ.

“అడగలేదాండీ?”

“లేదు”

“సింహాద్రి అడిగాడు కదండీ”

“వాడికి బుద్ధిలేదు కనుక అడిగాడు”

“అయితే సరేనండీ”

“ఏమిటి సరే?” మరింత రెచ్చిపోతూ అడిగాడు విశ్వనాథం.

“అంటే అదేనండీ ఓ... కే...”

“ఎందుకు ఓ... కే..”

చిరంజీవికి విసుగు పుట్టుకొచ్చింది గానీ ఏం మాట్లాడితే మళ్ళీ ఇంకేం గొడవవు తుందో అని సైలెన్సయిపోయాడు.

విశ్వనాథం కొంచెం శాంతించాడు.

“ఊ!” అన్నాడు తను చెప్పదల్చుకుంది ఏమిటా అని ఆలోచిస్తూ. అదేమిటో ఎంత ఆలోచించినా గుర్తురాటం లేదు. రాగానే అయితే ఠపీమని గుర్తుకొచ్చేసేది. కానీ వీళ్ళిద్దరూ కలిసి వెధవ్వాగుడు వాగి తన మైండ్ డైవర్ట్ చేసేశారు. అవునూ అసలు వీళ్ళిద్దరూ ఎలా కలిసి ఉన్నారిక్కడ”

ఛటుక్కున చిరంజీవివేపు చూశాడతను.

“ఇంతకూ నువ్వెలా ఉన్నావీ రూమ్‌లో?” సడెన్‌గా పోలీస్ స్టేషన్‌లోనే దొంగను

పట్టుకున్న కానిస్టేబుల్లా అడిగాడు.

చిరంజీవి కొంచెం కంగారుపడ్డాడు.

“నేనా? నేనూ... నేను... మామూలుగానే ఉన్నానండీ”

“నేనడిగేది అసలీ రూమ్‌కెలా వచ్చావని!”

“అదా? అది భలే అనెక్స్‌పెక్టెడ్‌గా జరిగిపోయిందిలెండి”

సింహాద్రి ఠక్కున అందుకున్నాడు.

“అవును మావయ్యా! చాలా తమాషాగా జరిగింది”

“ఏమిటా తమాషా”

“నాకు సడెన్‌గా అబిడ్స్‌రోడ్ మీద కనిపించాడు. అదీ సర్దార్జీ గాలిలోకి లేపబట్టి క్లియర్‌గా కనిపించాడు గానీ లేపోతే కలుసుకునేవాళ్ళం కాదు.’

“అవునవును! సర్దార్జీ తన కాలేజ్ డేస్‌లో మాంచి స్పోర్ట్‌మెన్ అయివుండాలి” ఒప్పుకున్నాడు చిరంజీవి.

“లేదా వెయిట్ లిఫ్టింగయినా ప్రాక్టిస్ చేసివుండాలి. సో– తనూ ఇక్కడే వర్క్ చేస్తున్నానని చెప్పాడు మావయ్యా! పాపం రైల్వేవాళ్ళు క్వార్టర్సు ఇవ్వలేదట! అందుకని ఫ్లాట్‌ఫారం మీదే ఉంటున్నాడట. అలా ఎప్పుడూ ఫ్లాట్ ఫారమ్ మీద ఉంటే పాపం పాసింజెర్స్‌కి కష్టం కదా! అందుకని నా రూంకి వచ్చేయమన్నాను”

విశ్వనాథానికి మళ్ళీ కోపం ముంచుకొచ్చింది.

వాళ్ళిద్దరూ కాలేజీలో చదివే రోజుల్లోనే ఇద్దరినీ ఒకే రూమ్‌లో ఉండకుండా వేరువేరుగా ఉంచేలా ఎన్నో ప్రయత్నాలు చేశాడు తను. కానీ కుదరలేదు. ఒకే క్లాసులో ఉండకుండా చేయమని ప్రిన్సిపాల్‌కి కూడా ఉత్తరాలు రాశాడు. అయినా ఫలించలేదు. చివరకు ఈ ఉద్యోగం పుణ్యమా అని సింహాద్రి హైదరాబాద్‌లో చిరంజీవికి దూరంగా ఉంటాడని ఆశపడ్డాడు. కానీ ఏమయింది? ఆ చిరంజీవి వెధవ కూడా ఇక్కడే ఉద్యోగం చేస్తూ తయారు.

“అయితే నీకు పాపం క్వార్టర్స్ ఇవ్వలేదన్నమాట.” అడిగాడు విశ్వనాథం ఆలోచిస్తూ. ఎలాగోలా వాళ్ళిద్దరినీ వేరు చేయకపోతే మళ్ళీ ఇద్దరూ కలసి నానా రభసా చేస్తారు. అంతేకాదు. వాడి మాటలు వింటే సింహాద్రిగాడు వట్టి జులాయి వెధవ అవాల్సిందే.

“ఇవ్వలేదండీ!” చెప్పాడు చిరంజీవి.

“ఎందుకని?”

“దానికి చాలా పెద్ద రికమండేషన్ కావాలండీ! రైల్వే మినిష్టరుదో లేక మా జనరల్ మేనేజర్‌గారి వ్యూన్‌దో రికమండేషనుంటేగానీ ఇవ్వరు.”

"అయితే ఓ పని చేద్దాం! నేనే నీకు వేరే ఇంకో మాంఛి రూమ్ వెతికి పెడతాను"

చిరంజీవికి పరిస్థితి అర్థమయిపోయింది. కానీ అర్థం కానట్లు మొఖం పెట్టాడు.

"అబ్బే! ఎందుకండీ మీకాశ్రమ! ఎలాగోలా ఈరూమ్‌లోనే ఎడ్జస్టయి పోతాం! కదురా?" సింహాద్రి నడిగాడతను.

"అవును మావయ్యా. ఏం ఫరవాలేదు. వుయ్ కెన్ మానేజ్"

"అదీగాక నాకెప్పుడూ నైట్ డ్యూటీలు గనుక రాత్రుళ్ళు నేనింట్లో వుండను. సింహాద్రికి పగలు ఆఫీస్ గనుక వాడు పగలు ఇంట్లో వుండడు."

విశ్వనాథం ఇంకేమీ మాట్లాడలేకపోయాడు. కానీ లోపల మాత్రం అశాంతి పేరుకు పోతోంది.

"ఇద్దరికీ ఇప్పుడే వార్నింగిస్తున్నాను గుర్తుంచుకోండి! మళ్ళీ అడ్డమయిన కుక్కల్నీ తెచ్చి రూమ్‌లో పెట్టి పెంచారంటే మాత్రం మర్యాదగా వుండదు" అన్నాడు కోపం అణచుకుంటూ.

"కుక్కల్నా? ఎందుకు వాటిని పెంచడం? నోనోనో... అలాంటి హాబీలన్నీ ఎప్పుడో మానేశాం మావయ్యా!"

"అవునండీ! కాలేజ్ డేస్‌లోనే మానేశాం! అదంతా పిచ్చిపని"

"అలా అని నన్ను నమ్మమంటారు?" అడిగాడు విశ్వనాథం.

"సెంట్‌పర్సెంట్ నమ్మాలండీ! మేము ఒకటి రెండు వెధవపనులు చేస్తే చేసి వుండవచ్చు. కానీ అబద్ధాలు మాత్రం ఎప్పుడూ చెప్పలేదు"

"నెవర్ నెవర్..." అన్నాడు సింహాద్రి.

"ఒకవేళ ఎప్పుడయినా ఏదయినా అబద్ధం చెప్పినా అదంతా కేవలం అనుకోకుండా అకస్మాత్తుగా జరిగిన పనేగాని ఇన్‌టెన్షనల్‌కాదు"

"సెంట్‌పర్సెంట్ కరెక్ట్!"

"అసలు ఇద్దరం అబద్ధాలంటే ఎంతో అసహ్యించుకుంటామండీ! మొన్నోరోజు మా ఫ్రెండొకడు ఇలాగే అబద్ధం చెప్తే వాడిని ఇంకోసారి మా కంటికి కనబడవద్దని వార్నింగిచ్చాం! అసలు మీతో మాత్రం ఒక్కసారయినా అబద్ధం చెప్పామా?"

విశ్వనాథానికి వళ్ళు మండిపోతోంది.

"లక్షసార్లు చెప్పారు" అన్నాడు కసిగా.

"ఎప్పుడు?"

"ఎప్పుడూ చెప్పేది అబద్ధాలే అయితే ఇంక గుర్తెలో వుంటుంది?"

"నోనో! యూ ఆర్ మిస్టేకెన్ సర్! అబద్ధాలు చెప్పడం ఎప్పుడూ జరగలేదు. కేవలం

మీరు మమ్మల్ని అపార్థం చేసుకుంటున్నారు. అంతే" సింహాద్రిని బ్రహ్మాండగా సపోర్ట్ చేయాలని నిశ్చయించుకుని అన్నాడు చిరంజీవి.

సరిగ్గా అప్పుడే అంతకుముందు రోజు సింహాద్రి ఆరు బిస్కెట్లు పెట్టిన కుక్క మళ్ళీ ఆ రోజు కోటా కోసం గదిలో కొచ్చేసింది వేగంగా. వచ్చి అక్కడున్న ముగ్గురినీ చూసి, ఎందకయినా మంచిదని పలుకరింపుగా నవ్వి అప్పుడు సింహాద్రి భుజాలమీద రెండు కాళ్ళూ వేసి అప్యాయంగా మొఖమంతా నాకబోయింది.

సింహాద్రి మొఖం పాలిపోయింది.

"ఛీ ఫో" అన్నాడు కంగారుగా.

ఆ కుక్క అతని మాటలు పట్టించుకోలేదు. ఎందుకంటే కొంతకాలం అది ఓ మంత్రిగారింట్లో వుంది. అంచేత సిగ్గూ, శరం అంటే ఏమిటో బొత్తిగా మర్చిపోయింది.

మొఖం నాకే కార్యక్రమం ప్రస్తుతానికి వాయిదా వేసి బిస్కెట్ల కోసం అతనిచుట్టూ తిరిగి వెతకసాగిందది.

విశ్వనాథం మళ్ళీ అగ్గి అయిపోయాడు.

"ఏమిటిది?" అన్నాడు ఛాన్స్ దొరికింది గదాని.

"కుక్క" అన్నాడు చిరంజీవి.

"వీధి కుక్క" అన్నాడు సింహాద్రి. ఎలాంటి అనుమానాలకూ తావు లేకుండా!

"వీధి కుక్కని తెలుసులేవోయ్. ఆ విషయం దాని మొఖం చూస్తేనే తెలుస్తోంది. అదిప్పుడు ఈ గదిలోకెందుకొచ్చిందని అడుగుతున్నాను"

సింహాద్రికేం చెప్పాలో తెలీలేదు. సహాయం కోసం చిరంజీవివేపు చూశాడు. చిరంజీవి గొంతు సవరించుకున్నాడు.

"అదే మేమూ చూస్తున్నాం. ఇంత ధైర్యంగా లోపలికెలా వచ్చిందా అని. ఛీ ఫో" అంటూ దానిని బయటికి తరమబోయాడు.

అది పరిస్థితి గ్రహించి సింహాద్రిని వదిలి చిరంజీవి దగ్గరకొచ్చి అతని మొఖం నాకడానికి ప్రయత్నం చేయసాగింది. అతనిని కూడా మంచి చేసుకుంటేగాని తనకు రిలీజ్ చేయాల్సిన బిస్కెట్ల కోట తనకు గిట్టదని అనుమానం కలిగింది దానికి.

"ఇలాంటి దగుల్బాజీ అబద్ధాలు చెప్పడానికి సిగ్గుండాలి" అన్నాడు విశ్వనాథం.

"నిజంగా మావయ్యా! ఇది మాది కాదు" అన్నాడు సింహాద్రి.

"మీద కాకపోతే పొమ్మన్నగానే బయటకు పోదేం?"

"అదే మాకూ అర్థం కావటం లేదు" అంటూ చిరంజీవి లేచి దానిని కాలితో తన్నబోయాడు. ఆ కుక్క దగ్గర ఓ గుణం వుంది. అదేమిటంటే తననెన్ని తిట్టినా సహిస్తుంది.

ఎంత అవమానాల పాల్జేసినా ఒప్పుకుంటుంది. తిండి పెట్టకపోయినా కాళ్ళదగ్గరే పడివుంటుంది. కాని తిండి పెట్టకపోగా, తన్నబోతే మాత్రం ఎక్కడలేని తిక్క పుట్టుకొస్తుంది. తిక్క పుట్టుకొచ్చినప్పుడు మాత్రం ఏం చేస్తుందో దానికే తెలీదు. ఎలక్షన్‌లో ఓడిపోయిన మినిష్టరుగారు ఆ కోపంలో దానిని తన్నబోయినప్పుడు ఇలాగే తిక్కరేగి అందినచోటల్లా కరచి ఆ ఇల్లు వదిలి రోడ్డునపడింది. మళ్ళీ ఆ ఇంటి మొఖం చూడలేదు. ఇప్పుడు చిరంజీవి చేయబోయిన విన్యాసం కూడా దానికి నచ్చలేదు. అంచేత పళ్ళు బయటపెట్టి గుర్రుమంది. దాంతో ఆటోమేటిగ్గా చిరంజీవి ఎగిరి సింహాద్రి మంచంమీద నిలబడ్డాడు. అతను ఎగరడం వల్ల అల్మారా మీదున్న పుస్తకం చేతికి తగిలి శరవేగంతో ఎగిరి విశ్వనాథం భుజం మీద తాకట, విశ్వనాథం ఉలిక్కిపడి ఎగిరి గెంతడం, అతనలా ఎగరడం కేవలం తనమీద దండయాత్రకే అని ఆ కుక్క మనస్ఫూర్తిగా నమ్మి అతని కాలిని కసిగా కొరికి పారిపోవడం అంతా చాలా త్వరగా సిస్టమేటిక్‌గా జరిగిపోయింది.

రెండు నిమిషాలవరకూ రూమ్ నిశ్శబ్దంగా వుండిపోయింది. అప్పటికి గాని విశ్వనాథం షాక్ నుంచి తేరుకోలేదు. తేరుకుంటూనే అంతా గుర్తుకొచ్చి తన కాలివంక చూసుకుని కెవ్వుమని అరచాడు.

"అబ్బా... అబ్బా! కరచింది! వెధవ కుక్క! దొంగ రాస్కెల్స్.. వెధవల్లారా! అందుకే కుక్కల్ని పెంచొద్దురా అంటే వినరు"

"అబ్బే- అది మా కుక్క కాదు మావయ్యా! ఇంకా పెంచుకోవటం లేదు దాన్ని" ప్రొటెస్ట్ చేయబోయాడు సింహాద్రి.

"నోర్మూసుకోరా పక్షీ! అది మీదే మీదే మీదే! మీదవబట్టే నన్ను కరిచింది! లేకపోతే నన్నే ఎందుక్కరుస్తుందీ అంట? మీ ఇద్దరినీ ఎందుక్కరవలేదూ అంట! అమ్మో అమ్మో! నేనిప్పుడు బొడ్డుచుట్టూ పధ్నాలుగు ఇంజక్షన్లు చేయించుకోవాలి"

చిరంజీవికి అతనిని చూస్తే జాలివేసింది.

"పధ్నాలుగు అక్కర్లేదండీ! ఎనిమిది చాలు!"

"ఎనిమిదేమిట్రా నీ బొంద! పధ్నాలుగూ చేయించుకోవలసిందే!"

"అక్కరలేదండీ! ఎనిమిది సరిపోతాయ్"

"నువ్వు నన్ను చంపాలనే ఎనిమిదంటున్నావ్. ఛస్తే నీ మాట వినను"

"మీరు చెప్పేది పిచ్చికుక్క సంగతి! మంచి కుక్కకి ఎనిమిది చాలండీ!"

విశ్వనాథం అనుమానంగా అతనివేపు చూశాడు.

"అసలేమీ అక్కర్లేదుగానీ ఎందుకయినా మంచిదని ఎనిమిది తీసుకుంటారు"

"ఎవరు?"

"అందరూ!"

"ఇంతకూ అసలది మంచిదో కాదో నీకెలా తెలుసు?"

"తెలుసండీ! అది మంచిదే"

"అదే నీకెలా తెలుసూ అనడుగుతున్నాను"

"దాని వాలకం చూస్తే తెలీటంలేదూ! అది మనవంక చూసేప్పుడు సూటిగా మన కళ్ళల్లోకి చూస్తే మంచికుక్క అన్నమాటండీ! అలా కాకుండా విలన్‌లాగా సైడ్‌కిగానీ, వంకరగానీ చూస్తే పిచ్చి కుక్కన్న మాటండీ"

"ఇప్పుడది ఎలా చూసిందో గమనించలేదుగా మరి?"

"నేను చూశాను గదండీ! సూటిగా మీ కళ్ళల్లోకే చూసింది కరిచేముందు"

"ఇంతకూ అలా చూపులను బట్టి కుక్కను జడ్జ్ చేసే టెక్నిక్ నీకెవరు నేర్పారు?"

"చదివి తెలుసుకున్నానండీ"

"ఏం చదివావ్?"

"కుక్కలూ వాటి చూపులూ అన్న పుస్తకం"

"ఎందుకు చదవాల్సి వచ్చింది ఆ పుస్తకం?"

"కాలేజ్ హాస్టల్లో ఉండేప్పుడు ఇలాగే చాలామంది మా జాకీ కరచిందని పధ్నాలుగు ఇంజక్షన్లు తీసుకోవటం మొదలు పెట్టారండీ! పధ్నాలుగు అవసరం లేదురా- ఎనిమిది చాలని ఎంత చెప్పినా వినిపించుకో పోయేసరికి, చివరకు ఆ పుస్తకంకొని తీసుకొచ్చి స్పెషల్ క్లాస్‌పెట్టి చదివి వినిపించామండీ"

"ఇప్పుడుందా ఆ పుస్తకం?"

"లేదండీ"

"ఏమయింది?"

"ఆ పుస్తకాన్ని నమ్మి ఎనిమిదే ఇంజక్షన్లు చేయించుకున్నడొకడికి హఠాత్తుగా పిచ్చెక్కి ఆ పుస్తకం నమిలి తినేశాడండీ! అయితే వాడికి పిచ్చెక్కడానికి వేరే కారణం ఉందిలెండి! మా కుక్క కరిచాక వాడిని మళ్ళీ ఓ పిచ్చి గుర్రం కరిచిందట"

విశ్వనాధానికి వణుకు పుట్టుకొచ్చింది.

"గు... గు.... గుర్రమా?" అన్నాడు భయంతో. ఆ తరువాత కొద్దిక్షణాల వరకూ మాట పెగల్లేదు. అసలు తనాగదికి ఎందుకొచ్చాడా అన్న విషయం కూడా మర్చిపోయాడు. ఎంత ఆలోచించినా లాభం లేకపోతోంది. ముందా విషయం చెప్పి పధ్నాలుగు ఇంజెక్షన్లలో మొదటిది తీసుకోడానికి డాక్టర్ దగ్గర కెళ్ళాలనుంది.

"అసలు నేను నీ గదికెందుకొచ్చానంటే..." అని రెండుసార్లని మళ్ళా ఆలోచనలో

పడ్డాడు.

"ఒకవేళ నాకు పాతికేళ్ళునిండాయనీ, ఆస్తి నాచేతి కిచ్చేస్తున్నానీ చెప్పడానికొచ్చావేమో మావయ్యా" గుర్తు చేస్తూ అన్నాడు సింహాద్రి.

"పిచ్చివాగుడు వాగకు! ఆ విషయం నేను చాలా జాగ్రత్తగా గుర్తు పెట్టుకుంటాను. ఇంకా సంవత్సరం టైముంది! దానికి అసలు నేనొచ్చిన కారణం ఏమిటంటే ఆ.. గుర్తుకొచ్చింది" అంటూ లేచి నిలబడి జేబులోనుంచి ఓ కవరు తీసి కవర్లోంచి ఓ ఫోటో బయటకు లాగి – వెంటనే దానిని సింహాద్రి మీదకు విసిరేశాడు.

"అందులో పిల్లనుఙ్జాడు! ఆ పిల్లతో నీ పెళ్ళి ఫిక్సయింది. ఆగస్ట్ ఇరవై ఆరున పెళ్ళి! తెల్సిందా!"

సింహాద్రి ఫోటో కేసి చూశాడు. చూసి కెవ్వున కేకవేశాడు.

"అదేమిటి మావయ్యా! ఇది మగపిల్లాడి ఫోటో"

"నోర్మూసుకో– మగపిల్లదేమిటి? అది ఆడపిల్లే!"

"కాదు మావయ్యా! ఫోటో తప్పుగా ఇచ్చినట్లున్నారు. ఇది మగాడే! స్పష్టంగా కనిపించటం లేదూ?"

"పిచ్చివాగుడు వాగద్దన్నానా? నేను చెప్తున్నాను. అది ఆడపిల్లే! తెల్సిందా?"

"కాదు మావయ్యా! ఇదిగో– నువ్వే చూడు"

విశ్వనాథం ఫోటో అందుకుని మళ్ళీ చూశాడు. అతని కోపం ఇంకా ఎక్కువయిపోయింది.

"నీకేం బుద్ధుందా లేదా? అమ్మాయి బొమ్మ లక్షణంగా కనబడుతోంటే– కాదు మగాడి ఫోటో అంటావా? ఏమోయ్ చిరంజీవి!"

"ఏమిటండీ?"

"నువ్వు చూడీ ఫోటో! ఇది ఆడపిల్లే కదూ!"

చిరంజీవి ఆ ఫోటో అందుకుని అయిదు నిమిషాలు పరీక్షగా చూశాడు. ఆ తరువాత ఆల్మారాలోనుంచి తన కళ్ళజోడు తెచ్చుకుని మరో రెండునిమిషాలు చూశాడు.

"ఆడపిల్లే అయుంటాండు!" అన్నాడు బెరుగ్గా.

సింహాద్రి ఆశ్చర్యపోయాడు.

"ఆడపిల్ల ఎలా అవుతాడ్రా"

"ఒరే సింహాద్రీ! వెధవ్వాగుడు వాగకు. ఈ పిల్లతో ఆగస్ట్ ఇరవై ఆరున నీ పెళ్ళి ఎరేంజ్ చేశాను తెల్సిందా!" అన్నాడు విశ్వనాథం కోపంగా.

"కాని ఇది మగ పిల్లాడు కదు మా వయ్యా?"

"నోర్మూసుకోమని ఓసారి చెప్పాను"

సింహాద్రి నోరు మూసేసుకున్నాడు.

"ఇవాళ సాయంత్రం ఈ పిల్ల తండ్రి భావయ్యగారు నిన్ను చూడ్డాని కొస్తున్నారు. ఆయనొచ్చినప్పుడు వెధవ్వేషాలేయకుండా నోర్మూసుకుని అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పు తెల్సిందా?"

"తెలిసింది" నీరసంగా అన్నాడు సింహాద్రి.

"ఒకవేళ ఏమైనా పిచ్చివాగుడు వాగినట్లు తెలిసిందో బుర్ర రామకీర్తన పాడిస్తాను. అర్థమయిందా?"

"అయింది."

"నీక్కూడా వార్నింగిస్తున్నాను చిరంజీవి! పిచ్చివేషాలేయకండి!"

"అబ్బే నేనెందుకేస్తానండీ! నాకేం సంబంధం?"

"అతి వినయం ప్రదర్శిస్తున్నావ్ నువ్వు. అందుకే అనుమానంగా వుంది"

"అబ్బే– ఒరిజినల్గా ఇంతేనండి నేను. ఎప్పుడూ వినయం గానే వుంటాను"

విశ్వనాథం వెళ్ళిపోయాడు.

* * * * *

"దిసీజ్ టూమచ్" అన్నాడు సింహాద్రి ఇంగ్లీష్లో.

చిరంజీవి నిజమేనని ఒప్పుకున్నాడు.

"ఆ మాటకొస్తే టూ మచ్ కంటే కూడా కొంచెం ఎక్కువే" అన్నాడు జాలిగా.

సింహాద్రి మళ్ళీ ఆ ఫోటో తనచేతుల్లోకి తీసుకున్నాడు.

"ఇది నిజంగా ఆడపిల్లేనంటావా?"

"ఓ యస్. అనుమానం అక్కర్లేదు" అన్నాడు చిరంజీవి.

"నీకెలా తెలుసు అంత నమ్మకంగా?"

"ఆమధ్య మా ఫ్రెండొకడితో అడివికి షికారుకెళ్లా:! అక్కడ చిరుతపులిని చూశాం! ఆ చిరుతపులి– అచ్చం ఇదుగో ఈ అమ్మాయిలాగే వుంది"

"అయితే?"

"అయితే ఏముందీ! ఆ చిరుతపులీ ఆడ చిరుతపులేనని మా ఫ్రెండ్ చెప్పాడు కదా. అయినా మెడలో నెక్లెస్ కనిపించటం లేదూ?"

"అంటే మెడలో నెక్లెసున్నవాళ్ళంతా ఆడవాళ్ళేనా?"

"ఈ ఫోటో చూడక ముందు అభిప్రాయం అలా వుండేది!"

"మరి ఇప్పుడు?"

"ఇప్పుడు ఆ అభిప్రాయం పూర్తిగా మార్చుకున్నాను అంతేకాదు! ఇంకా కొన్ని అభిప్రాయాలు కూడా మారిపోయాయ్!"

"ఏమిటవి?"

"చీరలు కట్టేవారంతా స్త్రీలు కారనీ, లోలాకులు పెట్టుకునే వారంతా కూడా స్త్రీలు కాదనీ, స్త్రీలను కేవలం లేళ్ళతోనూ, చిలకలతోనే కాక చిరుతపులలతో, పెద్ద పులులతో కూడా పోల్చవచ్చనీ– ఇలా చాలా చాలా ..."

సింహాద్రికి ఏడుపొచ్చింది.

"ఇప్పుడు బలవంతంగా వాడిని... అంటే– అదే ఆ చిరుతపులిని నాకిచ్చి పెళ్ళి చేస్తారా ఏమిటి ఖర్మ?"

"పరిస్థితిని సమీక్షిస్తే అలాగే కనబడుతోంది" జాలిగా అన్నాడు చిరంజీవి.

"ఎలారా ఈ వెధవ సంబంధం తప్పించుకోవడం?"

"మీ మావయ్యా దగ్గరకెళ్ళి – ఈ సంబంధం విషయం ఇంకోసారి నా దగ్గర ఎత్తావంటే మొఖం చట్నీ చేస్తానని వార్నింగివ్వు తప్పిపోతుంది"

ఆ సీన్ ఓసారి ఊహించి చూసుకున్నాడు సింహాద్రి. కానీ అదేమంత అకర్షణీయంగా కనిపించలేదు.

"ఇంకో పద్ధతేమీ తేదుట్రా?" ఆశగా అడిగాడు.

"ఉంది?"

"ఏమిటది?"

"ఆ చిరుతపులినే పెళ్ళి చేసుకోవడం"

"ఇది అన్యాయంరా! ఓ పక్క నా హృదయం ఇంకో అమ్మాయికిచ్చేశానే?"

"ఇంకో పక్క ఆ చిరుతపులిని ఉండనీ"

"వద్దురా! అసలా చిరుతపులి పక్కన నిలబడే సీన్ తల్చుకుంటేనే భయంగా ఉంది. ఇంకా పెళ్ళి చేసుకుని మగరాయుడితో సంసారం చేయడం మాటలా?"

"అలాంటి మగరాయుడితో సంసారం చేసేందుకు కూడా ఓ పద్ధతుందిరా! భయపడకు"

"ఏమిటా పద్ధతి?"

"దాన్ని టూరింగ్ లైఫ్ పద్ధతి అంటారు"

"అంటే ఏం చేస్తారు?"

"ఆ మగాడిలాంటి అమ్మాయిని చేసుకున్నవాడు పెళ్ళి అయిన మర్నాటినుంచి టూర్లు తిరుగుతాడన్న మాట. అంటే– భార్యతో అనుకునేవ్; కాదు. ఒక్కడే! అలా తిరిగి తిరిగి,

తిరిగి తిరిగి చివరకు రిటైరయాక అప్పుడు ఇల్లు చేరుకుంటాడు"

"టూర్లేమిట్రా? నాకేం అర్థం కావటం లేదు" అడిగాడు సింహాద్రి.

"ఇంకా అర్థం కాలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు చిరంజీవి.

"లేదు"

"వెరీబాడ్ బైదిబై– ఇటీవలి కాలంలో నీ మెదడు కేమయినా దెబ్బతగలడం గానీ లేక మరోటి గానీ ఏదయినా జరిగిందా?"

"లేదు. ఎందుకు?"

"జస్ట్ డౌట్. అంతే ఓకే! అర్థం కాలేదన్నావ్ కదూ! అయ్‌విల్ ఎక్స్‌ప్లెయిన్! టూరింగ్ లైఫ్ మెథడ్ అంటే భార్య మగాడిలాగా గానీ లేక చిరుతపులిలాగా గానీ లేక ఈ రెండూ కలిసినట్లున్నా గానీ, లేక ఇంకే క్రూర జంతువు పోలికలున్నా గానీ సాధారణంగా ఈ టూరింగ్ లైఫ్ మెథడ్ వాడతాడన్నమాట భర్త. అంటే పెళ్ళయిన మర్నాడు అతను టూర్‌కి బయల్దేరతాడు. ఆ టూర్ ఇలా వుంటుంది. జనవరి నుంచి మార్చి వరకూ కలకత్తాలో కాన్ఫరెన్స్, మార్చి నుంచి జూన్ వరకూ మద్రాసులో బ్రాంచ్ ఇన్‌స్పెక్షన్, జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ బాంబేలో బోర్డ్ మీటింగు, సెప్టెంబరు నుంచి జనవరి వరకూ వైజాగ్‌లో సర్వే లేదా డార్జిలింగ్‌లో ఇన్‌వెస్టిగేషన్! ఇలా మూడవందల అరవై అయిదు రోజులూ టూర్లోనే గడిపేస్తారన్నమాట! ఇంటికి రావటం అంటూ వుండదు. ఈ రకంగా హాయిగా భార్యకు దూరంగా ఆమెను చూడకుండా, తను ఆమె కంట పడకుండా జీవితం ఆనందకరంగా గడపవచ్చన్నమాట. ఎటోచ్చీ లీప్ ఇయర్లో మాత్రం ఓ రోజు ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎందుకంటే లీప్ సంవత్సరానికి మూడువందల అరవై ఆరురోజులుకదా! ఆ ఒక్కరోజూ భార్య తెలివిగలదయితే ఇంటిదగ్గర గడపమని ఆజ్ఞాపించవచ్చు"

సింహాద్రి కాపద్ధతి ఏమంత నచ్చలేదు.

"నాకేం నచ్చలేదురా" అన్నాడు మళ్ళీ దిగులుపడి.

"నీ మొఖం! నీకు తెలీదు! కె.యస్.యస్.రాజు గాడు ఇలాగే నచ్చలేదు. నచ్చలేదని ఇప్పుడు అదే బ్రహ్మాండమయిన పద్ధతిని తెగ మెచ్చుకుంటున్నాడు"

"రాజెవరు?"

"మా కొలీగ్?"

"అంటే అతని భార్య కూడా..."

"యస్! అనుమానం ఎందుకు? భీకరమయిన ఆకారం. అంతే టూరింగ్ లైఫ్ మెథడ్‌లోకి దిగాడు. ఇప్పటికి ఇంటి మొఖం చూసి ఎనిమిదేళ్ళయింది. చాలా స్ట్రిక్ట్‌గా

షెడ్యూల్డ్ టూర్ అమలు చేస్తున్నాడు"

"ఐసీ" అన్నాడు సింహాద్రి.

"ఓ యస్! బ్యూటిఫుల్ మెథడ్ అది! నీకు ఒకవేళ ఇది నచ్చకపోతే రెండో పద్ధతుంది"

సింహాద్రి ఉత్సాహంగా చూశాడు.

"అదేమిటి?"

"దాన్ని శాటిలైట్ మెథడ్ అంటారు. అంటే రేసులూ, క్లబ్బులూ, పేకాటలూ ఇలా వీటి చుట్టూ ఇంటికి రాకుండా తిరుగుతూ జీవితం గడిపేయడం అన్నమాట! చివరకు బాగా ఏజ్ ఎక్కువయి అంటే కళ్ళు పూర్తిగా కనిపించని స్థితిలో ఇవన్నీ మానేసి ఇంటి దగ్గర ప్రశాంతంగా జీవితం గడుపుతాడు. ఈ రెండూ కాక మూడో మెథడ్ ఒకటుంది కానీ అది అంత మంచిదికాదని నా పర్సనల్ అభిప్రాయం"

"ప్రస్తుతానికివి చాల్లే" అన్నాడు సింహాద్రి.

అతనికిప్పుడు ఎన్నో కొత్త కొత్త విషయాలు తెలుసుకున్నట్లు అనిపించింది. ఇంతకుముందు తను కొంతమంది "సంవత్సరమంతా" టూర్లు చేసేవాళ్ళను చూశాడుగానీ, వాళ్ళంతా ఇలా ఈ టూరింగ్ లైఫ్ పద్ధతి ప్రాక్టీస్ చేస్తున్నారని తనకప్పుడు తెలీలేదు.

"అంటే పై రెండు పద్ధతుల్లో నీకేది నచ్చినట్లు?"అడిగాడు చిరంజీవి.

"ఏదీ లేదు"

చిరంజీవి ఆశ్చర్యపోయాడు.

"మరి?"

"మరేం లేదు. ముందు నేనీ పెళ్ళి తప్పించుకోవాలి! ఎలాగో చెప్పు?"

చిరంజీవికి చిరాకు పుట్టుకొచ్చింది.

"ఇందాక చెప్పాను కదా"

"ఏమిటది?"

"మీ మావయ్య మొఖం చట్నీ చేసెయ్‌మని"

"ఉహూ; అది కుదరదురా"

"ఎందుకని"

"అలా చేస్తే మావయ్యక్కోపం వస్తుందేమో"

"వస్తే రానీ"

"వ్వాట్?"

"అవునోయ్! వస్తే రానీ- భయమేమిటి?"

"పిచ్చివాడా! నేనేలాంటి తలతిక్క పనిచేసినా నా ఆస్తి నాకు అప్పజెప్పడం జరగని

పని అని గత రెండేళ్ళుగా వార్నింగులిస్తున్నాడు"

"ఏడ్చాడు"

"వాట్.. ఏమిటన్నావ్?"

"ఏడ్చాడన్నాను"

"ఎందుకు?"

"లేపోతే ఏమిట్రా? ఆస్తి అప్పజెప్పక పోవడం మీ మామ మావ వల్ల కూడా కాదు. ట్రస్టీ అంటే గడువు తీరగానే ఆ ఆస్తి నీకప్పగించి తీరాల్సిందే! ఇది రూలు. ఇవ్వనంటే మరుక్షణం జైల్లో వుంటాడు. నేను కొన్నాళ్ళు లాయర్ ఇంటి పక్కనున్నానుగా! అందుకని 'లా' అంతా మనకు కొట్టినపిండే"

"నిజంగానా?" ఆశ్చర్యంగా అడిగాడు సింహాద్రి.

"నగ్న సత్యం"

"ఎంత ఘోరం జరిగిపోయింది? ఈ విషయం తెలీక నేను మావయ్య ఆడించినట్టల్లా ఆడుతున్నాను"

"అయితే ఇకనుంచీ ఆ ఉచిత నాట్య ప్రదర్శనలు ఆపేసేయ్"

"ఓకే! ఎగ్రీడ్"

"అసలు మీ మావయ్యకు ఆ పిల్లనే నీకిచ్చి చేయాలని ఏమిటంత అనురాగం"

"అదో పెద్ద కథ అని ఆరోజు నీతో అన్నాను గుర్తులేదూ?"

"ఏమిటా కథ?"

"మావయ్య ఫ్రెండ్ భావయ్య దగ్గర చచ్చేంత డబ్బు ఉంది. మామయ్యకు అలా బోలెడు డబ్బు ఒకేచోట పోగడిపోవడం నచ్చలేదు. అంచేత అతనిని యాభయివేల రూపాలయినా, పధ్నాలుగు లక్షల రూపాయలయినా అప్పు ఇమ్మన్నాడు. ఛాయిస్ ఆ రెండింటిమధ్యే ఉండడం వల్ల భావయ్య యాభై వేలు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. అయితే ఓ కండిషన్ పెట్టాడు"

"ఏమిటది?"

"భావయ్య కూతురికి నన్నిచ్చి పెళ్ళి చేయడానికి మావయ్య వప్పుకోవాలి. అలా చేస్తే ఆ యాభయివేలూ ఫ్రీగా తీసుకోవచ్చు. తిరిగి ఇవ్వనక్కర్లేదు."

"న్యాయంగా చూస్తే నీ విలువ పాతిక రూపాయల కంటే ఎక్కువ వుండదు కదా! మరలా ఎందుకు కండిషన్ పెట్టినట్లు?"

"నా విలువ యాభయి వేలుండని మాట నిజమేగానీ ఆ పిల్లను పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకున్న వాడెవడికయినా సరే లక్షరూపాయలు వరకూ ఖర్చు చేయడానికి సిద్ధపడ్డాడు

భావయ్య."

"ఎందుకని?"

"ఈ ఫోటో చూస్తే అర్థం కాలేదూ? ఆఫ్‌కోర్స్ అదింకా ఆడపిల్లే అని వారు వాదించేట్లయితే"

"ఓకే- ఓకే నెక్ట్స్?"

"అసలు ఇదంతా కాక ఒరిజినల్ వ్యవహారం ఒకటుంది"

"ఏమిటది?"

"నేను కొన్ని యుగాలుగా శ్రీదేవి అనే దేవతని ఆరాధిస్తున్నాను"

"కొన్ని యుగాలుగానా?"

"అంటే నిజంగా కాదనుకో చాలాకాలం నుంచీ. అంటే మరీ ఎక్కువ కాదు- రెండు రోజులనుంచీ అన్నమాట"

"ఎవరా శ్రీదేవి?"

"తెలీదు"

"ఎంతకాలం నుంచీ స్నేహం?"

"అస్సలింతవరకూ ఆ అమ్మాయిని చూళ్ళేదు"

"ఆ అమ్మాయి నిన్ను చూసిందా?"

"అసలు నాలాంటి హాండ్‌సమ్‌ఫెలో ఒకడున్నాడనే ఆ పిల్లకు తెలీదు"

చిరంజీవి చిరాకు పుట్టుకొచ్చింది.

"ఇలా ఊరూ వేరూ అడ్రసూ లేని ఆడపిల్లలను ప్రేమించండం కొత్త హాబీయా?"

"ఆ అమ్మాయికి అడ్రసుంది"

"ఏమిటది?"

"బాంబ్ నిలయం- విశాఖపట్నం"

"బాంబ్ నిలయమా?"

"అవును"

"అంటే బాంబ్‌లూ గట్రాతో నిండివుండే ప్రదేశమా?"

"అదింకా తెలీదురా! కనీసం ఓ బాంబయినా వుండి వుంటుందని అనుమానం"

"మరలాంటి బాంబుల మధ్య జీవితం గడిపే పిల్లను ప్రేమిస్తే ప్రమాదం కదా"

"అదే కొంచెం ఇదిగా వుందిరా"

"ఇంతకూ ఆ పిల్లను నువ్వెక్కడ చూశావ్?"

"అదో పెద్ద కథరా"

"ఇందాక చిన్న కథన్నావ్?"

"అది ఒరిఇనల్ కథ! కానీ అందులో ఉపకథ మాత్రం చాలా పెద్దది. మొదలెట్టనా?"

"సరే రెండువేల పదాలు దాటకుండా చెప్పు"

"ఇంతకుముందు ఈ రూమ్‌లో ప్రఖ్యాత రచయిత ధనుంజయ్ వుండేవాడని నీకు చెప్పాను కదా"

"రచయితా?"

"అవును"

"ఏమి రాస్తాడతను?"

"నాకూ తెలీదు. కానీ మన హొటల్ సర్వర్ రామనాథం, ఇన్‌ఫర్‌మేషన్ ప్రకారం అతను హిప్నాటిజం, టెలీపతి, ఆలోపతి, విలోపతి, సైకోపతి ఇలా చాలా పతుల గురించి రాస్తాట్ట."

"అంటే వాటి గురించి వ్యాసాలా?"

"కాదు నవలలు. ఒక ధనవుంతుడి కొడుకు హఠాత్తుగా కొన్ని చోట్ల ఆస్తికి వారసుడవుతాడు. ఆ ఆస్తి లాక్కోడానికి అతని బాబాయ్ అతనిని చంపడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తాడన్నమాట. కానీ అతని ప్రియురాలు ఈ విషయం టెలీపతి ద్వారా తెలుసుకుని, సైకోపతీ ప్రయోగిస్తుంది. ఆ తరువాత ఆమె హిప్నాజిటం నేర్చుకుని అతని బాబాయ్‌ని హిప్నటైజ్ చేసి ముప్పుయ్ తిప్పలుపెట్టి- ఒకటో రెండో చెరువుల నీళ్ళు తాగిస్తుందట. ఇలా వుంటాయంట అతని నవలలు. చదివి తీరాల్సిందేగానీ ఇలా వింటే అంత అద్భుతంగా వుండవని రామనాథం అన్నాడు"

"సరే. ఇది ప్రఖ్యాత రచయిత ధనుంజయ్ రూమ్. అయితే ఏమిటి?"

"శ్రీదేవి అనే అమ్మాయ్ ఆ రచయిత ధనుంజయ్‌కి ఫాన్. అంటే మన ఇళ్ళలో తిరిగే ఫాన్ కాదు. అభిమాని అంటామే అదన్నామాట! ఆమె ధనుంజయ్‌కి ఉత్తరం రాసింది. అతను రూమ్ మారినట్లు ఆమెకు తెలీదు. అంతేకాదు. ఈ రూమ్‌లో ప్రస్తుతం హాండ్‌సమ్ ఫెలో ఒకడు దిగినట్లు కూడా తెలీదు. తెలుస్తే నాకే రాసేది. నో డౌట్ ఎబౌట్ ఇట్!"

"హరికథ వద్దు! అసలు కథ చెప్పు" చిరాగ్గా అన్నాడు చిరంజీవి.

"ఓకే- కమింగ్ టు ఒరిజినల్ స్టోరీ. ఆ ఉత్తరం నేను అందుకున్నాను. కవర్లో శ్రీదేవి ఫోటో చూశాను. అంతే అయామ్ లాస్ట్! ఒరేయ్.. పెళ్ళి అంటూ చేసుకుంటే ఆ పిల్లనే చేసుకుంటాన్రా! లేపోతే ఈ జన్మ కాన్సిల్ చేసేసుకుంటాను. అంతేగాని చిరుతపులినీ, పెద్దపులినీ చేసుకోవడం నా వల్ల కాదు."

"ఇలా ఊరూ, పేరూ, అడ్రసూలేని పిల్లను ఫోటోలో చూసి ప్రామిస్తే కె.యస్. కనకారావ్ గతిపడుతుంది నీక్కూడా"

"కె.యస్. కనకారావా?"

"అవును"

"ఎవరతను?"

"జి.యస్. శంకర్రావ్ కజిన్ బ్రదర్"

"జి.యస్. శంకర్రావ్ ఎవరు?"

"సి.కె. రత్నారావ్ ఫ్రెండ్"

"సి.కె. రత్నారావ్... వద్దులే అతనెవరో మనకెందుగానీ ఇంతకూ కె.యస్. కనకారావ్‌కి ఏ గతి పట్టింది?"

"వాడూ ఇలాగే ఓ అమ్మాయి ఫోటో చూసి ప్రేమించాడు"

"అంటే వాడూ రచయిత వుండే రూమ్‌లోకి మారాడా?"

"కాదు. ఇది ఇంకోరకం కేసు వాడికి పత్రికలు చదవడం అలవాటు ఓసారి ఓ పత్రికలో వాడికిష్టమయిన సీరియల్ రచయిత్రి ఫోటో చూసి ప్రేమించాడు. నీలాగానే పెళ్ళంటూ చేసుకుంటే ఆ రచయిత్రినే చేసుకోవాలని ప్రతిజ్ఞ చేసుకున్నాడు. వెంటనే ఆమెతో కరస్పాండెన్స్ కోర్స్ ప్రారంభించాడు! తనకున్న అర్హతలూ, తన ఆస్తి వివరాలూ, తనకొచ్చే జీతం, ఉద్యోగం, తన రంగూ, రుచీ అన్నీ రాశాడు. దానికో ప్రేమలేఖ జతపరిచాడు. ఆమెను ప్రతిక్షణం చూస్తూ ఆమె సరసనే జీవితం గడిపే అవకాశం తనకివ్వపోతే తను ఇన్‌స్టాల్‌మెంట్స్ పద్ధతిలో వందేళ్ళు లోపుగానే తనువు చాలిస్తానని ఫుట్‌నోట్ పెట్టాడు"

"మరా రచయిత్రి వప్పుకుందా?"

"అలాంటి ఫుట్‌నోట్ చూస్తే ఎవరు వప్పుకోకుండా ఉంటారు?"

"అంటే– పెళ్ళికి వప్పుకుందన్నమాట"

"ఊహు! లేదు"

"అదేమిటి? ఎందుకని వప్పుకోలేదు?"

"వప్పుకునేదేగాని– ఆమె భర్తా, పిల్లలూ, అల్లుళ్ళూ, కోడళ్ళూ వప్పుకోలేదు."

సింహాద్రి ఉలిక్కిపడ్డాడు.

"భర్తా, పిల్లలూ, అల్లుళ్ళూ, కోడళ్ళూనా?"

"అవును"

"అంటే వాళ్ళంతా ఎవరు? అయ్ మీన్ ఆ అమ్మాయికి భర్తేమిటి?"

"వెరీపూర్ అండర్‌స్టాండింగ్" అన్నాడు చిరంజీవి జాలిగా. "భర్త లేకపోతే పిల్లలూ గట్రా ఎలా ఉంటారు?"

"అదికాదు నేననేది! అసలు ఆ అమ్మాయి అమ్మాయి కాదా? అహహ... నా ఉద్దేశం ఆ అమ్మాయికి పెళ్ళయి పోయిందా?"

"అయ్ పిటీ యూ! ఇంకా అర్థం కాలేదన్నమాట! పెళ్ళవకపోతే పిల్లలు ఎలా ఉంటార్రా?"

సింహాద్రికి అంతా అయోమయంగా ఉంది.

"పిల్లలు వున్నారు. సరే వప్పుకుంటాం. మరి అల్లుళ్ళూ, కోడళ్ళూ ఏమిటి?"

"నీకు నిజంగా మెదడు విషయంలో చాలా అన్యాయం చేశాడ్రా దేవుడు" మళ్ళీ జాలిపడ్డాడు చిరంజీవి "పిల్లలన్నాక కూతుళ్ళూ, కొడుకులూ ఉంటారా, ఉండరా?"

"ఉంటారు"

"కూతుళ్ళూ, కొడుకులూ అన్నాక మరి వాళ్ళక్కూడా పెళ్ళిళ్లూ, పేరంటాలూ అవుతాయా, అవ్వవా?"

"అవుతాయ్... అవుతాయ్"

"మరింకా నీకు అర్థం కాకపోవడం ఏమిటి?"

"అంటే.. ఆమెకు అంత పెద్దపిల్లలు కూడా ఉన్నారన్నమాట"

"అంతేకాదు ఆ పిల్లలక్కూడా పిల్లలున్నారు"

"మైగాడ్"

"ఎవరి గాడ్ అయినా సరే! ఫాక్ట్స్ అవి"

"మరా రచయిత్రి ఏం చేసింది. ఇంకోసారి లాంటి ఉత్తరాలు రాయొద్దని రాసిందా?"

"ఊహు! చూస్తూ చూస్తూ అంత మంచి ఉద్యోగం వున్న వరుడిని వదులుకోవడం ఇష్టంలేక తన మనవరాలికే ఇచ్చి వివాహం జరిపించింది"

"మనవరాలికా?" తృళ్ళిపడుతూ అడిగాడు సింహాద్రి.

"అవును"

"అంటే మనవరాలు కూడా పెళ్ళీడుకొచ్చిన పిల్లేనా?"

"పెళ్ళీడు పిల్లేమిటి? అప్పటికే యమ్.ఏ. అయిపోయి లెక్చరర్‌గా చేస్తోందట అయిదేళ్ళ నుంచీ ! అంటే కె.యస్. కనకారావ్ కంటే అయిదారేళ్ళే పెద్దది"

"మరి కె.యస్. కనకారావ్ ఎలా వప్పుకున్నాడు?"

"వప్పుకోకేం చేస్తాడు? ఫుట్‌నోట్‌లో ముందే కమిట్ అయిపోయాడుగా? అదీ రాతపూర్వకంగా కమిట్ అయాడయ్యె– ఆమె కళ్ళల్లోకి చూస్తూ, ఆమె సరసనే జీవితం

గడిపే అవకాశం ఇవ్వకపోతే స్లోగా ఛస్తానని"

"అయినా అంత ముసలిదాన్ని ఎలా ప్రేమించాడా కే.యల్. కనకారావ్?"

"కే.ఎల్.కాదు. కే.ఎస్."

"అదే కే.యస్. కనకారావ్"

"అందులో పెద్ద ఆశ్చర్యం ఏముంది? ఆమె తన పదహారవ ఏట దిగిన ఫోటో పబ్లిష్ చేయించిందా పత్రికలో"

సింహాద్రి నీళ్ళు కారిపోయాడు.

"వెరీబాడ్" అన్నాడు దిగులుగా.

"అవును! పాపం- కే.యస్? కనకారావ్ కూడా అదే అనుకుంటుండొచ్చు- ఆ ఇన్సిడెంట్ తల్చుకున్నప్పుడల్లా"

"ఇప్పుడేం చేస్తున్నాడతను?"

"ఆ రచయిత్రికి కళ్ళుకూడా సరిగ్గా కనిపించవుకదా! అందుకని ఆమె బెడ్ పక్కనే కూర్చుని ఆమె డిక్టేట్ చేసే నవలలు, కథలు రాసి పెడుతూంటాడు"

"హారిబుల్"

"చాలా హారిబుల్"

"అంటే- ఇప్పుడు శ్రీదేవి కేసుకూడా ఆ బాపతే నంటావ్?"

"అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయ్!"

"కానీ ఆమె ఆ రచయిత్రిలా చిన్నప్పటి ఫోటో ఎందుకు పంపుతుంది? తనను గుర్తించడానికేగా ఆ ఫోటో పంపింది?"

చిరంజీవి ఓ క్షణం ఆలోచించాడు.

"గుర్తించడం ఏమిటి? ఎవరు గుర్తించాలి? ఎలా, ఎక్కడ గుర్తించాలి?"

"ఆమెనే రచయిత ధనుంజయ్ గుర్తించాలని ఆమె అభిప్రాయం. ఎందుకంటే ఆమె రేపు శుక్రవారం ఇక్కడి కొస్తోంది"

"ఇక్కడికా?"

"అవును"

"ఎందుకు?"

"తన అభిమాన రచయిత ధనుంజయ్‌ని కలుసుకోవడానికి!"

"ఓహో"

"కనుక ఆమె రూపం ఫోటోలోలాగానే ఉంటుందని తేలిగ్గా చెప్పేయవచ్చు"

"ఆ పాయింట్ నిజమేగానీ ఇంకో పాయింట్ ఉంది"

"ఏమిటది?"

"ఆమెక్కూడా భర్తా, పిల్లలూ లేరని నమ్మకం ఏమిటి?"

"అలా మాట్లాడకురా! నేనిప్పుడే చచ్చి ఊరుకుంటాను. అయినా ఆమెకు పెళ్ళి కాలేదురా! నాకు తెలుసు"

"ఎలా తెలుసు?"

"తను వాళ్ళ డాడీతో ఈ ఊరుకొస్తున్నానీ, అప్పుడు ఈ ఇంటికొస్తాననీ రాసింది. పెళ్ళయితే మరి మా ఆయన్తో వస్తున్నాని రాసేదికదా"

"అయితే ఫిఫ్టీ ఫిఫ్టీ ఛాన్సులున్నాయన్నమాట!"

"ఒరేయ్! ముందు నేను ఈ మావయ్య ఫ్రెండ్ భావయ్య తాలూకు మగ కూతురి బారినుండి తప్పించుకోవాలి. ఆ తరువాత శ్రీదేవిని పెళ్ళి ఎలా చేసుకోవాలి. ఎలా? ఎలా? ఎలా? ఎలా....."

"ష్ ష్" అరచాడు చిరంజీవి "ఏమిటా కాకిగోల?"

"రీ సౌండింగ్ ఎఫెక్ట్! మన సినిమాల్లో వాడతారు గదా- చాలా బరువైన సన్నివేశాల్లో. హీరోయిన్ భర్తని డాక్టర్లు ఆపరేషన్ చేయాలనుకుంటారు. లక్షరూపాయలలో, ముప్పయ్ ఆరువేలో ఎంతో కావాలంటారు. అప్పుడు హీరోయిన్ ఇలా అనుకుంటుదన్నమాట! లక్షో ముప్పయ్ ఆరువేలో కావాలి- కావాలి - కావాలి- కావాలి-...."

"ష్‌ష్" మళ్ళీ అరచాడు చిరంజీవి. సింహాద్రి 'ష్' అయిపోయాడు.

"ఊహు కుదరదురా! ఆ పిల్ల ఇలా హఠాత్తుగా ముక్కు మొఖం తెలీని నిన్ను ప్రేమించడం ఇంపాజిబుల్"

"అలా ప్రేమించిన కేసులు లేవంటావా?"

"పాపం- ఎక్కడో ఒకటి ఉంటే ఉండవచ్చు"

"రేపు శుక్రవారం శ్రీదేవి వచ్చినప్పుడు నా ప్రేమను తెలియజేస్తే ఒప్పుకోదంటావా?"

"పోలీస్ కంప్లెయింట్ ఇస్తుంది"

"అదేమిట్రా- మధ్యలో వాళ్ళకెందుకు చెప్పటం?" కంగారుగా అడిగాడు సింహాద్రి.

"అవును మరి! నీలాంటి ట్రాఫిక్‌ని త్వరగా క్లియర్ చేయాలంటే అదొక్కటే ఛాయిస్"

"ఒరేయ్ చిరంజీవీ! ఆపదలోవున్న స్నేహితుడిని ఆదుకోవటం ఇదేనుట్రా?"

"నన్నేం చేయమంటావ్‌రా?"

"ఏదొక ఉపాయం చెప్పు! ఆరోజు మనిద్దరం కాలేజ్ ఎలక్షన్స్ గొడవల్లో ఇరుక్కున్నప్పుడు పోలీసులు అరెస్ట్ చేయడానికొస్తే అద్భుతమైన ఉపాయం ఆలోచించావ్ నువ్వు గుర్తులేదూ? ఆ ఉపాయం వల్లనేగా మనంతట మనమే వెళ్ళి వాళ్ళకు

దొరికిపోయాం”

“అవుననుకో– అయితే ఓ పనిచెయ్”

“ఏమిటది?” ఉత్సాహంగా అడిగాడు సింహాద్రి.

“ఇంత విషం రడీగా ఉంచుకో! రేపు ఆమె గదికి రాగానే “మీరు నన్ను ప్రేమిస్తారా? లేకపోతే ఈ విషం మింగమంటారా’ అని అడుగు. దాంతో దెబ్బకి ఒప్పుకుంటుంది”

“ఒకవేళ విషమే మింగమంటే?”

“మింగేసెయ్? ఎలాగూ ఈ బర్త్ కాన్సిల్ చేసుకుంటానన్నావుగా ఆమె వప్పుకోకపోతే”

“ఇంతకంటే మంచి ఉపాయమేమీ లేదా?”

“ఎందుకు?దీనికేమయింది?”

“అంత బావుండలేదురా?”

“మంచి ఉపాయాలు ఎవడికీ నచ్చవ్. అది మామూలే”

“బాబ్బాబు ఇంకోటేదయినా చెప్పరా”

చిరంజీవికి సింహాద్రిని చూస్తే జాలివేసింది. ఫోటోలు చూసి ప్రేమించే అమాయకపు వెధవాయిలకు ఆమాత్రం సహాయం చేయడం తన ధర్మం అనిపించింది.

“సరే అయితే ఓ పనిచెయ్! నీకు ధైర్యం ఉందా?”

“కేవలం శ్రీదేవి కోసం అయితే బోలెడుంది”

“నీకు స్టేజిఫియర్ లేదుగా?”

“కాలేజీలో సెకండ్ బెస్ట్ యాక్టర్’ కొంచెంలోనేగా మిస్సయిందీ? ఇంతకూ నన్నేం చేయమంటావో చెప్పరా?”

“మరేం లేదు. రేపు శ్రీదేవి మన రూమ్ కొస్తుంది. అంతేనా?”

“అవును”

“వచ్చి ధనుంజయ్‌గారు మీరేనా అనడుగుతుంది. అవునా?”

“అవును”

“అప్పుడు నువ్వేమంటావ్?”

“నేను కాదండీ... నా పేరు సింహాద్రి. ధనుంజయ్‌గారు వేరే ఇంటికి మారిపోయారు. మీరు ఇలా కూర్చోంది. కూల్ డ్రింక్ తాగుతారా, కాఫీ తాగుతారా అంటాను”

“అక్కడే దెబ్బతిన్నావ్ నువ్వు”

“ఏం? ఎందుకని?”

“నేనేం ధనుంజయ్‌ని అనాలి నువ్వు”

“నేనా?”

“అవును”

“నిజంగా నేను కాదుకదా?”

“కాదు”

“మరి ఇంకెలా అంటాను?”

“నీ నోటితో”

“సరే అంటాననుకో”

“అంటే ఇంకేముంది? ఆమె నీతో ప్రవాహంలాగా మాట్లాడటం మొదలుపెడుతుంది. ఇద్దరూ బీచికెళ్తారు”

“బీచ్‌కా?”

“అవును”

“హైద్రాబాద్‌లో బీచ్ లేదుగా?”

“లేపోయినా సరే– వెళ్తారు. అక్కడ ఆ సముద్రపు కెరటాల వంక చూస్తూ చీకటిపడేవరకూ మాట్లాడుకుంటారు. ఆమెకు నువ్వు కొత్తగా రాయబోతున్న నవల గురించి చెప్తావ్! ఆమె ఉప్పొంగి పోతుంది. ఆ ఆనందంలో ఉండగా డిన్నర్ కెళ్దామని అడుగుతావ్. ఓకే అంటుంది. ఇద్దరూ గ్రీన్ మూన్‌లో డిన్నర్ కెళ్తారు”

“గ్రీన్ మూన్ ఎక్కడుంది?”

“నాకూ తెలీదులే. మధ్యలో అడ్డురాకు. అక్కడ నువ్వు అయిదు వందలో వెయ్యి రూపాయలో పెట్టి డిన్నర్ ఆర్డర్ చేస్తావ్. ఆ భోజనం చేస్తూండగా ఆ చల్లని వాతావరణంలో, ఆ మసక చీకటిలో నీ గుండె ఆమెకిచ్చేస్తావ్ – అంతే– ఆ తర్వాత డ్రీమ్‌సాంగ్– డూయెట్లు”

సింహాద్రి అనుమానంగా చూశాడు.

“అయిడియా బాగానే ఉందిరా! కానీ నేను రచయిత ధనుంజయ్‌నంటే ఆమె నమ్ముతుందంటావా?”

“వాళ్ళ గ్రాండ్ మదర్ నమ్ముతుంది”

“అంతేనంటావ్”

“ఖచ్చితంగా”

“కానీ తరువాత ఎప్పటికయినా నిజం తెలుస్తుంది కదా?”

“అప్పటికే ఆమె నీ సొంతం అయి పోతుంది కదురా?”

“ప్రస్తుతానికి బాగానే ఉంది మరి”

“ఎగ్జిక్యూషన్‌లో ఇంకా బ్రహ్మాండంగా ఉంటుంది”

సింహాద్రి సంతృప్తి పడ్డాడు.

* * * * *

సాయంత్రం ఏడువుతుండగా గది బయట కారు హారన్ మోగింది. దాని వెనుకే కారు డోర్ గట్టిగా వేసిన చప్పుడు, మళ్ళీ దాని వెనుకే "కుయ్యో" మని ఏడుస్తున్నట్లు శబ్దం చేసుకుంటూ లోపలికొస్తున్న బూట్లు చూసి సింహాద్రి ఉలిక్కిపడ్డాడు.

"ఇదేనా సింహాద్రి రూమ్?" అంటూ లావుపాటి ఆకారం గడపలో నిలబడి అరచింది– తెలుగుని తమిళంలాగా మాట్లాడుతూ.

"అవునండీ! ఇదే" అన్నాడు సింహాద్రి.

ఆ ఆకారం లోపలికొచ్చింది ఫుల్ సూట్‌లో!

"నేనుదా మీ మామయ్య ఫ్రెండ్ భావయ్యను"

సింహాద్రికి సన్నగా వణుకు ప్రారంభమయింది.

"రండి సార్! కూర్చోండి" అన్నాడు చిరంజీవి.

"భావయ్య వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"మీ రెండిట్లో సింహాద్రి ఏది?' అడిగాడతను చిరునవ్వుతో.

"ఇదిగో– ఇదేనండీ సింహాద్రి" సింహాద్రిని చూపుతూ జవాబిచ్చాడు చిరంజీవి.

"ఓహో– సింహాద్రి ఇదా?"

"అవునండీ!" అన్నాడు సింహాద్రి.

"మా అమ్మాయి ఫోటో సూస్తివా?"

"సూ స్తినండీ"

"ఎట్లా వుండాది? రొంబ బాగుండాదా?"

"రొంప బాగుందా అంటారా?" అయోమయంగా అడిగాడు సింహాద్రి.

"రొంప కాదు. రొంబ– రొంబ అంటే తెలుంగులో ఏమి సెప్తారు! ఆ! బాగా బాగా"

"ఎక్స్‌క్యూజ్‌మీ" అన్నాడు చిరంజీవి కల్పించుకుంటూ

"యస్" ప్రశ్నార్థకంగా అతని వంక చూశాడు భావయ్య.

"మీ అమ్మాయి ఫోటో మీ అమ్మాయిది కాదని– అంటే మీ అమ్మాయిదే కాని అబ్బాయిలా ఉందని– అంటే.. అందే అని మా సింహాద్రి అభిప్రాయం సార్"

"వ్వాట్?"

చిరంజీవి మళ్ళీ అంతా రిపీట్ చేశాడు.

"వ్వాట్?" అన్నాడు మళ్ళీ భావయ్య.

"మీ అమ్మాయి అబ్బాయి లాగుందని... సారీ అబ్బాయి లాగున్నాడని... అంటే మగ పోలికలు అంటే అసలు ఒరిజినల్‌గా పొరపాటున అబ్బాయి పోటో ఇచ్చారేమోనని"

"ఏమయ్యా నీకేమయినా మెదడు ఉండాదా?" కోపంగా అడిగాడు భావయ్య.

"ఉండాదండీ"

"ఉంటే అట్ల మాట్లాడతావేమీ?"

"అది నా అభిప్రాయం కాదండీ"

"మరెవరిది?"

"సింహాద్రిదండీ"

"ఏవయ్యా సింహాద్రి! గమ్మున ఉంటావేమీ? నీ మనసులో ఏమి ఉండాదో మాట్లాడు"

సింహాద్రి మాట్లాడేశాడు.

"సంగతేమిటంటేనండీ! చిరంజీవి చెప్పండి నిజమేనండీ"

"చిరంజీవా? చిరంజీవి ఎవరు?"

"నేనేనండీ?" అన్నాడు చిరంజీవి చిరునవ్వుతో..

"నువ్వు చిరంజీవివా?"

"అవునండీ"

"నువ్వు సిమ్మాద్రి వాడికేమి అవుతావు?"

"ఫ్రెండ్ అవుతానండీ"

"ఎప్పడినుండీ అవుతావు?"

"కాలేజ్ నుంచీ అవుతాను"

"అదిదా విశేషం"

"అవున్సార్! అదిదా విశేషం"

"అయితే ఇప్పుడేమి సెప్తావు?"

"నేనేమీ సెప్పనండీ! సిమ్మాద్రే సెప్తున్నాడు"

సింహాద్రి ఛటుక్కున అందుకున్నాడు.

"అవునండీ! సంగతేమిటంటేనండీ– మీ అమ్మాయి ఫోటోలో ఉన్నది నిజానికి మీ అమ్మాయి కాదేమోనండీ! మగాడిలా అయ్‌మీన్ ఫోటోల లేదా సెక్స్ మార్పిడి వగైరాలు..."

భావయ్యకు కోపం ముంచుకొచ్చింది.

"ఏమయ్యా! నీకేమయినా బుద్ధి వుండాదా?"

"ఎందుకండీ?"

"మా అమ్మాయిని అమ్మాయి కాదని సెప్తావేమి? అదిదా స్పోర్ట్‌గాళ్! ఎన్నో స్పోర్ట్స్ సేస్తది. గేమ్స్ సేస్తది. పాంటూ షర్టూ వేస్తంది. జుట్టు కత్తిరిస్తది– ఈ మాత్రానికేమి మగపిల్లాడని సెప్తావు?"

"అదికాదండీ..." ఏదో చెప్పబోయాడు. సింహాద్రి. కాని భావయ్య వినిపించుకోలేదు.

"ఏది కాదయ్యా! నువ్వు సెప్పేదేమీ సరిలేదు. నీకు సూపు సరి లేదా ఏమి? ఈ ఫోటోలోది నా కూతురు ఆడపిల్ల కాదంటావే? ఇది నిండా లక్ష్మీదేవిలాగుండాదని అందరూ సెప్తారు. ఏమయ్యా సిరంజీవీ... నువ్వు మాట్లాడవేమి?"

"లక్ష్మీదేవిలాగా వున్నమాట నిజమేకానండీ, కొంచెం ఏదో అంటే మరీ అంత ఎక్కువ కాదనుకోండి... కొంచెం అదేదోగా ఉన్నట్లుందండీ"

"అదేదోగా అంటే ఏమి?"

"అంటే.. అంటే మొఖంలో ఏదో క్రూరత్వం"

"ఆ! గుర్తుకొచ్చింది" అరచాడు సింహాద్రి.

భావయ్య ఉలిక్కిపడి సర్దుకున్నాడు.

"ఏమిటి గుర్తుకొస్తాది?"

'పెద్దపులి.. నోనో అయామ్‌సారీ చిరుతపులి"

భావయ్యకు సింహాద్రి మాటలు ఏమాత్రం అర్థం కాలేదు.

"ఏమయ్యా! నువ్వేమి సెప్తావు? అమ్మాయి సంగతి మాట్లాడమంటే చిరుతపులి, పెద్దపులి సంగతి సెప్తావేమీ?"

"నేను మీ అమ్మాయి- అయ్ మీన్ అబ్బాయి పోలికల గురించి చెప్తున్నానండీ"

"అమ్మాయి పోలికెవరిదని అడుగుతుండావా? అట్టా సెప్పరాదూ మళ్ళా. అమ్మాయి అచ్చం మా ఆవిడ పోలికదా తీసుకుంది"

"హో...." ఆనందంగా అరచాడు సింహాద్రి.

"అంటే మీ మిసెస్ కూడా పెద్దపులి లేక చిరుతపులి లేక మరేదయినా క్రూరమృగం అలా వుంటుందన్నమాట! వెరీ బాడ్! అయితే పాపం మీరేపద్ధతి అవలంబిస్తూంటారు?"

"వ్వాట్ పద్ధతా? పద్ధతేమి?"

"అదేసార్! అలాంటి భార్యలున్నవాళ్ళు రెండు రకాల పద్ధతులు ఫాలో అవుతారని చిరంజీవి చెప్పాడు. మొదటి దేమో టూరింగ్‌లైఫ్ పద్ధతి. రెండోది ... రెండోది... రెండోదేమిట్రా?" చిరంజీవి నడిగాడతను.

"శాటిలైట్ మెథడ్" గుర్తుచేశాడు చిరంజీవి.

"అవునవును. కరెక్ట్. శాటిలైట్ మెథడ్. ఈ రెండిట్లో మీరే పద్ధతి ఫాలో అవుతారు?"

"ఏమయ్యా! ఏమిటి సెప్తావు? నీ మెదడు ఎట్లా ఉండాది?"

"మెదడా? దాని సంగతి ఎందుకిప్పుడు?"

"మరి నిండా అర్థంలేని మాటలు మాట్లాడతావేమి? టూరింగ్ లైఫ్ పద్ధతి, శాటిలైట్

మెథడ్ ఏమిదంతా?" భావయ్య అయోమయంగా చిరంజీవి వేపు చూశాడు.

"అతనేమి అట్టా మాట్లాడతాడు?"

చిరంజీవి ఆయనకు దగ్గరగా జరిగాడు.

"మీకు ఫాక్ట్స్ అండ్ ఫిగర్స్ చెప్పమంటారా?"

"అంటే?"

"అంటే అదేసార్! నిజం చెప్పేయమంటారా?"

"అంటే?"

"పాపం మావాడికి అంటే మా సింహాద్రికి కొంచెం నట్స్ లూజ్‌లెండి! అంటే మీకు తెలుసుకదా! అదన్నమాట సంగతి! అయితే పరిస్థితి చేయిదాటలేదని గారంటీగా చెప్పగలను. అమావాస్యకూ, పౌర్ణమికీ మాత్రం కొంచెం ట్రబులిస్తాడు. అంతే! పెద్ద అల్లరేమీ చేయడు. కొంచెం ఎక్కువగా మాట్లాడతాడు! రోజుకి ఇరవై ఆరుగంటలు! అంతే. ఆ కొద్దిసేపు మాత్రం మనం వాడు చెప్పినట్లల్లావిని తలూపాలి! అవునని వప్పుకోవాలి అంతే! అలా చేస్తే ఏ ట్రబులూ వుండదు" వివరంగా చెప్పాడు చిరంజీవి.

భావయ్య మొఖం పాలిపోయింది.

"ఆ...! గుర్తుకొచ్చింది" కెవ్వున అరచి లేచి నిలబడ్డాడు సింహాద్రి.

"వ్వాట్?" అదిరిపడ్డాడు భావయ్య.

"లీఫ్ సంవత్సరం ఆరేళ్ళకోసారి వస్తుంది?" ఆనందంగా చెప్పాడు సింహాద్రి.

"ఆరేళ్ళకోసారా?"

"అవును"

"కాదు" అన్నాడు భావయ్య.

"మరి?"

"అయిదేళ్ళకు ఒకసారి వస్తుంది"

"కాదు ఆరేళ్ళు" అరిచాడు సింహాద్రి.

"వప్పుకోండి సార్! లేకపోతే చాలా గొడవయిపోతుంది" రహస్యంగా చెప్పాడు చిరంజీవి.

"ఏమి గొడవ సేస్తాడు?" అనుమానంగా అడిగాడు భావయ్య.

"మీదపడి జుట్టు పీకేస్తాడు"

"నాకు జుట్టులేదు కదా?"

"లేపోతే గిల్లుతాడ్సార్! ఊరికే మాత్రం వదలడు"

"సరి సరి" అన్నాడు భావయ్య భయపడుతూ.

"ఇంతకూ మీరేపద్ధతి ఫాలో అవుతారండీ? టూరింగ్ లైఫ్ పద్ధతా, శాటిలైట్ పద్ధతా?"

"నాన్సెన్స్" అన్నాడు భావయ్య చిరాకుగా.

"అలా కోప్పడకండి సార్! చెప్పాను గదా! పౌర్ణమీ, అమావాస్యకే కొంచెం ట్రబుల్ అంతే! మిగతా అన్ని రోజులూ హి విల్ బి ఫర్ ఫెక్ట్లీ ఆల్ రైట్!"

"ఇలాంటి మాడ్ ఫెలోని నా కూతురికి అంటగట్టాలనిదా ఆ విశ్వనాథం వాడు ప్రయత్నిస్తాడు. వాడి ముక్కు పగలకొట్టుతాను" కోపంగా అన్నాడు భావయ్య.

"అబ్బే! మీరు చిన్న విషయం పెద్దది చేస్తున్నారు సార్! వీడు మాడ్ ఫెలో కాదు! జస్ట్ బిగినర్! చాలా లేత పిచ్చి! మీరు దీనికంత ప్రాముఖ్యత ఇవ్వనవసరం లేదు. అసలు ప్రతిమనిషికీ ఎంతోకంత పిచ్చి ఉంటుందని సైకాలజిస్ట్‌లు అంటూంటారు. మీరు "మాన్ అండ్ మాడ్‌నెస్" అనే బుక్ చదివారా?"

"ఎందుకు చదవటం?"

"జస్ట్ నాలెడ్జ్ కోసం. పిచ్చి గురించి తెలుసుకోడానికి"

భావయ్య మళ్ళీ తన ధోరణిలో పడిపోయాడు.

"విశ్వనాథం వాడు నన్ను నిండా అన్యాయం సేస్తాడే! మా అమ్మాయికి పిచ్చివాడిని తెచ్చి కళ్యాణం సేస్తానంటాడే"

"మీరన్నమాట కూడా కొంతవరకూ నిజమే సార్! ఇలాంటి విషయాల్లో అబద్ధాలు చెప్పడం తప్పు!"

"తప్పా! ఇది తప్పుకాదు. నిండా క్రిమిషనల్ కేసు"

"క్రిమినలా?" ఆశ్చర్యంగా అన్నాడు చిరంజీవి.

"యస్. దిసీజ్ క్రిమినల్"

"నో సార్! దిసీజ్ సివిల్– నాట్ క్రిమినల్"

భావయ్యకు వళ్ళు మండిపోయింది. "నీకు "లా" ఏమి తెలుసని మాట్టాడతావు?" కోపంగా అన్నాడతను.

"నేను లాయర్ ఇంటిపక్కన కొన్నాళ్ళున్నాను"

"పోడా– మడ్ హెడ్"

"నా మాట విని మీరు తొందరపడకండి సార్! సింహాద్రి పర్‌ఫెక్ట్ బాయ్. ఆ ఒక్క లోపం తప్పిస్తే ఏ లోపమూ లేదు. మీ అమ్మాయికి ఈడూ జోడూ చక్కగా సరిపోతుంది. పౌర్ణమికీ, అమావాస్యకీ మీ అందరికీ ఒకరోజు ట్రబులుంటుంది. అదికూడా పెద్ద ట్రబుల్ కాదు. వాడు చెప్పినవన్నీ వింటే చాలు! అంతా ఓకే. మీకు రామోల్‌కర్ సవానీ తెలుసా? వెరీ గుడ్ బాయ్. మా రైల్వేలోనే డ్రైవర్. వాడు అన్ని విధాలా నార్మల్‌గానే వుంటాడు.

ఎటొచ్చీ అమావాస్యకీ, పౌర్ణమికీ మాత్రం కొంచెం చిరాగ్గా వుంటాడు. ఆ రెండు రోజులు డ్యూటీలో ఉంటే మాత్రం నానా హడావుడి చేస్తాడు. సిగ్నల్ ఇవ్వకపోయినా సరే రైలాపడు. ఆపితే ఇంక మళ్ళీ స్టార్ట్ చేయడు. లేదా ఒక్కోసారి రాత్రిళ్ళు రెండు స్టేషన్ల మధ్య మాంచి అడవిలో రైలాపి ఇంజన్ పక్కనే పక్కేసుకుని నిద్రపోతాడు. పొద్దునే లేచాడంటే మళ్ళీ మాపూలు మనిషయిపోతాడు" అంతవరకూ చెప్పి ఏదో అనుమానం వచ్చి పక్కకు తిరిగి చూశాడు చిరంజీవి. అప్పటికే భావయ్య మాయమయిపోయాడు.

"మీ వుడ్‌బి ఫాదరిన్లా ఏడీ?" సింహాద్రి నడిగాడతను.

"అదే నాకూ తెలీటం లేదు. బయట కారు స్టార్టవుతూంటే చూశాను. తీరా చూస్తే డ్రైవ్ చేస్తోంది భావయ్య! అంత క్విక్‌గా మనకు తెలీకుండా గదిలోంచి బయటికెలా వెళ్ళిపోయాడో తెలీదు"

"చాలా ఫాస్ట్‌గా చేశాడా పని" వప్పుకున్నాడు చిరంజీవి.

"ఇంతకూ అతని కూతురితో పెళ్ళి బాధ తప్పిపోయినట్లేనా?" అనుమానంగా అడిగాడు సింహాద్రి.

"సెంట్ పర్సెంట్"

సింహాద్రి తేలికగా గాలి పీల్చుకున్నాడు.

"ఇప్పుడు తిన్నగా మావయ్య దగ్గరకెళ్ళి నానా మాటలూ అంటాడేమో!"

"అవకాశాలు ఎక్కువగా ఉన్నాయ్"

"మరప్పుడు సంగతంతా మావయ్యకు తెలుస్తుంది కదా?"

"తప్పకుండా తెలుస్తుంది"

"తెలీగానే మరి మాంఛి కొరడా ఒకటి తీసుకుని మన కోసం రాడంటావా?"

"వస్తేరానీ! మనం అలాంటి సంభాషణ అస్సలు జరగలేదని పూర్తిగా వాదిస్తాం కదా!"

"ఐసీ!"

"ఎలావుంది మన ప్లాన్?" అడిగాడు చిరంజీవి.

"సింప్లీ సూపర్బ్! చాలా థాంక్స్‌రా"

"దట్సాల్ రైట్, ఏ ఫ్రెండ్ ఇన్ నీడ్ ఈజ్ ఏ ఫ్రెండ్ ఇండీడ్" చిరునవ్వుతో అన్నాడతను.

మర్నాడు తెల్లవారుజామున ఎనిమిది గంటలకల్లా లేచి అద్దం ముందు కూర్చున్నాడు సింహాద్రి. చిరంజీవి డ్యూటీ కెళ్ళి సాయంత్రం తిరిగి వచ్చేసరికి అప్పుడే మేకప్ పూర్తి చేసి లేచి నిలబడ్డాడు.

"ఎలా వుందిరా ఈ డ్రెస్ బాగా సూటయిందా?" అనడిగాడు అనందంగా.

"మాంచి రేసుగుర్రం లాగున్నావ్"

"ఇలా ఈ పోజులో నిలబడమంటావా, గడప దగ్గర?"

"ఛట్! రచయితలు గడప దగ్గరా, కిటికీ చువ్వలు పట్టుకునీ నిలబడతారేమిట్రా!"

"మరేం చేయమంటావ్?"

"ఆ అమ్మాయి వచ్చేసరికి టేబుల్ దగ్గర కూర్చుని నవల రాస్తూ వుండాలి"

"కానీ నాకు నవల రాయడం రాదుగా?"

చిరంజీవికి చిరాకేసుకొచ్చింది.

"రాకపోవడమేమిట్రా? నీకు రాజూ ఏడు చేపలు కథ తెలీదూ?"

"తెలుసు"

"దాన్నే సోషలైజ్ చేసెయ్? రాజు బదులు జమీందారు అని పెట్టు! ఆ జమీందారుకి ఏడుగురు కొడుకులు! ఒకడు డాక్టరు, ఒకడు ఇంజనీర్; ఒకడు బిజినెస్‌మాన్, ఇంకోడు రచయిత అలా ఏర్పాటు చేసెయ్. ఆఖరోడు మాత్రం రిక్షావాడు. నవలంతా వాడి చూట్టుతా తిరుగుతుందన్నమాట!"

"కానీ జమీందారు కొడుకు రిక్షా తొక్కడు కదా?"

"ఆ విషయం ఎవడడుగుతాడ్రా నిన్ను? అంతగ్గాపోతే వాడుట్టి ప్రిన్సిపుల్డ్ ఫెలో అని చెప్పు. తండ్రి డబ్బుతో బతకడం ఇష్టంలేని అభిమానమో, ఆత్మాభిమానమో అదేదో అఘోరించిందని కోసేయ్! నిజానికి వాడు విదేశాల్లో ఏదో పెద్ద కోర్సులు ఓ పాతిక చదివాడని చెప్పు. అయినాగాని కాయకష్టం చేసుకు బతకాలని వాడి హాబీ అన్నమాట. అలా ఏదోకటి లాగించెయ్యడమే"

"సరే. ఏవీ కాగితాలు."

"టేబుల్ మీద వున్నవి చాల్లే. త్వరగా స్టార్ట్ చేసెయ్ ఆ పిల్ల వచ్చే టైమయింది"

సింహాద్రి టేబుల్ ముందు కూర్చుని తనలో తను కూడ బలుక్కుంటూ నవల రాయడం ప్రారంభించాడు.

"అనగనగా ఓ జమీందారు. ఆ జమీందారు చాలా బీదవాడు. కానీ అతని కొడుకులు చాలా ధనవంతులు. అతని భార్య ఇంకా భోలెడు ధనవంతురాలు. కానీ ఆఖరి కొడుకు మాత్రం పరమ గర్భ ధరిద్రుడు..."

* * * * *

"రచయిత ధనుంజయ్‌గారిల్లు ఇదేనాండీ?" అన్న సన్నని గొంతువిని ఉలిక్కిపడి, గాబరా అయిపోయి, ఠక్కున లేచి నిలబడ్డాడు సింహాద్రి.

ఎదురుగ్గా ఫోటోలో చూసిన బొమ్మ ప్రాణం ప్లస్ ఇంకా బోలెడు అందంతో ఎదురుగ్గా నిలబడి వుంది.

కొద్దిక్షణాలపాటు సింహాద్రి ఆమెవంకే చూస్తూ, నోరు మెదపకుండా నిలబడిపోయాడు.

ఆమెకు అతని మానసికి పరిస్థితి మీద అనుమానం కలిగింది. గాలిలోకి చేయెత్తి అతని కళ్ళముందు రెండు చిటికెలు వేసింది.

అప్పుడుగాని సింహాద్రి స్పృహలోకి రాలేదు.

"ఆ... ధనుంజయ్‌గారిల్లాండి... అయన ఈ గది ఖాళీ..." మిగతాది కూడా పూర్తి చేసి ఉంటే ఆమె బులెట్ లాగా అక్కడి నుంచి దూసుకు వెళ్ళిపోయుండేది.

కానీ సింహాద్రి పరిస్థితంతా హారర్ పిక్చర్ చూస్తున్నట్లు గమనిస్తోన్న చిరంజీవి చప్పున అడ్డుపడిపోయాడు.

"ఉష్! వాగకురా! రండి మేడమ్ రండి! ఇదే ధనుంజయ్ గారిల్లు" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

శ్రీదేవి సంతృప్తిగా గాలి పీల్చుకుంది.

"హమ్మయ్య... వెదకలేక చచ్చాను. పాడు ఇంటి నంబరురీ ఈ సిటీలో ఇంటినంబర్లకు ఒక వరుసాలేదూ, వాయీలేదు"

"అవునండీ! అసలివి ఇళ్ళ నెంబర్లు కాదండీ. సీక్రెట్ కోడ్ నంబర్లు. ఒకరిల్లు ఒకరికి తెలీకుండా ఉంటానికని కార్పోరేషన్ వాళ్ళు అలా ఏర్పాటు చేశారు. రండి లోపల కూర్చోండి"

శ్రీదేవి లోపలికొచ్చి కుర్చీలో కూర్చుంది.

"అన్నట్లు ఇంతకూ ధనుంజయ్‌గారెవరు?" అంది ఇద్దరినీ పరీక్షగా చూస్తూ.

"ఇదిగో వీడేనండీ" అన్నాడు చిరంజీవి ఛప్పున సింహాద్రిని చూపిస్తూ. అని సింహాద్రి భుజం మీద రహస్యంగా తన మోచేత్తో ఒక్కపోటు పొడిచాడు.

దాంతో సింహాద్రి "అమ్మో" అని అరవబోయి ఆపుకుని "అవునండీ... నేనండి.." అన్నాడు గాబరాగా.

"మీరా!" ఆశ్చర్యంగా అడిగిందామె.

"అవునండీ! నేనే"

"ఓ.. నమస్తే"

"నమస్కారమండీ!"

"నా ఉత్తరం అందిదా మీకు?" అడిగిందామె.

"అందిందండీ! ఫోటో కూడా అందింది. ఫోటో చాలా బాగుందండీ"

"అందిందో లేదో అని భయపడుతూ వచ్చాను... ఇంతకూ వీరెవరు?" చిరంజీవిని చూస్తూ అడిగిందామె.

"వాడు నా ఫ్రెండండీ! ఇద్దరం ఇంటర్ కలిసి చదువుకున్నాం"

"ఓహో! క్లాస్ మేటన్నమాట"

"అవునండీ, 'డి' సెక్షన్! కదురా?"

"అవునండీ... 'డి' సెక్షన్! రోల్ నెంబర్ థర్టీ సెవెన్"

"నమస్తే" అందామె చిరంజీవివేపు తిరిగి.

"నమస్తే... నమస్తే... నమస్తే."

"మీ పేరేమిటండీ?"

"చిరంజీవి అంటారండీ?"

"ఎవరు?"

"ఎవరా? ఎవరంటే... అదే అందరూనండీ.. వీడు కూడా అంతే"

"నిజమేనండీ! వాడి పేరు చిరంజీవే"

"ధనుంజయ్‌గారూ మీరేదో రాస్తున్నట్లున్నారు కదూ?" టేబుల్ మీద కాగితాలు, పెన్నూ చూసి అడిగిందామె.

"అవునండీ! అర్జంటుగా ఓ నవల రాద్దామనీ..."

"మీ నవలలంటే నాకెంతో ఇష్టమండీ! మీ నవలలోని హీరోలందరూ రోజుకొకరు చొప్పున నా కలలో కనిపిస్తారండీ"

"అలాగా చాలా సంతోషం"

"కనబడి ఏం చేస్తారో తెలుసాండీ?'

"తెలీదండీ! ఏం చేస్తారు?"

"తెల్లారే వరకూ వదలరండీ! కబుర్లు చెప్తారు; షికార్లు తీసుకెళ్తారు. భలే తమాషాగా ఉంటుందిలెండి! మీ నవల 'గతి తప్పిన మతి' ఎన్ని సార్లు చదివానో మీకు రావానా?"

"రాయలేదండీ!"

"ఇరవై మూడుసార్లు"

"ఎందుకండీ అన్ని సార్లు చదవడం?"

"కనీసం అప్పటికపయినా సురేఖ పంతం మాని శ్రీవిరించి దగ్గరకెళ్తుందేమోననండీ!"

సింహాద్రి కన్‌ఫ్యూజ్ అయిపోయాడు.

"సురేఖా? సురేఖ ఎవరండీ?" ఆశ్చర్యంగా అడిగాడు.

శ్రీదేవి కిలకిల నవ్వేసింది.

"అదేమిటి! మీ నవల్లో హీరోయిన్నే మర్చిపోయారా మీరు"

సింహాద్రికి చెమటలు పట్టేసినాయ్.

"ఇహి... ఇహిహి" అన్నాడు తప్పించుకోడానికి.

చిరంజీవి మళ్ళీ సింహాద్రి రక్షణకు వచ్చేశాడు.

"వాడికి కొంచెం మతిమరపు ఎక్కువలెండి. నవలల పేర్లు, పాత్రలు, సంఘనటలు, కథావస్తువు ఇవేవీ గుర్తుండవండీ! కదురా?"

సింహాద్రి రకీమని తేరుకున్నాడు.

"అవునండీ! అస్సలు గుర్తుండవు"

శ్రీదేవి ఆశ్చర్యపోయింది.

"అరె! భలే ఆశ్చర్యంగా ఉందే! అంత మతిమరుపువాళ్ళు మరలాంటి నవలలెలా రాయగులుగుతున్నారు?"

"నాకూ అదే తెలీటం లేదండీ. భలే తమాషాగా ఉంది కదండీ?"

శ్రీదేవి ఓ క్షణం ఆలోచనలో పడి ఇంటి లోపల ఇంకా గదులేమయినా ఉన్నాయో మోనని చూసింది.

"ఇంట్లో మీ ఇద్దరే వుంటున్నారాండీ" సింహాద్రి నడిగిందామె.

'అవునండీ!"

"అంటే మీకింకా పెళ్ళికాలేదా?"

"అబ్బే, ఇంకా లేదండీ! పిల్లలు కూడా లేరు"

"అలాగా!"

"అవునండీ!"

"నేనింకా మీకు పెళ్ళయిపోయిందను కుంటున్నాను"

"ఇంకా లేదండీ! చేసుకుందామనే అనుకున్నానుగానీ చేసుకోలేదు"

"ఎందుకని ఆగారు?"

"ఇంతవరకూ అంటే ఇంతకు ముందువరకూ నాక్కావలసిన టైప్ అమ్మాయి కనిపించలేదన్న మాటండీ!"

"మీక్కావలసిన అమ్మాయి ఎలా ఉండాలనుకుంటున్నారు? మీ హీరోయిన్ సురేఖలాగానా, చంద్రకళ లాగానా, భారతిలాగానా?"

సింహాద్రి మళ్ళీ కన్‌ఫ్యూజ్ అయిపోయాడు.

"ఎలాగా? ఎలాగంటేనండీ! ఎలాగంటే ఎలారా చిరంజీవీ?"

చిరంజీవి రకీమని అందుకున్నాడు.

"భారతిలాగా వుండాలనుకుంటున్నాడండీ!"

సింహాద్రిలో కూడా ఉత్సాహం పొంగుకొచ్చింది.

"అవునండీ! అచ్చం భారతిలా వుంటే నాకు భలే ఇష్టం"

"అయ్యో అదేమిటి?" ఆశ్చర్యపోయింది శ్రీదేవి.

సింహాద్రి నీరసపడిపోయాడు.

"ఏమైందండీ?"

"భారతి పిచ్చిది కదండీ మీ నవల్లో?"

"ఆ.. పిచ్చిదా?"

"అవును... మర్చిపోయారా?"

"అబ్బే గుర్తుంది. ఏమిట్రా చిరంజీవి?"

చిరంజీవి కంగారుపడ్డాడు.

"అయితే అయితే ఆ భారతి కాదండీ! వీడు రాయబోతున్న కొత్త నవలలో హీరోయిన్ భారతి..."

ఆమె కళ్ళు ఆనందంతో మెరిసినయ్.

"ఓ.. మీరు కొత్త నవల రాస్తున్నానన్నారు కదూ?"

"అవునండీ"

"ఈ నవల కూడా హిప్నాజిటం మీదే రాశారాండీ?"

"అవునండీ! బోలెడ్ హిప్నాటిజం వుంటుంది కథలో అంతేకాదు– టెలీపతి కూడా వుంటుంది"

"కథేమిటో చెప్పరూ? ప్లీజ్"

సింహాద్రి తబడపోయాడు!

"కథా? కథా అదేనండీ... ఏమిటంటే... ఏమిటంటే"

"అదేరా నాకు చెప్పావుగా ఇందాక జమీందారు ఉంటాడు..." తనందుకున్నాడు చిరంజీవి!

"ఆ గుర్తుకొచ్చేసింది– ఇంక నువ్వు చెప్పొద్దు! నేనే చెప్తా చూడు! అనగనగా ఓ జమీందారు ఉంటాడండీ ఆయన రోజు రిక్షా తొక్కి పొట్ట పోసుకుంటూంటాడండీ"

శ్రీదేవి ఆశ్చర్యపోయింది.

"అదేమిటి? జమీందారు రిక్షా తొక్కటం ఎందుకు?"

"ఏమో తెలీదండీ" అంటూ చిరంజీవి వేపు చూశాడతను.

"జమీందారు కాదురా– జమీందారు కొడుకు అన్నామిందాక"

"ఆ.. అవునవును! జమీందారుగారి ఆరో కొడుకు రిక్షా తొక్కుతాడన్న మాటండీ"

శ్రీదేవికి చిరాకేసుకొచ్చింది.

"అతనయినా గాని అంత ఆస్తి ఉండగా రిక్షా ఎందుకు తొక్కాలి?"

"ఎందుకంటే అది హాబీ అన్నమాటండీ! ఇప్పుడు మనకి స్టాంపులు సేకరించడం, రచనలు చేయడం, ఫోటోగ్రఫీల్లాంటివి ఎలా హాబీలో వాడికది హాబీ అన్నమాటండీ"

"నేనింతవరకూ అలాంటి హాబీ గురించే వినలేదు" అందామె నమ్మలేనట్లు.

"నేనూ వినలేదనుకోండి! కానీ మన నవల్లో అలా వుంటుందన్న మాటండీ"

"మరి ఇందులో హిప్నాటిస్ట్ ఎవరండీ?"

సింహాద్రి స్పీడ్‌గా ఆలోచించసాగాడు.

"ఎవరా? ఎవరంటే.. ఎవరంటే.. ఆ! వాడేనండీ! రిక్షావాడు"

శ్రీదేవి ఉలిక్కిపడింది.

"రిక్షావాడా?"

"అవునండీ"

"అతనికెలా వచ్చు హిప్నాటిజం"

"వాడు అమెరికాలో హిప్నాటిజం నేర్చుకుని వచ్చాడన్న మాటండీ! అది నవల ఆఖర్లోగాని అడియెన్స్‌కి తెలీదు"

"ఆడియోన్సేమిటి? పాఠకులు కదూ?"

"ఓ... అయామ్ సారీ.. ఇదే పిక్చర్ కూడా తీయాలని ప్లాన్ చేస్తున్నాలెండి. అందుకని ఆడియెన్స్ అన్నాను"

"అప్పుడేమవుతుందండీ?"

"ఏముందండీ? ఓ రోజు ఓ అమ్మాయి అతని రిక్షా ఎక్కి ఏడుస్తుందండీ. ఆమెను చూసి జాలిపడి రిక్షావాడు కథేమిటని అడుగుతాడండీ. ఆమె కథ చెప్తుందండీ! రిక్షావాడు ఆమె సహాయం చేయాలని నిశ్చయించుకుని రంగంలోకి దిగుతాడండీ! అక్కడి నుంచి కథ భలే తిరిగి పోతుందండీ! కథలోకి మహా మహా మంత్రగాళ్ళూ కూడా జొరబడతారండీ"

"అబ్బ! ఒండర్‌ఫుల్"

"మనం కాసేపలా బీచ్ కెళ్దామాండీ?"

"బీచ్‌కా? హైదరాబాద్‌లో బీచ్ ఏమిటి?"

"సారీ! కాదండీ. డిన్నర్ కెళ్దామా అనబోయి బీచ్ అన్నానండీ! అచ్చు తప్పన్నమాటండీ"

"ఇప్పుడు టైం లేదండీ! మరోసారి వెళ్దాం. మా డాడీ నాకోసం ఎదురుచూస్తూంటాడు. అది సరేగానండీ– మీకు హిప్నాటిజం వచ్చా?"

సింహాద్రి ఉలిక్కిపడ్డాడు.

"హిప్నాటిజమా?"

"అవునండీ! అది వచ్చినవాళ్ళంటే నాకెంతో ఇష్టం"

"అలాగా! అయితే నాకూ వచ్చండి. హిప్నాటిజమే కాదు టెలిపతీ, విలోపతి, సైకోపతీ, మైకోపతి ఇవన్నీ కూడా వచ్చండీ"

"ఆ! నిజంగానా?"

"అవునండీ! కావాలంటే మా చిరంజీవి నడగండి"

"అవునండీ! వాడు చాలా పెద్ద హిప్నాటిస్ట్! కాపోతే ఈ విషయం ఎవరికీ తెలీదు. ఆఖరికి వాడిక్కూడా తెలీదు అంత సీక్రెట్ అన్నమాట"

"ధనుంజయగారూ! నన్నోసారి హిప్నటైజ్ చేయరూ? ప్లీజ్"

"మిమ్మల్నా?"

"అవునండీ"

"మిమ్మల్ని చేయటం కుదరదండీ"

"ఎందుకని?"

"ఏమోనండీ! తెలీదు. కానీ మీ అంత అందమయిన అమ్మాయిలను చేయాలంటే చాలా కష్టమండీ! కదురా చిరంజీవి"

"అవునండీ! కుదరదండీ!"

"పోనీ చిరంజీవిగారిని చేయగలరా?"

"ఓ ఇట్టే చేస్తాను. చిరంజీవి ఇలారారా! ఇటుకూర్చో" అన్నాడు సింహాద్రి ఆనందంగా. చిరంజీవి వచ్చి అతని కెదురుగ్గా కూర్చున్నాడు.

"నువ్విప్పుడు నావంకే చూస్తున్నావ్... నావంకే చూస్తున్నావ్... నావంకే చూస్తున్నావ్" అన్నాడు సింహాద్రి.

చిరంజీవి మత్తెక్కిన వాడిలా అతని వంకే చూడసాగాడు.

"నువ్విప్పుడు నిద్రలో కెళ్ళి పోతున్నావ్... నిద్రలో కెళ్ళిపోతున్నావ్... నిద్రలో కెళ్ళి కెళ్ళిపోతున్నావ్" అన్నాడు సింహాద్రి.

చిరంజీవి గుర్రున గురక పెడుతూ కూర్చునే నిద్రలోకి వెళ్ళిపోయాడు. ఆ దృశ్యం చూసి ఆనందం పట్టలేక శ్రీదేవి తప్పట్లు కొట్టేసింది.

"అబ్బ! యూ ఆర్ రియల్లీ ఒండర్ ఫుల్" అంది అతని వంక అభిమానంగా చూస్తూ.

"ఇప్పుడు నువ్వు నిద్రలేచి ఎగిరి గంతులేస్తున్నావ్.... ఎగిరి గంతులేస్తున్నావ్... ఎగిరి గంతులేస్తున్నావ్" అన్నాడు సింహాద్రి ద్విగుణీకృత ఉత్సాహంతో.

అంత కష్టమయిన ఎక్సర్‌సైజ్ ఇస్తున్నందుకు సింహాద్రి వంక కొరకొర చూస్తూ ఎగిరి గంతులేయసాగాడు చిరంజీవి.

శ్రీదేవి మళ్ళీ తప్పట్లు కొట్టేసింది.

"ఇప్పుడు నువ్వు ఇంటిబయటికెళ్ళి రూమ్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నావ్... రూమ్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నావ్.. రూమ్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నావ్"

చిరంజీవికి వళ్ళు మండిపోయింది. కాని చేసేదిలేక తూనీగలా బయటకు పరుగెత్తి రూమ్‌కి ఓ ప్రదక్షణ చేసేసరికి అప్పుడే రూమ్ ముందు ఆటో దిగుతున్న మావయ్య కనబడ్డాడు. వెంటనే అదే తూనీగలాగా మళ్ళీ రూమ్‌లోకొచ్చేసి కుర్చీలో కూలబడిపోయాడు ఒగరుస్తూ.

అది చూసి వెంటనే తన సజేషన్ మార్చేశాడు సింహాద్రి.

"నువ్విప్పుడు మామూలు స్థితిలో కొస్తున్నావ్... మామూలు స్థితిలో కొస్తున్నావ్... మామూలు స్థితిలో కొస్తున్నావ్.."

"ఒరేయ్! బయట నిలబడ్డ ఆ వ్యక్తిని హిప్నటైజ్ చెయ్ చూద్దాం" అంటూ చిరంజీవి సైగ చేశాడు శ్రీదేవి చూడకుండా.

సింహాద్రి రోడ్డుమీద ఆటో రిక్షావాడి దగ్గర చిల్లరకోసం నిలబడ్డ మామయ్యను చూసి కంగారుపడ్డాడు. చిరంజీవి అయిడియా ప్రకారం రిస్క్ తీసుకోకపోతే శ్రీదేవి ముందు తన పరువు తీసేస్తాడు మామయ్య.

శ్రీదేవిక్కూడా ఆ సలహా నచ్చింది.

"అవునండీ! అదిగో ఇప్పుడే ఆటో దిగాడే– ఆ మీసాలతనికి చేయండి. భలే సరదాగా వుంటుంది" అంది ఆనందంగా.

"సరే. మీరడిగారు కాబట్టి చేస్తాను" అన్నాడు సింహాద్రి వణుకుతూ, అప్పటికే విశ్వనాథ గడప దగ్గరకొచ్చి లోపల సింహాద్రి, చిరంజీవిలతో పాటు ఓ అందమయిన ఆడపిల్లకూడా వుండడం చూసి ఠక్కున ఆగిపోయాడు. అతనిని చూసేసరికి సింహాద్రి నోటివెంబడి మాటరాలేదు. పెదాలు మాత్రమే కదులుతున్నాయ్. అది చూసి చిరంజీవి సింహాద్రిని మోచేత్తో ఒక్కపోటు పొడిచాడు. "అమ్మో" అని అరచాడు సింహాద్రి. అరచి వెంటనే స్పృహలో కొచ్చి విశ్వనాథం వేపు చూసి "మీరు లోపలికొస్తున్నారు.. లోపలికొస్తున్నారు.. లోపలికొస్తున్నారు" అన్నాడు.

విశ్వనాథానికి అతని మాటలేమాత్రం అర్థంకాలేదు. అసలా ఆడపిల్ల ఆ రూంలో ఎందుకుందా అని అర్థమవక ఛస్తూంటే మధ్యలో సింహాద్రి "మీరు లోపలికొస్తున్నారు" అని మూడుసార్లు అనడం మరింత అయోమయంగా అనిపించింది. ఆ ప్రదేశంలో ఎక్కడో

ఏదో అసహజంగా ఉన్నట్లనిపిస్తోంది. అనుమానంగా గదిలోకి నడిచి నాలుగు మూలలా గాలిస్తున్నట్లు చూశాడతను.

"మీరు నావంకే చూస్తున్నారు. నావంకే చూస్తున్నారు. నావంకే చూస్తున్నారు" అన్నాడు సింహాద్రి మళ్ళీ.

దాంతో వళ్ళుమండిపోయింది విశ్వనాథానికి.

"నోర్మూసుకోరా పక్షీ! నీవంకే చూడడం ఏమిటి? చూస్తేనేం? ఏం చేస్తావ్?" అన్నాడు గట్టిగా అరుస్తూ.

"మీరిప్పుడు నిన్నటిలో కెళ్ళున్నారు. నిన్నటిలో కెళ్ళున్నారు.. నిన్నటిలో కెళ్తున్నారు" అన్నాడు సింహాద్రి అతని మాటలు పట్టించుకోకుండా.

హఠాత్తుగా విశ్వనాథానికి అనుమానం ముంచు కొచ్చింది.

సింహాద్రి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపిస్తోంది. తనతో భావయ్య చెప్పిన విషయాలన్నీ నిజమోనేమో! సింహాద్రికి ఆకస్మాత్తుగా చిన్నసైజు పిచ్చి పట్టుకుందేమో! లేపోతే అలా అర్థం పర్థంలేని మాటలు ఎందుకు మాట్లాడతాడు?

"నిన్నటిలో కెవరయినా వెళ్ళగలరా? ఛస్తే వెళ్ళలేరు. నిన్నటిలోకీ వెళ్ళలేరు, రేపటిలోకీ వెళ్ళలేరు.

సింహాద్రి విశ్వనాథం మొఖంలోని మార్పులన్నీ జాగ్రత్తగా గమనిస్తూనే వున్నాడు.

"మీరు నిన్నలో ఉన్నారు– నిన్నలో ఉన్నారు– నిన్నలో ఉన్నారు–" అన్నాడు అతను మళ్ళీ.

విశ్వనాథం అంత తేలిగ్గా సింహాద్రి పిచ్చి గురించి నిర్ధారణకు రాదల్చుకోలేదు. అంచేత క్రాస్ కొశ్చెన్స్ వేయాలని నిర్ణయించుకున్నాడు.

"ఏమిటి భావయ్య దగ్గర వాగావుట?" తీవ్రంగా అడిగాడు.

"చూశావా శ్రీదేవి! అతనిప్పుడు నిన్నట్లో కెళ్లి పోయాడన్నమాట! నిన్న జరిగిన అతని తాలూకు విషయాలన్నీ ఇప్పుడు మాట్లాడాతాడన్న మాట"

"అబ్బ! ఎంత బాగుందో" అంది శ్రీదేవి ఆనందంగా.

"ఏమిటా పిచ్చివాగుడు?" అరచాడు విశ్వనాథం.

శ్రీదేవి తప్పట్లు కొట్టింది. ఆమెతోపాటు చిరంజీవి కూడా తప్పట్లు కొట్టేశాడు.

"వండర్ ఫుల్" అంది శ్రీదేవి.

"యస్. కంప్లీట్‌గా నిన్నటిలో కెళ్ళిపోయాడు" అన్నాడు చిరంజీవి.

"ఏం? నీక్కూడా ఎక్కిందా పిచ్చి?" చిరంజీవిని తీవ్రంగా చూస్తూ అడిగాడు మావయ్య.

"ఏమిట్రా అతను మాట్లాడుతున్నాడు" అర్థంకానట్లు సింహాద్రినడిగాడు చిరంజీవి.

"పిచ్చి గురించి మాట్లాడుతున్నాడు. బహుశా నిన్న వాళ్ళింట్లో ఎవరికో పిచ్చిపట్టి వుంటుంది. లేదా ఈయనకే పిచ్చి ఉండవచ్చు. అతను ఇంకొంచెం వివరంగా మాట్లాడితేనే గాని మనకు తెలీదు" అన్నాడు సింహాద్రి.

మావయ్య కేమీ పాలుపోవడం లేదు. భావయ్య చెప్పినట్లు సింహాద్రి పిచ్చివాడనడానికే ఎక్కువ అస్కారాలు కనబడుతున్నాయ్.

కానీ మరి ఈ చిరంజీవిగాడు కూడా ఎందుకలా మాట్లాడుతున్నట్లు? అంటే ఇందులో ఏదో నాటకం ఉందన్న మాట!

"అయితే ఇద్దరూ కలిసి భావయ్య దగ్గర నాటక మాడారన్నమాట" అన్నాడు కోపంగా.

సింహాద్రి, చిరంజీవి మొఖాలు చూసుకున్నారు.

"భావయ్య ఎవరు?" చిరంజీవి సింహాద్రిని అడిగాడు.

"నిన్న అతనికి జరిగిన ఓ సంఘటనలో భావయ్య అనే వ్యక్తి కూడా ఉన్నాడన్న మాట" చెప్పాడు సింహాద్రి.

"ఈ వెధవ్వేషాలు నా దగ్గర కాదు! ఆ సంబంధం తప్పించుకోడానికి నీకు పిచ్చి వున్నట్లు నువ్వు వాగితే, వాడేమో నీది మెంటల్ కేసని సర్టిఫికేట్ ఇస్తాడా? ఇద్దరూ కలసి నిక్షేపం లాంటి సంబంధం కాస్తా చెడగొట్టేస్తారా? రాస్కెల్స్! మీ పని ఇప్పుడే పడతాను" అంటూ ఓ అడుగు ముందుకి వేశాడు విశ్వనాథం.

"ఏమిటి అంటాడు?" అడిగింది శ్రీదేవి సింహాద్రిని.

"ఏదో పెళ్ళి సంబంధం గురించి. ఇతనినెవరో కుర్రాళ్ళు ఆటలు పట్టించినట్లున్నారు. అందుకని కోపం వచ్చిందన్న మాట" అన్నాడు సింహాద్రి.

"అబ్బ! రియల్లీ ఒండర్‌ఫుల్" అంది శ్రీదేవి.

"అవును. చాలా మోర్వలెస్ ఈవెంట్" వప్పుకున్నాడు చిరంజీవి.

"ఒకోసారి ఇలా బాగా కుదురుతుంది" అన్నాడు సింహాద్రి.

"అవును శ్రీదేవిగారూ! సింహాద్రి ఇంతకుముందు కూడా ఇలాంటి ప్రదర్శనలు చాలా ఇచ్చాడుగానీ, ఇంత సూపర్బ్‌గా ఎప్పుడూ కుదరలేదు" అన్నాడు చిరంజీవి.

విశ్వనాథం ఉగ్రుడయిపోయాడు.

అయితే రక్కున వాళ్ళ మీద దాడి చేయడానికి కొంచెం బెరుగ్గానే ఉంది. "రాస్కెల్స్! ఏమిట్రా సూపర్బ్ అంటున్నావ్" చిరంజీవి వంక చూస్తూ అరిచాడు.

"మీరు మళ్ళీ ఇవాళ్టిలో కొచ్చేస్తున్నారు– ఇవాళ్టిలో కొచ్చేస్తున్నారు. ఇవాళ్టిలో కొచ్చేస్తున్నారు." అన్నాడు సింహాద్రి విశ్వనాథం వంక చూస్తూ.

"ఇవాళ్టిలోకా?" అరచాడు విశ్వనాథం.

"అవును" అన్నాడు సింహాద్రి.

"ఏమిటి ఇవాళ్టిలోకి రావడం?"

"అంటే– అదే ఇవాళ్టిలోకి. ఇంతవరకూ నిన్నటిలో ఉన్నారు కదా?"

"ఇవాళ లేదు నిన్నా లేదు! నోర్మూసుకో! ఇప్పుడు మీ ఇద్దరినీ డొక్క చీరేస్తేగాని అసలు విషయం బయట పడదు" అంటూ వాళ్ళ డొక్క చీరడానికని సరయిన ఆయుధం కోసం గదంతా వెతకసాగాడు. అతని కళ్ళకి టేబుల్ మీదున్న పొడుగాటి దబ్బలం కనిపించింగానే స్ప్రింగులా ఎగిరి అది చేతిలోకి తీసుకున్నాడు.

శ్రీదేవి ఆశ్చర్యపోయింది.

"అదేమిటి? అతను ఇవాళ్టిలోకి రాడేం?" సింహాద్రి నడిగింది విస్తుపోతూ.

"ఒకోసారి అంతేనండీ! ఓ పట్టాన రారు" అన్నాడు సింహాద్రి.

"మరి రాపోతే ఎలా?"

"ఎలాగేముందీ? ఎన్ని రోజులయినా అక్కడే ఉండి పోతాడు"

"పాపం! పూర్ ఫెలో" జాలిపడింది శ్రీదేవి.

"ఏయ్ పిల్లా! ఎవర్నువ్వు?" శ్రీదేవి వంక కోపంగా చూస్తూ అరిచాడు విశ్వనాథం.

శ్రీదేవి మరింత ఆశ్చర్యపోయింది.

"నాతోనేనా మాట్లాడుతున్నాడు?" సింహాద్రి నడిగిందామె.

"అవును" అన్నాడు చిరంజీవి.

"అతను నిన్నటిలో ఉన్నాడు కదా! మరి నాతో ఎలా మాట్లాడుతున్నాడు?"

"నిన్నలో కూడా మీలాంటి ఓ అమ్మాయితో ఘర్షణ పడ్డాడన్న మాటండీ! అందుకని మిమ్మల్నలా అంటున్నాడు" చెప్పాడు చిరంజీవి.

"పాపం పూర్ ఫెలో!" మళ్ళీ జాలిపడింది శ్రీదేవి.

"ఇదిగో ఇంకోసారి పూర్ ఫెలో గీర్ ఫెలో అన్నావంటే మక్కెలిరగ్గొడతాను" కోపం అణుచుకుంటూ అరచాడు విశ్వనాథం.

"వెరీబాడ్ లాంగ్వేజ్" శ్రీదేవి.

"అవునండీ! భాష చాలా మెరుగు పర్చుకోవాల్సుంది అతను! పదిహేను రోజుల్లో తెలుగు అనే పుస్తకం కొంటే సరిపోతుంది" తన అభిప్రాయం చెప్పాడు చిరంజీవి.

"ఇంతకూ ఇప్పుడితనిని బయటకు పంపటం ఎలా?" అడిగింది శ్రీదేవి.

"అదే.. అదే... నాకూ తెలీటం లేదు" అన్నాడు సింహాద్రి.

"దాన్దేముందీ– బలవంతంగా గెంటెయ్యడమే" అన్నాడు చిరంజీవి.

"అమ్మో! బలవంతంగానా?" భయంగా అంది శ్రీదేవి.

"అవును"

"అతను గొడవచేయడూ?"

"మరతను ఇవాళ్టిలోకి రాకపోతే మనమేం చేస్తాం" అన్నాడు సింహాద్రి చిరంజీవిని సమర్థిస్తూ.

విశ్వనాథం ఇంక పట్టలేకపోయాడు.

"ఏంట్రా! నన్ను బయటకు గెంటుతారా?" మండిపడుతూ అరిచాడు.

"అవును" అన్నాడు సింహాద్రి.

"మీ అంతట మీరు వెళ్ళకపోతేనే లెండి! వెళ్ళిపోతే ఆ అవసరం ఉండదు" అన్నాడు చిరంజీవి.

"ఎగ్జాక్ట్‌లీ" వప్పుకున్నాడు సింహాద్రి.

"ఒరేయ్ సింహాద్రీ! నీ పులుసు పిండేస్తాను చూడిప్పుడు" అంటూ చేతిలోని దబ్బలం పైకెత్తి పట్టుకున్నాడు విశ్వనాథం ఉక్రోషంగా.

"అదేంటి? మీ పేరు ధనుంజయ్ అయితే సింహాద్రి అంటాడేమిటి?" ఆశ్చర్యంగా అడిగింది శ్రీదేవి.

"అదా అదీ.. అది... అది.. అవున్రా చిరంజీవీ! నన్ను సింహాద్రి అంటాడేమిటి?" ఆశ్చర్యంగా నటిస్తూ అడిగాడు సింహాద్రి.

"దటీజ్ సింపుల్" అన్నాడు చిరంజీవి.

"ఏమిటి సింపుల్"

"అదే! నీ పేరు. అందులో పెద్ద ఇదేముంది! అతని మేనల్లుడి పేరు సింహాద్రే అయ్యుంటుంది. అందుకని అతనితో మాట్లాడుతున్నట్లే నీతో మాట్లాడుతున్నాడు"

"అంటే ఈ గొడవంతా నిన్న అతనికీ, అతని మేనల్లుడికీ మధ్య జరిగిందన్నమాట" అంది శ్రీదేవి.

"అంతేకాదు! అతని మేనల్లుడి ఫ్రెండ్‌కీ, మిమ్మల్ని పోలిన ఓ అమ్మాయికీ కూడా అతనితో పేచీ పడిందన్నమాట!" వివరించాడు చిరంజీవి.

"ఇలా అందరితోనూ పేచీపడ్డాడంటే వట్టి పేచీకోరు మనిషి లాగున్నాడు" అందామె.

"వట్టి ఏమిటి? మహా పేచీకోరన్నమాట!"

ఈ పరస్థితి సహించడం ఇంక విశ్వనాథం వల్ల కాలేదు. వీళ్ళిద్దరి నాటకం వల్లే భావయ్య ఆస్తిలో బోలెడు భాగం కొట్టెయ్యవచ్చన తన ప్లానంతా సర్వనాశనం అయిపోయింది. పోనీ ఈ సింహాద్రిగాడు స్పష్టంగా భావయ్యతో "నీ కూతురిని పెళ్ళి

చేసుకోవడం నాకు ఇష్టం లేదు" అంటే భావయ్య ఇంతగా అప్సెట్ అయ్యేవాడు కాదు. అలా కాకుండా పిచ్చి ఎక్కినట్లు ప్రవర్తించడం వల్ల వాడికి సహజంగా పిచ్చి వుందని నమ్మాడతను. అంతేకాదు అలాంటి పిచ్చివాడిని తన కూతురికి అంటగట్టబోయినందుగ్గాను తను అతనికివ్వాల్సిన యాభయివేలూ అర్జంటుగా అప్పటికప్పుడు కక్కమనివార్నిగించాడు. అంచేత తనకింత అపారనష్టం కలిగించిన వీళ్ళిద్దర్నీ ఇలా తిట్లతో వదుల్తే లాభం లేదు. మరోసారి ఇలాంటి వెధవ్వేషాలు చేయకుండా చేసేయాలి.

ఇలా నిర్ణయించుకుని దబ్బలంతో వారి మీదకు ఎగిరి దూకాడతను. అతని వాలకం చూసిన సింహాద్రి మరుక్షణం గది మూలకు గెంతి రన్నింగ్ రేస్‌లో పరుగెత్తబోతున్న వాడిలా పొజిషన్ తీసుకుని నిలబడ్డాడు.

అది చూసి చిరంజీవికూడా నాలుగు అడుగులు వెనక్కు వేసి తలుపు దగ్గరకు చేరుకున్నాడు.

మరుక్షణంలో రన్నింగ్ రేస్ ప్రారంభమయిపోయింది.

ముందు సింహాద్రీ, అతని వెనుక దబ్బలంతో విశ్వనాథం, అతని వెనుక చిరంజీవీ ఆ గదిచుట్టూ గంటకు ముప్ఫయ్ కిలోమీటర్ల వేగంతో పరుగెత్తసాగారు.

శ్రీదేవి ఇంతకుముందు కొన్ని పరుగు పందాలు చూసి వుంది. అసలు తనే కాలేజ్ తరుపున 400 మీటర్స్ రన్నింగ్ రేస్‌లో పరుగెత్తింది కూడానూ. అయితే ఇంత థ్రిల్లింగ్ ఏ పందెం కూడా కనిపించలేదు. అదీగాకుండా హిప్నాటిజంలో ఇంత గొప్ప గేమ్స్ స్పోర్ట్స్ కూడా ఉంటాయన్న విషయం ఆమెకు తెలీదు.

సింహాద్రి, చిరంజీవి కొద్ది రౌండ్లు బాగానే కొట్టారు. అయితే విశ్వనాథం స్పీడ్ పెరుగుతన్న కొద్దీ వారికి ఆ గది చాలా ఇరుగ్గా కనిపించసాగింది. దానికితోడు మధ్యలో హర్డిల్స్‌లాగా మంచం ఒకటీ, చిరంజీవి పక్కచుట్ట ఒకటీ, సింహాద్రి సూట్ కేస్ ఒకటీ– వీటన్నిటి మీదనుంచి టైమ్ లిమిట్‌లేకుండా జంప్ చేయడం చాలా రిస్కీగా కనిపించింది.

అయితే పరిస్థితి ఇంతదూరం వచ్చాక చేయగలిగిందేమీ కనిపించలేదు. శ్రీదేవి తప్పట్లు కొడుతూ ఆనందంతో కేరింతలు కొడుతూ విశ్వనాథం చేతలోని దబ్బలం సింహాద్రి వీపుకి ఎంత దూరంలో వున్నది రన్నింగ్ కామెంటరీ ఇస్తోంది.

"రెండడుగులు... అమ్మో ఒక్క అడుగు. ధనుంజయ్ గారూ పరుగెత్తండి! పరుగెత్తండి– పెద్ద స్టెప్స్ వేయండి. ఓకే.. ఇప్పుడు దబ్బలం మూడడుగుల దూరంలో వుంది...'

ఇలా ఈ పరుగు పందెం కామెంటరీ ఎంతసేపు నడిచేదోగానీ ఈలోగా తలుపులు దభీమని తోసుకుని సింహాద్రి పేట్రనైజ్ చేసిన వీధికుక్క మళ్ళీ ఆ రోజు తాలూకు బిస్కెట్ల కోటాకోసం గదిలో జొరబడింది. అదింతకుముందు ఆకలి ఆపుకోలేక చాలా ఇళ్ళల్లో

దొంగతనంగా జొరబడడం, వంటిళ్ళల్లో కెళ్ళి కనబడ్డదల్లా తినేయడం చేసింది. అయితే ఏ ఇంట్లో జొరపడ్డా ఆ ఇంటి తాలూకు వాళ్ళు పెరట్లో ఎవరితోనో మాట్లాడుతూ ఉండ డంగానీ, లేదా అందరూ కలిసి హాల్లో సినిమాల గురించి చర్చించుకోడంగానీ, లేదా ఇంకేదయినా వ్యవహారం మాట్లాడుకోడం గానీ చూసేది. కానీ ఎవ్వరూ ఇలా తలుపులు దగ్గర కేసుకుని ఇంట్లో రన్నింగ్ రేస్‌లు ప్రాక్టీస్ చేస్తూ కనిపించలేదు. స్వతహాగా దానికి ఆటలంటే ఎంతో యిష్టం! చిన్నప్పుడు ఏరోజూ కూడా గంటకు యాభయ్ కిలోమీటర్ల స్పీడుకి తక్కువ పరుగెత్తేదికాదు. ఎవరయినా కర్రలతోగానీ యింకే రకంగా గాని వెంబడిపడితే స్పీడ్ మరింత ఎక్కువుండేది. రాన్రాను యిప్పుడు అంతగా పరుగెత్తే అవసరమే కనిపించడంలేదు. ఏదయినా దొంగపని చేసినప్పుడు పట్టుబడినా ఎవరూ తన వెంటపడడం లేదు. తను ఆ యింటి కాంపౌండ్ దాటగానే ఊరుకుంటున్నారు. ఒకరిద్దరు ఛేజింగ్ మీద ఆసక్తి వున్నవాళ్లు వెంబడించినా తను వెనక్కు తిరిగి 'గుర్' మంటూ పళ్ళు బయటిపెట్టేసరికి వెనక్కు తిరిగి అదే వేగంతో పారిపోతున్నారు. ఇంతకాలానికి యిప్పుడు ఆ రూమ్‌లో సాగుతోన్న రన్నింగ్ రేస్ దానికి దాని చిన్నతనపు రోజుల్ని గుర్తుకు తెచ్చింది. తనూ ఆ రేస్‌లో జాయినయి, ఆ ఆనందాన్ని పంచుకోవాలనిపించి విశ్వనాథం వెనుకే అదే స్పీడ్‌లో పరుగెత్తటం ప్రారంభించింది. అయితే అలా ఒకరి వెనుక ఒకరు పరుగెతత్తటం లో దానికి థ్రిల్ కనిపించలేదు. అదీ గాకుండా రాన్రాను విశ్వనాథం స్పీడ్ గంటకు పదికిలోమీటర్లకు పడిపోయింది. అంత తక్కువ స్పీడ్‌లో పరుగెత్తటం తనకు చిన్నతనంగా భావించి అది అందరినీ ఓవర్‌టేక్ చేస్తూ రన్నింగ్ ప్రారంభించింది. వాళ్ళందరూ కలసి ఒక రౌండ్ కొట్టేసరికి అది నాలుగు రౌండ్లు పూర్తి చేయగలుగుతోంది. విశ్వనాథం మొదటిసారి ఆ కుక్క తనను ఓవర్ టేక్ చేయడం చూశాడుగానీ అది కేవలం తన భ్రమ అని మనస్ఫూర్తిగా నమ్మాడు. కానీ రెండోసారి ఓవర్‌టేక్ చేసినప్పుడు మాత్రం అనుమానం కలిగింది. అనుమానం నిర్ధారణ అయేసిరికి అది మరో పది రౌండ్లు కొట్టేసింది. దాంతో విశ్వనాథం పై ప్రాణం పైనే ఎగిరిపోయింది.

అది కిందటిసారి తనను కరచిన కుక్కే! ఏమాత్రం సందేహంలేదు. తను అన్ని కుక్కలనూ గుర్తుపెట్టుకోలేక పోవచ్చుగానీ, తనను కరచిన వాటిని మాత్రం మహా జాగ్రత్తగా గుర్తుపెట్టుకోగలడు! వాటిని ఎన్ని సంవత్సరాల తర్వాత చూసినా ఎన్ని వేల కుక్కల్లో వున్నా ఠకీమని గుర్తుపట్టేస్తాడు.

దానిని గుర్తించగానే అతనికి అంతకుముందు తనను అదే రూమ్‌లో కరచిన క్రూర జంతువు అన్న సంగతీ, ఆ కుక్క కాటు తాలూకు పధ్నాలుగు ఇంజెక్షన్లు ఇంకా పూర్తి కాలేదన్న విషయమూ కూడా గుర్తుకొచ్చాయ్. ఇప్పుడు తను అర్జంటుగా ఆ కుక్క బారినుండి

తనను తను రక్షించుకోకపోతే మరో పధ్నాలుగు ఇంజెక్షన్లు ప్రారంభిచాల్సి రావచ్చు. అప్పటికప్పుడే బయటకు ఎలా పారిపోవాలా అని ఆలోచన ప్రారంభించాడతను. హఠాత్తుగా తలుపులో నుంచి బయటకు పారిపోతే దానికి కోపం వచ్చి వెంబడిపడి కరచే ప్రమాదం ఉంది.

అందుకని స్లో అయిపోయి, ఏదో పనిమీద గది బయట కెళ్ళున్నట్లు నడిచి వెళ్ళిపోవాలి.

కుక్కల సంగతి తనకు బాగా తెలుసు.

పరుగెడితే కోపం ఎక్కువ వాటికి!

పరిగెడుతూనే "దొంగ వెధవల్లారా! ఆ కుక్క మీది కాదన్నారు కదూ?" అన్నాడు విశ్వనాథం ఒగరుస్తూ.

"మాది కాదు" అన్నాడు సింహాద్రి కూడా ఒగరుస్తూనే.

"మరిప్పుడెందుకొచ్చింది మళ్ళీ అది?"

"అది దాని రొటీన్ ప్రోగ్రాం- అంతే"

"అవును అందరిళ్ళకూ వెళ్ళి పలుకరింపుగా కనబడి పోతూంటుంది"

"అబద్ధం" అరచాడు విశ్వనాథం ఆగకుండానే.

"కాదు, నిజం" అన్నాడు సింహాద్రి.

"నేను నమ్మను"

"ఏం ఫరవాలేదు"

"నన్ను మళ్ళీ కరిపించాలనే దాన్ని పిలిచారిప్పుడు" అన్నాడు విశ్వనాథం కొంచెం స్లోగా పరిగెడుతూ.

"నెవర్" అన్నాడు చిరంజీవి. "అలాంటి ఆలోచనే లేదు! పైపెచ్చు అది మాదికాదు"

"మీది కాపోతే ఎందుకొచ్చింది ఇప్పుడు?"

"చెప్పాం కదా! దాని హాబీ- అంతే!"

"అయితే ముందు దాన్ని బయటకు గెంటండి"

"ఎందుకు?"

"లేపోతే మళ్ళీ కరుస్తుంది నన్ను"

"ఏమాత్రం కరవదు"

"నీకెలా తెలుసు?"

"కుక్కలూ- వాటి మనస్తత్వాలూ పుస్తకంలో చదివాను"

"ఏమని?"

"ఎవరయినా సరే వాటిని ఏదోరకంగా ఇన్సల్ట్ చేస్తేనే తప్ప అవి కరవవు అని"

"మరి మొన్న నేనేం ఇన్సల్ట్ చేశానని నన్ను కరిచింది?" ఇంకొంచెం నెమ్మదిగా పరిగెడుతూ అడిగాడతను.

"అదే మనకు తెలీదన్నమాట! అది కనుక్కోవాలంటే కుక్కలూ- ఆసంకల్పిత ప్రతీకారచర్యలు' అని ఇంకో పుస్తకం వుంది అది చదవాలి"

"ఆ పుస్తకాలన్నీ హంబక్" అన్నాడు విశ్వనాథం.

"అందుకే మిమ్మల్ని కరిచిందది" అన్నాడు చిరంజీవి.

"ఇప్పుడు దాన్ని ఎవరయినా పట్టుకుంటే నేను బయటకు పరుగెడతాను" రాజీకొస్తూ అన్నాడతను.

"దానిని పట్టుకోవడం ఎందుకు?" అడిగాడు సింహాద్రి ఆశగా.

"లేకపోతే తప్పకుండా కరుస్తుంది నన్ను! ఇప్పటికింకా కిందటిసారి కరచిన కాటు తాలూకూ పధ్నాలుగు ఇంజెక్షన్లు పూర్తికానేలేదు"

"పధ్నాలుగు అనసవసరం. ఎనిమిది చాలు."

"డాక్టరు పధ్నాలుగు చేయించుకోమన్నాడుగా?"

"అది పిచ్చికుక్కలకయితే"

"మరి ఇది మంచి కుక్క అన్న గారండీ ఏమిటి?"

"దాని చూపులు - అది మనవంక చూస్తున్నప్పుడు.."

చిరంజీవి ఇంకేం చెప్పేవాడోగాని సింహాద్రి ఆ కుక్కను ఆపి దాని మెడపట్టుకోవడం- అదే అదనుకుని విశ్వనాథం గదిలో నుంచి బులెట్‌లాగా బయటకు దూసుకుపోవడం క్షణంలో జరిగిపోయింది.

"అబ్బ! ఇంకా ఇదంతా కలలాగానే వుంది" అంది శ్రీదేవి ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ.

"హిప్నాటిజం అంటే ఇంతేనండీ! కలలాగానే ఉంటుంది" అన్నాడు సింహాద్రి.

"అతను ఆ దబ్బలంతో మిమ్మల్ని పొడిచేస్తాడని భలే భయం వేసింది నాకు" అందామె.

"ఏడ్చాడు. అందుకే గదా సింహాద్రి ఆ కుక్కను హిప్నటైజ్ చేసి లోపలకు పిలిపించాడు" అన్నాడు చిరంజీవి.

"ఏమిటి? ఈ కుక్కను హిప్నటైజ్ చేశారా?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"అవును! తప్పలేదు మరి" అన్నాడు సింహాద్రి.

"అంటే జంతువుల్ని కూడా హిప్నటైజ్ చేయవచ్చా?" అడిగిందామె.

"ఓ! ప్రాణం వున్న వాటన్నిటినీ చేయవచ్చు! ఆఖరికి చెట్లను కూడా చేయవచ్చు.

అయితే ఆ కోర్స్ నేనింకా కంప్లీట్ చేయలేదు."
"ఒండర్‌ఫుల్" అందామె.
"అఫ్‌కోర్స్"
తేలిగ్గా అన్నాడు సింహాద్రి.
శ్రీదేవి టైమ్ చూసుకుంది.
"థాంక్యూ ధనుంజయ్‌గారూ! మిమ్మల్ని కలుసుకున్నందుకు చాలా సంతోషంగా వుంది. మరి నే వెళ్తానికి- మా డాడీ హెూటల్లో ఎదురుచూస్తుంటారు" అంది లేచి నిలబడుతూ.
సింహాద్రి మొఖంలో జీవకళ నశించిపోయింది.
"ఆ.. వెళ్ళిపోతారా! మీతో బోలెడు విషయాలు మాట్లాడాలనుకున్నానండీ" దిగులుగా అన్నాడతను.
"మరోసారి మాట్లాడుకోవచ్చులెండి! ఆ.. చెప్పడం మర్చిపోయాదు. వచ్చే అదివారం నా బర్త్‌డే! మీరిద్దరూ తప్ప కుండా విశాఖపట్నం రావాలి" అందామె ఉత్సాహంగా.
"విశాఖపట్నమా?"
"అవునండీ! కష్టమేముందీ? రాత్రి రైలెక్కితే పొద్దున్నకల్లా దిగుతారు. అక్కడ రెండు రోజులు మా ఇంట్లోనే గెస్ట్స్‌గా వుండాలి. ఓకే?"
"ఓకే" అన్నాడు సింహాద్రి ఆనందంగా.
"రేపే మీకు ఇన్విటేషన్ పోస్ట్ చేస్తాను. ఒకవేళ అది అందకపోయినా ఇదే ఇన్విటేషన్ అనుకుని వచ్చేయండి"
"ఓ... తప్పకుండా వస్తామండీ"
"మర్చిపోరు కదూ?"
"మీరు మర్చిపోకుండా వుండాలి. మాదేముంది. ఇహిహి" అన్నాడు సింహాద్రి.
"మరి మా అడ్రస్ తెలుసామీకు?"
"తెలుసండీ! బాంబ్ నిలయం, రెడ్ బాంబ్, విశాఖ పట్నం, కరెక్ట్ కదండీ?"
"రెడ్ బాంబ్ కాదు, రెడ్ ఫీల్డ్"
"అవునూ బాంబు మీ ఇంట్లో వుందా అండీ? చుట్టుపక్కలుందా?"
"బాంబేమిటి?"
"అదేనండీ- బాంబ్‌నిలయం అంటే అర్థం బాంబులుండే ప్రదేశం అని కదా"
"అదా" అమె నవ్వేసింది. బాంబులు మా ఇంట్లోనూ లేవు. ఇంటి బయటా లేవు"
"మరా పేరెందుకు పెట్టినట్లు?"

"మా డాడీ ఆర్మీలో కర్నల్. సర్వీస్‌లో వుండగా ఆయన ఎన్నో బాంబులు పేల్చారు. ఎంతోమంది ఎనిమీస్‌ని బాంబులతో ఆనవాల్లేకుండా ఎగరగొట్టేశారు. అందుకని బాంబులమీద ఇష్టం కొద్దీ బాంబ్ నిలయం అని పేరుపెట్టారు"
సింహాద్రికి భయమేసింది.
"ఇప్పుడు కూడా ఎవర్నయినా బాంబులతో పేలుస్తున్నారాండి?" దౌటుగా అడిగాడు.
"అబ్బే. ఇప్పుడసలు బాంబులు వాడడం లేదు. రివ్వాల్వరూ, పిస్టలూ, గన్స్- ఇవన్నీ ఉన్నాయిగా. ఒకరిద్దర్నయితే వాటితో కాల్చటమే ఎకనామికల్ అంటారు డాడీ. కనీసం పాతిక, యాభై మందయినా లేకపోతే బాంబులు వాడడం చాలా ఖర్చుతో కూడిన పనట"
"అలాగాండీ..." దిగులుగా అన్నాడతను.
"మీరు విశాఖపట్నంలో దిగి బాంబ్ నిలయం అంటే ఎవర్నడిగినా చెప్తారు. అంత ఫేమస్ మా డాడీ. ఇల్లు కనుక్కోవడం డెడ్ ఈజీ"
"వస్తానండీ"
ఆమె వెళ్ళిపోయింది.
"హమ్మయ్య! అంతా అనుకున్నట్లుగానే సుఖంగా గడిచిపోయింది" అన్నాడు చిరంజీవి పరిస్థితిని సమీక్షిస్తూ.
"ఒకటి తప్ప" అన్నాడు సింహాద్రి దిగులుగా.
"ఏమిటది?"
"మావయ్య ఎపిసోడ్"
"ఓస్.. అదా? అలాంటివి చాలా మైనర్ విషయాలు మనం చేసిన గొప్ప కార్యక్రమాల్తో పోలుస్తే"
"దానివల్ల ఏ గొడవా రాదంటావ్!"
"ఒక్క అంగుళం కూడా రాదు"
"మావయ్య నా ఆస్తిని ఏ అనాథ శరణాలయానికో ఇచ్చెయదంటావ్?"
"వాళ్ళ మావయ్య వల్ల కూడా కాదు"
సింహాద్రికి సంతృప్తి కలిగింది. అయినా మరో ప్రశ్న వేయాలనిపించింది.
"నువ్వు ఆ లాయరు ఇంటిపక్కన ఎన్ని రోజులన్నావ్?"
"నూట ఆర్రోజులు. రాత్రింబగళ్ళు వున్నాను"
"అయితే ఇప్పుడు మన ప్రోగ్రాం ఏమిటి?"
"ఏముంది. ఆదివారం పొద్దునకల్లా మనం విశాఖటప్నం బాంబ్ నిలయంలో ఉ ంటాం! శ్రీదేవి బర్త్‌డే పార్టీలో పాల్గొంటాం. మాంఛి ఏకాంత సమయం చూసుకొని

నువ్వు శ్రీదేవితో నా ప్రేమను వెల్లడిస్తావ్. ఆమె ఓకే అంటుంది?"

సింహాద్రి ఆనందంతో పొంగిపోయాడు.

"నిజంగా ఓకే అంటుందంటావా?"

"వట్టి ఆంధ్రప్రదేశ్ పౌరుడిలాగున్నావే" విసుక్కున్నాడు చిరంజీవి.

ఆ వారం రోజులూ సింహాద్రికి నిద్రపట్టలేదు. హైద్రాబాద్‌లోనే వుండిపోయినట్లు శ్రీదేవి తనకోసం ఎదురుచూసి రామేశ్వర్ జఠానీ అనేవాడిని పెళ్ళి చేసుకున్నట్లు కల రావటం వెంటనే కెవ్వున అరచిలేచి కూర్చోవడం మామూలయిపోయింది.

అసలు శ్రీదేవి పెళ్ళి చేసుకున్న రామేశ్వర్ జఠానీ ఎవడో ఎంత ఆలోచించానా అర్థం కావటం లేదు.

"అసలు ఆ పేరు కూడా విన్లేదింతవరకూ. వాడెవడయి ఉంటాడంటావ్?" చిరంజీవినడిగాడతను.

"వాడివల్ల మానవజాతి చాలా నష్టపోయిందని ఎప్పుడో ఎక్కడో చదివివుంటావ్" అన్నాడు చిరంజీవి.

సింహాద్రి తను చదివిన పుస్తకాలనీ తిరగేశాడు– అయిదు నిమిషాల్లో! కాని ఆ పేరు ఎక్కడా కనిపించలేదు.

* * * * *

ఆదివారం ఉదయానికల్లా శ్రీదేవి బర్త్‌డే కోసమని సింహాద్రి కుట్టించుకున్న ఖరీదయిన సూటుతో వైజాగ్‌లో దిగారిద్దరూ.

టాక్సీవాడు 'బాంబ్ నిలయం' అనగానే మీటర్ మీద పది రూపాయలు ఎక్కువ ఇమ్మన్నాడు.

"అదేమిటి? అంతెందకు?" ఆశ్చర్యంగా అడిగాడు సింహాద్రి.

"బాంబ్ నిలయం కెళ్ళాలంటే రిస్క్ సార్! ఎవరయినా ఇంతే ఛార్జ్ చేస్తారు"

"ఏమిటి రిస్క్?"

"ఫలానా అని చెప్పలేమండీ! కాని రిస్కేనండీ"

సింహాద్రీ, చిరంజీవీ మొఖాలు చూసుకున్నారు.

"ఏమిటి రిస్కంటాడు వాడు?"

"అదే నేనూ తీవ్రంగా ఆలోచిస్తున్నాను" అన్నాడు చిరంజీవి.

"మరిప్పుడేం చేద్దామంటావ్?" అడిగాడు సింహాద్రి వణుకు కనపడనీయకుండా.

"వాడికింకో పది ఇస్తే వాడే చెబుతాడ్లే" అన్నాడు చిరంజీవి. ఇద్దరూ టాక్సీ ఎక్కారు.

కాస్తదూరం వెళ్ళాక చిరంజీవిని సంగతి కనుక్కోమని మోచేత్తో పొడిచాడు సింహాద్రి.

"ఆ! చూడవోయ్ డ్రైవరూ... ఇదిగో సిగరెట్ కాలుస్తావా?"

"ఏం సిగిరెట్టండీ అది? ఇండియాదేనా?"

"అవును– కాస్ట్లీ సిగరెట్టేలే"

"నేను ఫారిన్ సిగరెట్లే కాలుస్తానండీ! ఇండియావి క్లీనర్ కుర్రాళ్ళు కాలుస్తారు"

"ఓ–ఐసీ" అన్నాడు చిరంజీవి.

"గుడ్... వెరీగుడ్..." అని కూడా అన్నాడు.

"పోనీ ఇవి మీ క్లీనర్ కుర్రాళ్ళకిస్తావా?"

"అక్కడ పడెయ్యండి– ఇస్తాను" అంటూ ఫారిన్ సిగరెట్ వెలిగించాడతను.

ఇక సిగరెట్లతో మంచి చేసుకోవడం సాధ్యం కాదని సంభాషణ మళ్ళీ డబ్బు మీదకు మళ్ళించాడతను.

"వెధవ పెట్రోలు ధరలు తెగ పెరిగిపోతున్నాయ్! పాపం మీకు చాలా ఖర్చవుతుందనుకుంటాను"

డ్రైవర్ మొఖం వెలిగిపోయింది.

"అవున్సార్! అందుకే మీటర్ మీద పది ఎక్కువడుగుతాం. ఆ మాత్రానికే కొంపలు మునిగిపోయినట్లు గొడవచేస్తారు జనం" కోపంగా అన్నాడతను.

"మేము అలాంటివాళ్ళం కాదు! అందుకే నీకు పది ఎక్కువివ్వడానికి వప్పుకున్నాం" అన్నాడు చిరంజీవి.

"ఈ పది అందుక్కాదండీ నేనడిగింది?"

"మరి?"

"ఇది రిస్క్ కోసమని అడిగాను"

"ఏమి రిస్క్?"

"బాంబ్ నిలయానికెళ్ళే టాక్సీలు, ఆటోలవాళ్ళందరూ– ఇలా రిస్క్ అలవెన్స్ అడగాలని మేమంతా నిర్ణయించుకున్నామండీ!"

"ఏమిటక్కడ రిస్క్?"

"ఒకటని కాద్సార్ చాలా పేచీలున్నాయ్"

"సరే– నీకు రిస్క్ అలివెన్స్ పది రూపాయలు కాక పెట్రోల్‌కి మరో పది ఇస్తాంలే. సంగతేమిటో చెప్పు" అన్నాడు సింహాద్రి ఆత్రుతగా.

డ్రైవర్ ఉత్సాహంగా వెనక్కు తిరిగి వాళ్ళిద్దరి మొఖాలవంకే చూశాడు.

"మరేం లేదండీ! అందులో ఆర్మీ ఆఫీసరున్నాడండీ! ఆయన మహా డేంజరస్ మనిషి.

వాళ్ళింటి దగ్గర ఓసారి హారన్ మోగించాడని మా అప్పలస్వామి టాక్సీ ఎయిర్‌గన్‌తో కాల్చేశాడండీ! మరోసారి ఒక ఆటోరిక్షా డ్రైవర్ మీటర్‌మీద రెండ్రూపాయలు ఎక్కువిమ్మని పేచీ పెట్టుకుంటే ఆ డ్రైవర్ కాలిమీద ఎయిర్ గన్‌తో కాల్చాడండీ! మాకు తెలిసినంతవరకూ ఇప్పటికి ఆయన దగ్గర ఎనిమిది రకాల కాల్పుల ఆయుధాలున్నాయండీ! మరి అసలెన్ని రకాలున్నాయో ఎవరికీ తెలీదు"

కథ పూర్తయేసరికి సింహాద్రికి చెమటలు పట్టేసినయ్.

టాక్సీ బాంబ్ నిలయానికి రెండొందల గజాల దూరంలో ఆపేశాడు డ్రైవర్.

"ఇక్కడి నుంచి నడిచివెళ్ళండి సార్! ఇంకా దగ్గరకు పోనీయడం కుదరదు"

"అదేమిటి? రిస్క్ ఎలవెన్స్ ఇచ్చాం కదా?"

"అది ఈ వీధిలోకి రావడానికి సార్"

"మరి ఇంటిదగ్గరికెళ్ళడానికి?"

"దానికి టైర్ ఖర్చులు ఇప్పించాలి సార్"

"సింహాద్రి, చిరంజీవి టాక్సీ దిగి కాలి నడకనే ఇంటివేపు బయల్దేరారు.

"విష్ యూ సేఫ్ రిటర్న్ సార్" జాలిగా అన్నాడు టాక్సీ డ్రైవర్.

బాంబ్ నిలయం నిజంగా బాంబ్ షేప్‌లోనే ఉన్నట్లు కనిపించసాగింది సింహాద్రికి.

"అదేమిట్రా! తలుపులు మూసి ఉన్నాయేమిటి?"

"గొప్పోళ్ళ ఇళ్ళెప్పుడూ అంతేరా! మూసే ఉంటయ్"

"మరి తలుపు కొడదామా?"

"ఛట్! తలుపులు కొట్టకూడదురా పక్షీ! ఎక్కడో కాలింగ్ బెల్ ఉంటుంది. నొక్కాలి. తలుపు కొట్టావంటే మనం జనతా క్లాస్ పక్షులమని తెలిసిపోతుంది"

"మరి కాలింగ్ బెల్ ఎక్కడున్నట్లు?"

"అది కనుక్కోవడమే కొంచెం కష్టం! ఎక్కడో గోడ కలర్‌లోనే మాచింగ్ అయిపోయి దాక్కుమంటుంది"

సింహాద్రి గోడంతా చేత్తో తడమసాగాడు.

అలా గోడ చివరి కెళ్ళాక పక్కకు ఓ పెద్ద గార్డెన్ కనిపించిందతనికి. అటువేపున్న గోడకి మాంచి మీట ఆకుపచ్చ రంగులో కనబడుతోంది.

"అదిగోరా! అక్కడుంది" అన్నాడు సింహాద్రి.

"నేను చెప్పలే! ఎక్కడోచోట ఉంటుంది మొత్తానికి" అన్నాడు చిరంజీవి విజయగర్వంతో.

"కానీ తలుపక్కనే ఉంచకుండా ఈ పక్కన గార్డెన్ దగ్గర ఉంచారేమిటి?"

అనుమానంగా అడిగాడు సింహాద్రి.

"ఈ ఆర్మీవాళ్ళంతేరా బాబూ! శత్రువులకు దొరగ్గూడదని ఇలాంటి పనులు చాలా చేస్తుంటారు"

సింహాద్రి ఆ బటన్ గట్టిగా నొక్కాడు.

మరుక్షణం ఆ పక్కనే ఉన్న పేద్ద జయంట్ సైజ్ పంజరం తలుపు సర్రున పక్కకు తొలగిపోవడం, అందులోని రకరకాల చిలకలు, పక్షులు ఝూమ్మని కేరింతలు కొడుతూ ఎగిరిపోవడం... ఒక పావుక్షణంలో జరిగిపోయింది.

సింహాద్రి కంగారుపడిపోయాడు.

"కొంప మునిగింది" అన్నాడు అదిరిపోతూ.

"అవును" ఒప్పుకున్నాడు చిరంజీవి.

"అంటే ఇది డోర్ బెల్ కాదన్నమాట"

"కాదనే తెలుస్తోంది"

"ఇకవేళ ఆ చిలుకల పంజరం తలుపుకి సంబంధించిన మీటేమో"

"పాజిబుల్!"

"ఇప్పుడేమిటి చెయ్యడం మరి"

చిరంజీవి ఆ బటన్ మళ్ళీ నొక్కాడు. పంజర్ డోర్ ఠక్కున మూసుకుపోయింది.

"సందేహం లేదు. ఇది పంజరానికి సంబంధించినదే"

'అయితే మనంఇక్కడ నిలబడడం క్షేమం కాదనుకుంటాను"

"పద. తలాకిటి డోర్ దగ్గరకెళ్ళి తలుపు కొడదాం"

ఇద్దరూ కొంచెం స్పీడుగానే తలాకిటి తలుపు దగ్గరకు చేరుకున్నారు.

తలుపు కొట్టబోతూంటే ఠక్కున తలుపులు వాటంతట అవే తెరచుకున్నాయ్.

"హలో" అంది శ్రీదేవి చిరునవ్వుతో ఎదురుగ్గా నిలబడి.

"హలో హలో–" అన్నాడు సింహాద్రి.

"హలో" అన్నాడు చిరంజీవి.

"మీరా!" అందామె.

"అవునండీ.. మేమే!"

"నేనింకా మీరనుకోవడం లేదు. బెల్ ఆగకుండా మోగుతుంటే మా కుక్క అనుకున్నాను"

"కుక్కా?"

"అవును! మా అల్సేషన్ అలాగే డోర్‌బెల్ ఆగకుండా నొక్కుతుంది!"

"కానీ మేము అసలు బెల్ నొక్కనే లేదుగా?"

"నొక్కలేదా? అదేమిటి మీరు ఇంకా దానిమీదే నుంచుని ఉన్నారు"

సింహాద్రి, చిరంజీవి అదిరిపడి పక్కకు గెంతారు.

సింహాద్రి కాలుకిందే నేలమట్టానికి చిన్నమీట కనిపించింది.

"నిజమే మీరన్నది! మేమింకా మీటకోసం వెతుకుతున్నాం"

"వెతకటం ఎందుకు– క్లియర్‌గా కనబడుతోంటే"

"అఫ్‌కోర్స్ అఫ్‌కోర్స్" అన్నాడు చిరంజీవి.

"లోపలకు రండి! మీరు తప్పకుండా వస్తారనే ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాను"

"అలాగాండీ!"

ఇద్దరూ లోపలకు నడిచి సోఫాలో కూర్చున్నారు.

శ్రీదేవి వాళ్ళకెదురుగ్గా మరో సోఫాలో కూర్చుంది. ఆమె చేతితో ఏదో నవల ఉంది.

"చాలా థాంక్సండీ" అందామె.

"ఎందుకండీ?" అడిగాడు సింహాద్రి.

"ఇంత శ్రమ తీసుకుని వచ్చినందుకు"

"ఓ... అదా! ఏం ఫర్లేదండి! మీ కోసం శ్రమ తీసుకోవడంలో అందరం, ఆనందం వగైరాలున్నాయి...."

ఆమె నవ్వింది.

సింహాద్రి కూడా నవ్వాడు.

చిరంజీవి కూడా నవ్వాడు.

"అన్నట్లు నేను పంపిన యిన్విటేషన్ అందిందా?" అడిగిందామె.

"ఇన్విటేషనా?"

"అవును. నాలుగు రోజులయింది పోస్ట్‌చేసి"

"అరె! అందలేదే!"

"అందలేదా?"

"లేదు"

"పోస్టల్ వాళ్ళు కొట్టేసి వుంటారు"

"అదేమిటి? వాళ్ళెందుకు కొట్టేస్తారు?"

"అలవాటు"

"అలవాటా?"

"అవును. సాధారణంగా పోస్ట్‌లో వచ్చే మాగజైన్లు కొట్టేయడం అలవాటేగా వాళ్ళకు"

"మాగజైన్లు కొట్టేస్తారా?"

"అవును. మీకు తెలీదా ఆ విషయం?"

"తెలీదు. అసలు నేను మాగజైన్స్ చదవనుగా!"

"అదీ సంగతి! అందుకే తెలీదు"

"కానీ మాగజైన్లు కొట్టేయడం అలవాటున్నవాళ్ళు ఇన్విటేషన్ కార్డ్ ఎందుకు కొట్టేస్తారు?" అడిగాడు సింహాద్రి.

"వెరయిటీ కోసం" నవ్వుతూ అందామె.

"తమాషాగా వుందే"

"తమాషా ఏమీ లేదు. ఇన్విటేషన్ కొత్తపద్ధతిలో వేయించారు డాడీ. దానికి మధ్యలో ఎనిమిది పేజీలుంటాయ్"

"ఓహో... ఒండర్‌ఫుల్"

"అందుకే అది కూడా ఓ కొత్త మాగజైన్ అనుకుని కొట్టేసి వుంటారు"

"పాజిబుల్" అన్నాడు సింహాద్రి.

"ఇల్లు తేలిగ్గా కనుక్కున్నారా?" అడిగిందామె.

"ఓ! వెరీ ఈజీ! ఎవర్నడిగినా చెప్పేస్తున్నారు"

"అవును! డాడీ చాలా ఫేమస్ ఈ సిటీలో"

"అవును! టూమచ్ ఫేమస్!"

"డాడీ ఇంట్లో లేరు. లేపోతే యిప్పుడే పరిచయం చేసేదాన్ని"

"ఇంట్లో లేరా?" తేలిగ్గా గాలి పీల్చుకుంటూ అన్నాడు సింహాద్రి.

"లేరు"

"ఎక్కడికెళ్ళారు? ఊరు వెళ్ళారా?" ఆశగా అడిగాడు.

"అబ్బే ఊరికి కాదు! వేట కెళ్ళారు!"

"వేట ఏమిటి?"

ఆమె ఆశ్చర్యపోయింది.

"ఏమిటి? మీకు వేటంటే తెలీదా?"

"తెలీదు"

"తెలీపోవడమేమిటి భలేవారే! జంతువుల్ని వేటాడడానికి అడవి కెళ్ళరూ?"

"ఓ.. అదా! ఆ వేట తెలుసు" తల ఊపాడతను.

"కానీ సాధారణంగా మహారాజులే కదా వేటకెళ్ళేది. జానపద కథల్లో చదివాను వేట గురించి!"

"యిప్పుడు అందరూ వేట కెళ్తారులెండి" అందామె చిరాకుగా.

"యింతకూ మీ డాడీ వేటకెందుకెళ్ళారండీ" అడిగాడు చిరంజీవి.

"ఇవాళ నా పుట్టిన్రోజుకదా! అందుకని నాకిష్టమయిన జింకను షూట్ చేసుకొస్తానని అడవి కెళ్ళారు"

"అయితే మీకు జింక చాలా ఇష్టమాండీ"

"బోలెడిష్టం"

"అంటే ఆయన అప్పుడప్పుడూ ఇలా అడవి కెళ్ళి వేటాడుతూంటారాండీ?" అనుమానంగా అడిగాడు సింహాద్రి.

"అప్పుడప్పుడు ఏమిటి? చాలా ఎక్కువగానే వెళ్తూంటారు. వళ్ళు మండిందంటే రోజూ వేటాడతారు కూడా?"

చిరంజీవి ఉలిక్కిపడ్డాడు.

"రోజూనా?"

"అవునూ! ఏం?"

"మరేం లేదండీ! ఊరికే అడిగాను" అన్నాడతను గోడకు తగిలించివున్న రకరకాల ఆయుధాలు చూస్తూ.

"అవన్నీ డాడీవి" అందామె ఉత్సాహంగా.

"అలాగా" ఎంత ఆపడానికి ప్రయత్నించినా అతని గొంతులో కొంచెం వణుకు కనిపించింది.

"అవును! డాడీకి 'గన్స్' అంటే ఎంతో ఇష్టం. ఏ కొత్త మోడల్ వచ్చినా కూడా కొనేస్తూంటారు"

"కానీ ఎందుకండీ అలా కొనడం అనవసరంగా"

"అది డాడీ హాబీ"

"ఓ... అలాగా. హాబీ అన్నమాట. అంటే ఫోటోగ్రఫీ సంగీతం, స్టాంపులు సేకరించడం అలాంటి హాబీ కదండీ!"

"ఎగ్జాక్ట్లీ! అంతేగాదు. అవన్నీ వారానికోసారి ప్రయోగిస్తేగాని డాడీకి మనశ్శాంతిగా వుండదు"

"వారానికో రోజాండీ"

"అవును"

"అంటే రోజూ వేట- వారానికోరోజు గన్స్‌తో షూటింగ్! అంతేనాండీ?"

"మరీ రోజూ కాదనుకోండి. ఓ రోజు అటూ ఇటూగా. కానీ వేటలో ఏ జంతువూ

దొరక్కపోతే మాత్రం భలే కోపంగా వుంటుందాయనకు. ఆ రోజంతా మనం దూరంగా వుండకపోతే మననే కాల్చిపారేస్తారు"

"ఆ. మననా?"

"మననంటే- మరీ మనను కాదనుకోండి! ఇంకెవరి నయినా! ఆ... మీరు కూర్చుని ఈ మాగజైన్స్ చూస్తూండండి. మేడమీద రూమ్ రడీ చేయించేస్తాను. వంటవాడు మీకు కాఫీ తెచ్చిస్తాడు..."

"ఇప్పుడు కాఫీ అదీ- మీకు శ్రమ కదూ?"

"శ్రమ నాదెలా అవుతుందండీ! వంటవాడిది. నేనీలోగా ఈ నవల చదివేస్తాను. ఇంక వందపేజీలే వుంది"

"ఎవరిదండీ ఆ నవల? నాదేనా?"

"అబ్బే మీది కాదండీ! ఇంకో రైటర్. ఇతను కూడా హిప్నాటిజం మీద భలే రాశాడు. వస్తానండి. మాంచి సస్పెన్స్‌లో ఉన్నాను" అంటూ లోపలకు పరుగెత్తిందామె.

"ఇల్లు బ్రహ్మాండగా వుంది కదురా?" అడిగాడు చిరంజీవి హాలంతా కలయజూస్తూ

"ఆ గోడకున్న ఆయుధాలు తప్పితే మిగతాదంతా బాగానేవుంది" వప్పుకున్నాడు సింహాద్రి.

"ఫర్నిచర్ కూడా ఒండర్‌ఫుల్‌గా వుంది"

"వీళ్ళడాడీతో మనకేమీ ప్రమాదం వుండదుకదా?" అనుమానంగా అన్నాడు సింహాద్రి.

"ఛట్. మనకేం భయంరా! నువ్వు గ్రేట్ రచయిత ధనుంజయ్‌వని తెలిసిందంటే ఆయనే నీ కాళ్ళమీద పడిపోతాడు"

"కాళ్ళమీదెందుకు పడడం?"

"అదంతేరా! ఈ మిలటరీవాళ్లకి లిటరేచరంటే అంత ప్రాణం. సర్వీసంతా ఈ సాహిత్యం వగైరాలకు దూరంగా ఎక్కడో బోర్డర్స్‌లో వుంటారు కదా! అందుకని ప్రేమ మరీ ఎక్కువన్నమాట! మన శ్యాంప్రసాద్‌గాడి చిన్నానన్న అంతే గదా! రిటైరయ్యాక తన అభిమాన రచయితను కలుసుకుని పిస్టల్‌తో కాల్చిపారేశాడు"

సింహాద్రి ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"కాల్చిపారేశాడా?"

"అవును! కానీ ఆ రచయిత ప్రాణం పోలేదు లే! వారం రోజుల్లో తనే బోలెడు డబ్బు ఖర్చుచేసి ఆ గాయం మానిపించేశాడు"

అయినా అతనికి సంతృప్తి కలగలేదు.

"అసలు కాల్చటం ఎందుకు?"

"చెప్పాను కదురా! అభిమానం మరీ ఎక్కువయితే వాళ్ళంతే. అలా అనిపిస్తుందట– తరువాత చెప్పాడాయన"

సరిగ్గా అప్పుడే బయట సైరన్ కూసినట్లు జీప్ హారన్ మోగింది. ఆ శబ్దం వినడంతోనే సింహాద్రికి వణుకు ప్రారంభమయిపోయింది.

"శ్రీదేవి... శ్రీదేవి వ్రాళ్ళ డ్రాడ్రీ వ్రచ్చిన్రట్లు వ్రాడు" అన్నాడు వణుకు కనిపించకుండా కంట్రోల్ చేస్తూ.

"అరె– వస్తే రానీరా. ఎందుకలా అనవసరంగా వణుకుతున్నావ్?" కోప్పడ్డాడు చిరంజీవి.

"ఏమోరా ఎంత వద్దనుకున్నా తెగ భయంగా వుంది"

"ఏం ఫర్లేదు నేనున్నాను కదా! అంతా నేను చూసుకుంటాను"

* * * * *

మరుక్షణం పెద్దగా బూట్లచప్పుడు– గుండెలమీద కొస్తున్నట్లు లోపలి కొచ్చేసింది.

మరుక్షణంలో అరడుగుల ఎత్తు ఆకారం జంగిల్ డ్రెస్‌లో నుంచి ఇల్లెగిరిపోయేట్లు అరచింది.

"ఒరే రంగా... రంగా"

సింహాద్రీ, చిరంజీవి వణికిపోయారు.

నౌకరు లోపల్నుంచీ పరుగెత్తుకొచ్చాడు.

కర్నల్ తన గన్ అతని కందించాడు.

"క్లీన్ చెయ్యమంటారా సార్?"

"షూట్ చేస్తాను రాస్కెల్! క్లీన్ చెయ్యాలా– ఏమిట్రా? ఇడియట్. నోర్మూసుకుని క్లీన్‌చెయ్"

"అలాగే సార్"

"ఇవాళ బులెట్స్ అన్నీ వేస్టయిపోయాయ్. మోస్ట్ అన్ ఎకనమికల్. ఒక్క జంతువు కూడా దొరకలేదు..."

రంగా గన్ తీసుకుని తోపలి కెళ్ళిపోయాడు.

కర్నల్ మేడమీద కెళ్ళబోతూ ఠక్కున ఓ మూల వ్యావేపు తిరిగాడు కోపంగా.

"న... న... నమస్కారమండీ" అన్నాడు సింహాద్రి.

"నమస్కారమండీ" తనూ అన్నాడు చిరంజీవి.

కర్నల్ అనుమానంగా మరో రెండు అడుగులు వాళ్ళవేపు వేశాడు. రెండ్రోజుల క్రితం పేపర్లో చదివిన వార్తే అతని కళ్ళముందు కదలసాగింది.

"పెద్ద మనుషుల్లాగా– ఫుల్ సూట్లో ఇంట్లో జొరబడి చేతికందిన సామాను తీసుకు పారిపోయిన ఘరానా దొంగల ఉదంతం" అని ఉందా పేపర్లో.

"ఎవరు మీరు?" అనుమానంగా అడిగాడు కర్నల్.

"నేను సింహాద్రినండీ! మై నేమ్ ఈజ్ సింహాద్రి" అన్నాడు తడబడుతూ.

చిరంజీవి ఉలిక్కిపడ్డాడు.

"అబ్బే.. కాదండీ! వీడి పేరు ధనుంజయ్. సింహాద్రి కాదు"

కర్నల్‌కి అనుమానం మరింత పెరిగిపోయింది.

"సింహాద్రి కాదా?"

"కాదండీ! ఏమాత్రం కాదు"

"మరెందుకు చెప్పాడలా?"

"పొరబాటున చెప్పాడండీ! జస్ట్ యాక్సిడెంటల్"

"అవునండీ" తనూ వప్పుకున్నాడు సింహాద్రి.

"ధనుంజయ్ సింహాద్రి పేర్లూ దగ్గరదగ్గరగా ఉంటాయ్ కదండీ– అందుకని సింహాద్రి అన్నాను."

"పొరబాటున పేరు తప్పుచెప్పేవ్వాను నేనెక్కడా చూడలేదు"

"అవునండీ! నేనూ ఎక్కడా చూళ్ళేదు" చెప్పాడు చిరంజీవి.

"దెన్?"

"అంతేనండీ! ది ఎండ్"

"వ్వాట్ ది ఎండ్?"

"ఇదేనండీ! వాడి పేరు సంగతి"

"ఐసీ! చిరంజీవి వంక కోపంగా చూస్తూ అన్నాడతను.

"నా పేరు చిరంజీవండీ! వాడిపేరు సింహా... నోనో... సారీ! వాడి పేరు ధనుంజయ్, నా పేరు చిరంజీవి! అంతేనండీ ఇంకేమీ మార్పులుండవ్"

"నేనడుగుతోంది మీ డెవిలిష్ పేర్లు కాదు!"

"ఓహో! కాదాండీ! అవుననుకుని చెప్పామండీ" అన్నాడు సింహాద్రి.

"అవునండీ! పేర్లే అడిగారనుకుని..." సర్ది చెప్పిదోయాడు చిరంజీవి.

"షటప్" గర్జించాడు కర్నల్.

ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

"ఓకే అండీ! మీరెలా చెప్తే అలా షటప్‌గానే ఉంటామండీ" గాబరాగా అన్నాడు సింహాద్రి.

"మీరెవరూ అని నేనడుగుతున్నాను" మళ్ళీ అన్నాడు కర్నల్.

"మేమాండీ?"

"యస్. అయామ్ టాకింగ్ ఎబౌట్ యూ ఓన్లీ"

"మేము... మేము ఒరిజినల్‌గా కాలేజ్‌మేట్స్ అండీ! అంటే అంతకుముందు కూడా తెలుసన్న మాటండీ! ఇంటర్‌లో క్లాస్‌మేట్స్‌మండీ"

"అవునండీ! ఇద్దరం 'డి' సెక్షన్ వాళ్ళం?"

"డీ సెక్షన్ హాకీకి బాగా ఫేమస్ అండీ"

కర్నల్ మండిపడ్డాడు.

"టు హెల్ విత్ యువర్ ఇంటర్– అండ్ టు హెల్ విత్ యువర్ 'జి' సెక్షన్" అన్నాడు కోపంగా.

"జి' సెక్షన్ కాదండీ! 'డి' సెక్షన్" కరెక్ట్ చేశాడు చిరంజీవి.

"అవునండీ! నాట్ 'జి' సెక్షన్"

"అయ్ సే షటప్"

"ఓకే సార్"

"నేనడిగేది అదిగాదు"

చిరంజీవికి అర్జంటుగా స్పార్క్ వచ్చింది.

"ఓహో– అర్థమయిందండీ!" ఆనందంగా అన్నాడు.

"ఏమిటది?"

"మీరడిగేదేమిటో తెలిసింది– మీరు మా ప్రొఫెషన్ అడుగుతున్నారు. నథింగ్ రాంగ్ ఇనిట్! యు ఆర్ వెల్‌కమ్! ప్రొఫెషన్ తెలుసుకోవాల్సిందే. ఐ కెన్ అండర్‌స్టాండ్ యువర్ ఫీలింగ్స్! వీడేమో బిజిలీ అండ్ బిజిలీ కంపెనీలో ఎకౌంటెంట్ అండీ! నేనేమో రైల్వేలో అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌గా వర్క్ చేస్తున్నానండీ"

సింహాద్రి చప్పున అందుకున్నాడు...

"అయితే మొన్న జరిగిన యాక్సిడెంట్‌కీ, వీడికీ ఎలాంటి సంబంధం లేదండీ! కదురా?"

"అవునండీ! అదింకా తేల్లేదు. ఇంజనీరింగ్ వాళ్ళ ఫాల్ట్ అని కారేజ్ అండ్ వాగన్ డిపార్ట్‌మెంట్ వాళ్ళూ, కాదు కారేజ్ అండ్ వాళ్ళదే అని వాళ్ళు...."

"షటప్"

ఇద్దరూ సైలెన్సయిపోయారు.

"ఇద్దరూ లేవండి ముందు"

ఇద్దరూ లేచి నిలబడిపోయారు.

"ఇలా దగ్గరకు రండి"

"దగ్గరకాండీ' దిగులుగా అడిగాడు సింహాద్రి.

"అవును"

"ఎందుకులెండి! ఇక్కడికి బాగానే వినబడుతున్నాయ్ మీమాటలు"

"ఐసే షటప్! వస్తారా? నన్నే మీ దగ్గరకు రమ్మంటారా?"

ఇద్దరు కర్నల్‌వేపు రెండడుగులు వేశారు.

"నేనడిగేది మీరు ఇక్కడ నా యింట్లో ఏం చేస్తున్నారూ అని?"

"కూర్చున్నామండీ"

"జస్ట్ రిలాక్సింగ్" సర్ది చెప్పాడు సింహాద్రి.

"ఎందుక్కూర్చున్నారు?"

అప్పుడర్థమయింది చిరంజీవికి కర్నల్ ప్రశ్నలోని అర్థం.

"అదా– మేము మీ ఇంటికెందుకొచ్చామనా మీ అభిప్రాయం" అంటూ ఈజీగా కనిపించడానికని గట్టిగా నవ్వాడు చిరంజీవి" సంగతేమిటంటే మేము శ్రీదేవిగారి బర్త్‌డే కోసం వచ్చామండీ"

"బర్త్‌డే కా?" కర్నల్‌కి రాన్రాను వాళ్ళమీద అనుమానం బలపడిపోతోంది.

"ఎగ్జాట్‌లీ"

"ఎవరు పిలిచారు మిమ్మల్ని?"

"శ్రీదేవిగారేనండీ!"

"ఏదీ– శ్రీదేవి పంపిన ఇన్విటేషన్ కార్డ్ చూపించండి"

"అదా! అది పోస్ట్‌లో మిస్సయిపోయిందండీ!"

కర్నల్ నడుముకి వేలాడుతున్న పిస్టల్ మీద చెయ్యి వేశాడు.

"పోస్ట్‌లో మిస్సయిందా! నేన్నమ్మను" అన్నాడు కఠినంగా.

"నమ్మరా?" ఆశ్చర్యంగా అన్నాడు సింహాద్రి.

"ఛస్తే నమ్మను"

సింహాద్రి ఆశ్చర్యంగా చిరంజీవి వేపు చూశాడు.

"ఏమిట్రా! నమ్మనంటున్నారు?"

"పోస్టల్ వాళ్ళు మాగజైన్లు, యితర పుస్తకాలు చాలావరకూ కొట్టేస్తూంటారండీ!"

"అవునండీ, కావాలంటే, ఏ మాసపత్రిక ఎడిటర్నయినా అడగండీ!"

కర్నల్ యింక సహించదల్చుకోలేదు. తను యిప్పటికే చాలా ఎక్కువ మార్జిన్ యిచ్చాడు వీళ్ళకు. ఇంత మార్జిన్ ఈమధ్య కాలంలో ఎవరికీ యివ్వలేదు. రంగాగాడు కాబోలు-పంజరంలో వున్న చిలకల్లో ఒకదానికి జ్వరం వచ్చినప్పుడు బయటకు తీస్తుంటే ఎగిరిపోయిందది. అలాంటి చిలకను వదిలేసినందుకు వాడిని కాల్చి పారేద్దామనుకున్నాడు గానీ, వాడు రెండ్రోజులు టైమడిగి, దానిని మళ్ళీ పట్టి యివ్వడం చేత ఊరుకున్నాడు.

"గెటౌట్" అన్నాడు కర్నల్ బయటకు దారి చూపుతూ.

సింహాద్రీ, చిరంజీవీ ఆశ్చర్యంగా ఒకర్నొకరు చూసుకున్నారు.

"ఎవర్నండీ" అర్థం కాక అడిగాడు సింహాద్రి.

"ఇడియట్! యింకెవర్ని? మిమ్మల్నే!"

"కానీ... మమ్మల్ని బర్త్‌డేకి రమ్మని...."

"షటప్! అరచాడు కర్నల్.

"యిదిగో యిప్పుడు టైమెంతయిందో తెలుసా?"

"తెలీదండీ!"

"పదకొండు గంటల ఎనిమిది నిమిషాలయింది"

"ఫర్లేదండీ! మాకింకెక్కడా వేరే పనిలేదు" చెప్పాడు చిరంజీవి.

కర్నల్ అదేమీ వినిపించుకోలేదు.

"మీకు సరిగ్గా రెండు నిమిషాలు టైమిస్తున్నాను. ఈ రెండు నిమిషాల్లో ఇల్లూ, కాంపౌండూ కూడా దాటి బయట పడకపోతే ఆ తర్వాత ఈపిస్టల్ గుళ్ళకు స్ట్రెచర్ మీద వెళ్ళాల్సి వస్తుంది... ఓకే?"

"ఓకేసార్" అన్నాడు చిరంజీవి అప్పుడే తలుపు వేపు అడుగులు వేయటం ప్రారంభిస్తూ.

"కొయ్‌ట్ సింపుల్" అన్నాడు సింహాద్రి అతన్ని పాలో అవుతూ.

సరిగ్గా అప్పుడే శ్రీదేవి నవల పట్టుకుని పరుగుతో వచ్చిందక్కడికి.

"హల్లో డాడీ!" అంది కర్నల్‌ని చూసి అప్యాయంగా.

"హల్లో బేబీ!" కోపం తగ్గించుకుంటూ జవాబిచ్చాడు కర్నల్.

"డాడీ!"

"యస్ బేబీ!"

"మీకు నా ఫ్రెండ్స్‌ని ఇంట్రడ్యూస్ చేస్తాను. మీట్ మిస్టర్..."

"వాట్? వీళ్ళు నీ ఫ్రెండ్సా?" షాక్ తింటూ అడిగాడు కర్నల్.

"అవును డాడీ"

"మరలా డెకాయిట్స్ లాగున్నారేమిటి?"

చిరంజీవి ఛప్పున అందుకున్నాడు.

"అబ్బే! క్రాఫ్ కొంచెం చెదిరిపోయిందండీ. అందుకని అలా కనబడుతున్నాం"

"అవునండీ! దువ్వెనా, అద్దం ఇస్తే మళ్ళీ మామూలుగా అయిపోతామండీ!" చెప్పాడు సింహాద్రి.

"ఐసే షటప్!" మళ్ళీ భీకరంగా అరచాడు కర్నల్!

శ్రీదేవి పరిస్థితంతా రక్కున అర్థం చేసుకుంది.

తను వెంటనే కలుగ జేసుకోకపోతే పరిస్థితి మరింత క్షీణించే ప్రమాదం వుందని తెలుసుకుని రక్కున అడ్డుపడి పోయింది.

"డాడీ!"

"యస్ బేబీ!"

"వేటలో ఏదీ దొరకలేదా డాడీ!"

"లేదమ్మా! బులెట్స్ వేస్ట్ అయినయ్‌గాని ఒక్కటి కూడా దొరకలేదు ఆ మచ్చల జింక వుంది చూడు! దాన్ని ఈసారి మాత్రం వదలను! యిది రెండోసారి కొంచెంలో మిస్సవడం"

"ఓ! అందుకే చాలా కోపంగా వున్నారు డాడీ! పదండి! మేడమీదకెళ్ళి డ్రస్ మార్చుకుందురుగాని! నేనీలోగా కాఫీ లైట్ రిఫ్రెష్‌మెంట్స్ ఎరేంజ్ చేస్తాను"

కర్నల్ ఓసారి చిరంజీవి వంకా, సింహాద్రి వంకా అయిష్టంగా చూశాడు.

వాళ్ళకూ, తనకూ మధ్య శ్రీదేవి నిలబడడంతో ఇంకేమీ మాట్లాడలేక మేడ మీద కెళ్ళిపోయాడు.

శ్రీదేవి తేలిగ్గా గాలి పీల్చుకుంది.

అంతకంటే ఎక్కువ గాలి సింహాద్రీ, చిరంజీవీ పిల్చుకున్నారు.

"ఓ అయామ్‌సారీ ధనుంజయ్‌గారూ! ముందే చెప్పాను కదా! మా డాడీకి వేటలో జంతువు దొరక్కపోతే ఎవర్ని పడితే వాళ్ళను కాల్చిపారెయ్యాలని కోరికగా ఉంటుందిట!" అంది నొచ్చుకుంటూ!

"సైకలాజికల్ వీక్‌నెస్" అన్నాడు చిరంజీవి.

"మీరేమీ అనుకోకండి!" సింహాద్రి వంక చూస్తూ అందామె.

చిరంజీవి సింహాద్రి భుజం తట్టాడు.

"శ్రీదేవిగారితో ఆ విషయం మాట్లాడుతూండు! నేనీలోగా గార్డెన్ ఓసారి చూసి

వస్తాను" అంటూ సింహాద్రికి కన్నుకొట్టి బయటకెళ్ళాడు.

సింహాద్రికి అర్థమయిపోయింది.

తన ప్రేమను వెల్లడి చేయడానికి ఇంతకంటే మంచి అవకాశం వచ్చేట్లు కనిపించలేదు. పరిస్థితులు ఎప్పుడెలా ప్రమాదకరంగా మారతాయో ఊహించడం కష్టంగా ఉంది.

"ధనుంజయ్‌గారూ! మీరు మరొక్క పావుగంట కూర్చోండి! నేనీలోగా నవల పూర్తి చేసి వస్తాను. మరో పాతిక పేజీలే ఉన్నాయ్" అంది శ్రీదేవి.

"నవల బావుందాండీ"

"అద్భుతంగా ఉంది" అంది శ్రీదేవి.

సింహాద్రి మొఖం చిన్నబోయింది.

"నా నవలకంటేనాండీ"

"నో నో నో. మీ నవలలకంటె గొప్పవి ఇంకెవరూ రాయలేరు ధనుంజయ్‌గారూ. అసలు మీరే స్వయంగా ఓ హిప్నాటిస్ట్ అన్న సంగతి నాకు ఇన్ని రోజులూ తెలీదు. తెలుస్తే..." ఆమె ఆపేసింది.

సింహాద్రి గుండెలు వేగంగా కొట్టుకున్నాయ్.

"తెలుస్తే ఏం చేసేవారండీ" ఆనందంగా అడిగాడు.

"ఏనాడో.. మీకు దగ్గరయేదాన్ని" సిగ్గుపడుతూ అందామె.

"శ్రీదేవిగారూ... నాకూ మీరంటే ఎంతో ఇష్టమండి! మీ ఫోటో చూసిన దగ్గర్నుంచీ నిద్ర పట్టలం లేదంటే నమ్మండి. నిద్రపడితే చాలు మీరు రామేశ్వర్ జఠానీ అనే వాడిని పెళ్ళి చేసుకున్నట్లు ఒకటే పీడకలలండీ!"

శ్రీదేవి ఆశ్చర్యపోయింది.

"రామేశ్వర్ జఠానీ ఎవరు?"

"అదే నాకూ తెలీటం లేదండీ! మన కిష్టం లేని పేరేదయినా చదువుతే అది మనసులో అలాగే నిలిచిపోతుందని చిరంజీవి అన్నాడండీ! వాడికి సైకాలజీ బాగా తెలుసులెండి! ఎందుకంటే నూట ఆరోజుల రాత్రింబగళ్ళు ఒక లాయరు ఇంటి పక్కన ఉన్నాడు కదండీ!"

శ్రీదేవి నవ్వేసింది.

"శ్రీదేవిగారూ"

"ఏమిటండీ"

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానండీ"

"ఓ!" సిగ్గుపడిపోయిందామె.

"అయ్ టూ లవ్ యూ" అంది ఓ క్షణం ఆగి.

సింహాద్రి ఆనందంతో ఉక్కిరి బిక్కిరయాడు.

ఈలోగా వంటవాడు ట్రేలో కాఫీ కప్పులతో వచ్చేశాడు.

"ఒకే మీరు కాఫీ తాగుతూండండీ! ఇప్పుడే ఈ పాతిక పేజీలూ చదివేసి వస్తాను. సస్పెన్స్ కంట్రోల్ చేసుకోలేక ఛస్తున్నాను" అనేసి లోపలికి పరుగెత్తింది శ్రీదేవి.

ఆమె అటు వెళ్ళగానే చిరంజీవి పరుగుతో లోపలికొచ్చేశాడు.

"కేస్ సక్సెసేనా?"

"సక్సెసున్నర" గర్వంగా అన్నాడు సింహాద్రి.

"పెళ్ళికి డేట్ ఫిక్స్ చేయడమే ఆలస్యం అన్నమాట"

"అదికూడా అట్టే ఆలస్యం ఉండదు"

"ష్యూర్"

"ఢామ్ ష్యూర్"

* * * * *

ఇద్దరూ కాఫీ కప్పులందుకుని రెండు గుక్కలు తాగేసరికి కర్నల్ డ్రస్ మార్చుకుని మేడదిగి వచ్చాడు. వస్తూనే వాళ్ళను చూసి అనుమానంగా దగ్గరకొచ్చాడు.

"ఎవరు మీరు?" అన్నాడు కఠినంగా.

సింహాద్రి చిరంజీవి మొఖం చూశాడు.

"మేము.... మేము... వీడి పేరు ధనుంజయ్ అండి. నాపేరు...."

"షటప్. పేర్లడటం లేదు. మీరెవరూ అనడుగుతున్నాను"

"మేము శ్రీదేవిగారి ఫ్రెండ్స్ అండీ! ఆమె బర్త్‌డే పార్టీకొచ్చాం"

కర్నల్‌కి ఠక్కున గుర్తుకొచ్చింది.

"ఓ! ఇందాక కలుసుకున్నాం కదూ! బేబీ చెప్పింది కూడానూ. అయామ్ సారీ" అన్నాడు నొచ్చుకుంటూ.

"అబ్బే అదేం ఫర్లేదులెండి? అందులో పెద్ద సారీ ఏముందని" అన్నాడు సింహాద్రి.

"అరె! అలా నిలబడ్డారెందుకు? కూర్చోండి"

ఇద్దరూ మళ్ళీ సోఫాలో కూర్చున్నారు.

కర్నల్ అభిమానంగా చూశాడు వాళ్ళవేపు.

"మా బేబీ ఫ్రెండ్సంటే నాకెంతో ఇష్టం" అన్నాడు తనూ వాళ్ళకెదురుగ్గా కూర్చుంటూ.

"అలాగండీ! దటీజ్ వెరీ నైస్" అన్నాడు చిరంజీవి.

"రియల్లీ ఒండర్‌ఫుల్" అన్నాడు సింహాద్రి.

"అది మీ మానవత్వాన్ని చాటుతోంది" అన్నాడు చిరంజీవి.

"మానవసేవే మాధవ సేవ అనీ మా పాలసీ కూడా అదేనండి"

కర్నల్ ఇద్దరివంకా చిరాగ్గా చూశాడు. దాంతో ఇద్దరూ సైలెంటయిపోయారు.

"మా బేబీ అందరితోనూ స్నేహం చేయదు. సెలెక్టెడ్ పీపుల్‌తోనే చేస్తుంది. అన్నట్లు మీ పరిచయ భాగ్యం అవలేదు" అన్నాడు కర్నల్ వివరాల కోసం.

చిరంజీవి ఉత్సాహంగా ప్రారంభించాడు.

"ఇతను ప్రఖ్యాత రచయిత ధనుంజయ్ అండీ! నాపేరు చిరంజీవి. ఇద్దరం ఫ్రెండ్స్"

"కాలేజ్ మేట్స్ అండీ!"

"ఇద్దరం ఇంటర్‌లో 'డి' సెక్షన్‌లో వుండేవాళ్ళం"

కర్నల్ అసహనంగా చూశాడు.

"రచయిత ధనుంజయ్ నువ్వా?" సింహాద్రి వంక చూస్తూ అడిగాడతను.

సింహాద్రి ఆనందంతో పొంగిపోయాడు.

"అవునండీ! నేనే!

"అవున్సార్! ఇతనే ఫేమస్ రైటర్ ధనుంజయ్"

"నా పేరు ఇంతకుముందే మీకు తెలుసాండీ?" అడిగాడు సింహాద్రి ఆనందంగా.

"తెలుసు!"

"అఫ్‌కోర్స్. మావాడి పేరు తెలీనివారుండరులెండి" సగర్వంగా అన్నాడు చిరంజీవి.

"నా నవలలు మీరు చదివారాండీ?"

"ఓ! ఒకటేమిటి? చాలా చదివాను"

"మీరు చదివాక ఎలా ఫీలయ్యారండి?"

"చాలా ఫీలయ్యాను. అది చదివినప్పటినుంచీ నీ అడ్రస్ కోసం ఎంతో ట్రైచేస్తున్నాను"

చిరంజీవి ఆ మాటలు వినగానే విజయగర్వంతో సింహాద్రివేపు చూశాడు.

"నేను చెప్పలేదుట్రా!"

కర్నల్ అనుమానంగా చూశాడతనివేపు.

"ఏం చెప్పావ్?"

'మిలటరీ ఆఫీసర్ల సంగతండి?"

"ఏమిటి వాళ్ళ సంగతి?"

"వాళ్ళు సాహిత్యమంటే ప్రాణం ఇస్తారండి"

"అలా అని నీకెవరు చెప్పారు?"

"మా శ్రీనివాసులండి"

"వాడెవరు?"

"మా ఫ్రెండండీ"

"వాడెందుకు చెప్పాడా విషయం?"

"వాడి రచనలంటే పడిచచ్చే ఓ మిలటరీ ఆఫీసర్‌గారు రిటైరయ్యాక వాడిని ఇంటికి పిలిచి ఎంతో గౌరవించారటండీ"

"ఐసీ"

చప్పున సింహాద్రి అందుకున్నాడు.

"పాపం ఎప్పుడూ బోర్డర్స్‌లో ఉంటారు కదండీ! అంచేత సాహిత్యం అంటే మరీ అభిమానం అటండీ!"

"నీకెవరు చెప్పారు?"

"వాడేనండి"

"దటీజాల్ ట్రాష్!"

"అలాగాండీ?"

"అవును. మియర్ ట్రాష్"

"సరేనండీ"

"నన్నడిగితే మేమంతా బోర్డర్స్‌లో అందరికీ దూరంగా ఉండడం మీ అదృష్టం అంటాను"

"ఎందుకండీ?"

"మాకు సమీపంగా ఉన్నట్లయితే ఏం జరిగేదో నేనే చెప్పలేను"

"అదేనండి మా శ్రీనివాసులు చెప్పాడు. పాపం అతని అభిమాని..."

"సైలెన్స్" అరిచాడు కర్నల్.

"ఎందుకు సార్ అలా అరచారు?"

"టు హెల్ విత్ యువర్ శ్రీనివాసరావ్"

"శ్రీనివాసరావ్ కాదండీ! శ్రీనివాసులు"

"అయ్ సే షటప్"

చిరంజీవికి ఇంక మాట్లాడడం భావ్యంగా కనిపించక సైలెంటయిపోయాడు.

"మిష్టర్ ధనుంజయ్" శాంతంగా పిలిచాడు కర్నల్.

"ఏంటండీ?" అతని గొంతులోని మార్పుకి సంతోషిస్తూ అన్నాడు సింహాద్రి.

"అలాంటి నవలలు యికముందు కూడా రాయాలన్న ఆలోచన వుందా నీకు?" కర్నల్ తాపీగా అడిగాడు.

సింహాద్రి గర్వంతో పొంగిపోయాడు.

"అవునండీ! ప్రస్తుతం కూడా ఓ నవల రాస్తున్నారండీ కథేమిటంటేనండీ ఓ జమీందారు వుంటాడండీ. ఆ జమీందారుకి ఏడుగురు కొడుకులండీ. అందులో ఆరోవాడు రిక్షా తొక్కుతూంటాడన్న మాటండీ. ఎందుకంటే వాడు చాలా ప్రిన్సిపుల్డ్ అన్నమాట. ఎవరిమీదా ఆధారపడడం ఇష్టం లేదన్న మాట కేవలం స్వార్జితం..."

"స్టాపిట్!" అరిచాడు కర్నల్.

సింహాద్రి ఆశ్చర్యపోయాడు.

ఈ మనిషి తత్వం బొత్తిగా బోధపడడం లేదు తనకి. అతనే కొశ్చెన్స్ వేస్తాడు. జవాబు వివరంగా చెప్తూంటే కరవబోతాడు.

"అయితే యింకేమాత్రం ఆలస్యం చేయడానికి వీల్లేదు" అన్నాడు కర్నల్.

సింహాద్రి మళ్ళీ ఉత్సాహంతో పుంజుకున్నాడు.

"అవునండీ. అలస్యాత్ విషయం అమృత్ అన్నారండీ"

"అంటేవాడు చెప్పింది శాంస్క్రీట్‌లెండి! బైది వే హి నోస్ శాంస్క్రీట్ ఆల్సో" అన్నాడు చిరంజీవి.

"టు హెల్ విత్ హిజ్ శాన్స్క్రీట్' అరచాడు కర్నల్.

"సరేనండీ!"

"మీరు తప్పక చదవాలి సార్! పబ్లిష్ అవగానే కాపీ నేనే స్వయంగా తెచ్చిస్తాను" అన్నాడు సింహాద్రి. టాపిక్ మార్చేస్తూ.

"షటప్" అరచాడు కర్నల్.

సింహాద్రికి ఏమీ అంతుబట్టటం లేదు.

"ఆల్‌రైట్" అన్నాడు.

"పోనీ అర్జంటుగా చదవాలనుకుంటే యిప్పుడే వినిపిస్తాను. ఇప్పుడే అంటే యిప్పుడే కాదులెండి. రాత్రి డిన్నర్ అయాక మూన్‌లైట్‌లో అయ్‌మీన్ లైట్ లేకుండా అని కాదు చిన్న బల్బు సిక్స్టీ వాట్స్‌ది సరిపోతుంది. లేదా స్క్రిప్ట్ రడీ అవగానే ముందు మీకే చదవడానికి యిస్తాను"

'నీ నవల చదవాలనుకునే చిల్లర వెధవని కాదు నేను"

"అలాగాండీ!"

"అయితే ఆలస్యం చేయడానికి వీల్లేదు" అన్నాడు.

"ఏ విషయం గురించి?" అనుమానంగా అడిగాడు సింహాద్రి.

"నిన్ను కాల్చిపారేసే విషయం"

సింహాద్రితోపాటు ఈసారి చిరంజీవి కూడా అదిరిపడ్డాడు.

"కా.... కా..... కాల్చేస్తారా?"

"అవును! పిస్టల్‌తో కాల్చాలా రివాల్వర్‌తో కాల్చాలా అనేది నేనింకా నిర్ణయించుకోలేదు. బైది వే - ఈ రెండింట్లో నీకేదంటే యిష్టం?"

"కాని... కాని... యిప్పుడెందుకుసార్ అనవసరంగా కాల్చటం నన్ను? నేనేం చేశానని?"

"ఏం చేశావా? దేశాన్ని నాశనం చేస్తున్నావ్- మా శ్రీదేవి నీ హిప్నాటిజం రచనల మాయలోపడి- పెళ్ళంటూ చేసుకుంటే హిప్నాటిజం వచ్చినవాడినే చేసుకుంటానని మొండికేసింది. అందువల్ల ఎన్నో మంచి సంబంధాలను తిరకొట్టేసింది. హిప్నాటిజం వచ్చిన మా స్టేటస్‌కి తగ్గ వెధవాయి ఒక్కడూ దొరకడం లేదు. అప్పట్నుచే అసలు దీనికంతటికీ కారణమయిన నిన్ను షూట్ చేయాలని చాలా రోజుల్నుంచి ప్లాన్ చేస్తున్నాను కానీ అడ్రస్ దొరకలేదు. అసలు నీ అడ్రసేమిటి?"

"అడ్రస్ చాలా తేలికండీ కనుక్కోవడం. తిన్నగా మలక్‌పేట వచ్చేసి అక్కడ 6-6-3-2-8-1-2-1-628/319 ఎ-ఎస్-కె-ఎన్- సి-"

"స్టాపిట్" అరచాడు కల్నల్.

"ఇంకా పూర్తి కాలేదండీ అడ్రస్" చెప్పబోయాడు చిరంజీవి.

"టు హెల్ విత్ యువర్ అడ్రస్. యిప్పుడు నువ్వే పర్సనల్‌గా దొరికాకా యింకా అడ్రసెందుకు? ఆల్ రైట్ పద! మేడమీద కెళ్దాం"

సింహాద్రి ఆశ్చర్యపోయాడు.

"మేడమీదకా?"

"అవును"

"ఎందుకు సార్?"

"డ్రాయింగ్ రూమ్‌లో నిన్ను కాల్చడం నాకిష్టం లేదు- ఫర్నీచర్ పాడయిపోతుంది. ఇది చాలా కాస్టలీ ఫర్నీచర్"

చిరంజీవి యిదే అదునుగా తీసుకొని కల్నల్‌ని మాట మరిపించాలని ప్రయత్నాలు ప్రారంభించాడు.

"ఫర్నీచర్ నిజంగా చాలా ఒండర్‌ఫుల్‌గా వుందిసార్! అద్భుతమైన టేస్ట్ మీది. ఎక్కడినుంచి తెప్పించారు సార్ దీన్ని?"

"స్విట్జర్లాండ్ నుంచి!"

"సూపర్ ఛాయిస్! చాలామంది తెలివితక్కువ వెధవలు ఛిలీ, ఉగాండా దేశాల

నుంచి తెప్పిస్తూంటారండీ"

"అలా తెప్పించేవాళ్ళు ఇడియట్స్ అంటాను"

"అవునండీ!"

కర్నల్ సింహాద్రిని చూసి ఠక్కున మళ్ళీ ప్రోగ్రామ్ గుర్తు తెచ్చుకున్నాడు. వెంటనే చిరంజీవి వేపు చూసి "నువ్వు కూడా మేడ మీదకు పద" అన్నాడు కర్కశంగా.

"నేనా? నేనెందుకు సార్?"

"ఈ ధనుంజయ్‌గాడి స్నేహితుడు వయినందుకు. అసలీ ధనుంజయ్‌గాడికి సంబంధించిన వారందరినీ కూడా షూట్ చేయాలని షెడ్యూల్ వేసుకున్నాను"

సింహాద్రి చప్పున భయంలో నుంచి తేరుకున్నాడు.. అతని మెదడుకో అద్భుతమయిన వుపాయం తట్టింది.

"సార్! నేనికముందు నవలలు రాయడం మానేస్తున్నానండీ! నిన్నే డెసిషన్ తీసుకున్నాను" అన్నాడు కర్నల్ మనసు మారుతుందన్న ఉత్సాహంతో.

"అయినా సరే! అదివరకు రాసిన వాటికే నిన్ను షూట్ చేయబోతున్నాను" ఊ!.. గెటప్! పదండి మేడమీదకు!"

"ఇది అన్యాయం సార్! మేము శ్రీదేవిగారి స్నేహితులం"

"ఏం ఫర్వాలేదు. ముందు రచయితగా చద్దూగాని, తరువాత మా బేబీ ఫ్రెండ్‌గా చావవచ్చు. కమాన్. మేడమీదకు పదండి"

చిరంజీవికి పరిస్థితి విషమించి పోతోందని అర్థమయిపోతోంది.

"సార్! వాడు రాసిన నవలలకు బోలెడు పశ్చాత్తాపపడుతున్నాడు కదా! క్షమించేయగూడదూ?"

"ఆర్మీలో పశ్చాత్తాపం పనిష్మెంట్ కాదు"

సరిగ్గా అప్పుడే శ్రీదేవి లోపల్నుంచి వచ్చేసింది.

"డాడీ! ఏం చేస్తున్నారు మీరు?" అంది తండ్రి చేతిలోని పిస్టల్‌నూ, పిస్టల్ కెదురుగ్గా నిలబడ్డ సింహాద్రినీ, చిరంజీవినీ చూసి.

"వీళ్ళను కాల్చడానికి మేడమీదకు తీసుకెళ్తున్నాను"

"ఓకే డాడీ! ఇంకా ఇక్కడే కాలుస్తారేమోనని భయపడ్డాను! ఫర్నిచరంతా రక్తం మరకలు అయిందంటే మళ్ళీ అన్నీ క్లీన్ చేయించలేక పెద్ద హెడేక్"

* * * * *

సింహాద్రీ, చిరంజీవీ ఉలిక్కిపడ్డారు.

సింహాద్రి ఏడుపు మొఖంతో శ్రీదేవివంక చూశాడు.

"అయినా నీకిలాంటి టుమ్రీగాళ్ళతో ఎలా ఫ్రెండ్‌షిప్ అయిందమ్మా?" అప్యాయంగా అడిగాడు కర్నల్.

"టుమ్రీ అంటే ఏమిటండీ?" అడిగాడు సింహాద్రి.

"డోంటాక్" అరచాడు కర్నల్.

"అతని నవలలు చదవడం మూలాన ఫ్రెండ్‌షిప్ చేసుకున్నాను డాడీ" చెప్పింది శ్రీదేవి.

"ఏవీ ఆ హిప్నాటిజం నవలలా?"

"హిప్నాటిజమే కాదు డాడీ, టెలిపతీ, అలోపతీ, విలోపతీ– ఇంకొకటి ఏమిటబ్బా" ఆలోచనలో పడిందామె.

"సైకోపతి అండీ" అందించాడు చిరంజీవి.

"కరెక్ట్, సైకోపతి ఇవన్నీ రాస్తాడు డాడీ!"

"అదంతా ట్రాష్" అరచాడు కర్నల్.

"ట్రాష్ కాదు డాడీ! మొన్న అతనే హిప్నాటిజం చేసి చూపించాడు."

"ఏడ్చాడు"

"కాదు డాడీ! నిజమే! మనుషుల్నే కాదు కుక్కని కూడా చేస్తాడు"

"కుక్కనా?"

"అవును డాడీ"

"ఆల్‌ట్రాష్" బిగ్గరగా అన్నాడు.

"ట్రాష్ కాదండీ! నిజమే" కల్పించుకుంటూ అన్నాడు చిరంజీవి.

కర్నల్‌కి ఛటుక్కున ఓ ఆలోచన వచ్చింది.

"ఐ సీ" అన్నాడు తల పంకిస్తూ.

"మిస్టర్ సింహాద్రీ" నెమ్మదిగా పిలిచాడతను.

"ఏమిటండీ"

"మనుషుల్నీ, జంతువుల్నీ కూడా హిప్నటైజ్ చేస్తావన్నమాట నువ్వు"

"అఫ్‌కోర్స్. ఇహి... అవునండీ! ఆల్ మోస్టాల్ చేయగలనండి. కాపోతే ఇహిహి.... అంతేనండీ" భయంగా అన్నాడు డతను.

"ఆల్‌రైట్! నన్ను హిప్నటైజ్ చెయ్ చూద్దాం" అన్నాడు నడుంమీద రెండు చేతులు పెట్టుకుని.

సింహాద్రి కంగారుపడిపోయాడు.

"ఇప్పుడాండీ?"
"అవును! ఇప్పుడే ఈ నిమిషంలోనే"
"మిమ్మల్నాండీ"
"నన్నే!"
"ఇప్పుడు చేయడం కొంచెం కష్టమండీ"
"ఏం.... ఎందుకు కష్టం?"
"మూడ్ బాగోలేదండీ?"
"ఎవరిది"
"నాదేనండీ"
"మిస్టర్ సింహాద్రీ"
"యస్సార్"
"నన్ను హిప్నటైజ్ చేస్తావా, ఇక్కడే కాల్చిపారేయమన్నావా?"
శ్రీదేవి కెవ్వున అరచింది.
"అయ్యో ఇక్కడ కాల్చొద్దు డాడీ! ప్లీజ్! సోఫాలన్నీ బ్లడ్‌స్టెయిన్స్ అవుతాయ్"
"ఓ... సారీ బేబీ! మర్చేపోయానా విషయం"
"పోనీ ఓ పనిచేయనాండీ" నెమ్మదిగా దీనంగా అడిగాడు సింహాద్రి.
"ఏమిటది?"
"మా చిరంజీవిని చేసి చూపిస్తానండీ" ఆశగా అన్నాడు.
"డోంట్ థింక్ అయామేఫూల్"
"అబ్బే... అలా అనుకోవడం లేదండీ"
"ష్యూర్?"
"ష్యూరండీ"
"అయితే నోర్మూసుకుని నేను చెప్పినట్లు చెయ్"
"ఏం చెప్పారండీ?"
"నన్ను హిప్నటైజ్ చేయమని"
"కానీ..."
"త్రీ వరకూ లెక్కపెడతాను! ఈలోగా ప్రారంభించపోయావో ఫట్"
"కానీ సార్! అసలు హిప్నటిజం చేయడానికి...."
"వన్"
"అది కాద్సార్! పోనీ ఇవాళ్టికి చిరంజీవిని...."

"టూ"
"పోనీ మిమ్మల్నే రేపు తెల్లరుజామున..."
"త్రీ" అనేసి పిస్టల్ అతని ఛాతీకి గురిపెట్టాడు కర్నల్.
"బాబోయ్ వద్దులెండి! చేస్తాను... ఇప్పుడే చేస్తాను" వణుకుతున్న గొంతుతో అన్నాడు సింహాద్రి.
"అయితే చెయ్"
"మీరలా కూర్చుని నా కళ్ళల్లోకే చూడండి" అన్నాడతను.
"ఎందుకు?"
"హిప్నటిజంలో అలా చూడాలని ఓ ఆచారం ఉందండీ" సర్ది చెప్పాడు చిరంజీవి.
కల్నల్ ఎదురుగ్గా కూర్చుని సింహాద్రి కళ్ళల్లోకి భీకరంగా చూడసాగాడు.
"మీరు నావంకే చూస్తున్నారు– నా వంకే చూస్తున్నారు నావంకే చూస్తున్నారు" అన్నాడు సింహాద్రి.
"అవును! చూస్తున్నాను" అన్నాడు కర్నల్.
"మీరు నిద్రావస్థలోకెళ్తున్నారు – నిద్రావస్థలోకెళ్తున్నారు – నిద్రావస్థలోకెళ్తున్నారు" అన్నాడు మళ్ళీ.
"ఎక్కడికి?" ఆశ్చర్యంగా అడిగాడు కర్నల్.
"నిద్రావస్తలోకి"
"అంటే?"
"అంటే నిద్రలోకెళ్తున్నారని అర్థమండీ?"
"నేను వెళ్ళటం లేదు" అన్నాడు కర్నల్.
"వెళ్ళటం లేదాండీ?" అడిగాడు సింహాద్రి.
"లేదు"
"ఎందుకనండీ?"
"ఎందుకెళ్ళాలి?"
"హిప్నాటిజంలో ఎదుటివ్యక్తి చెప్పినట్లు చేయాలి కదండీ?"
"నేను చేయను"
సింహాద్రికేం చేయాలో తోచలేదు.
"సరేనండీ! మరోసారి ప్రయత్నిస్తాను. మీరు కళ్ళుమూసుకుంటున్నారు – మీరు కళ్ళుమూసుకుంటున్నారు – మీరు కళ్ళుమూసుకుంటున్నారు"
"మూసుకోవటం లేదు" అన్నాడు కర్నల్.

"మీరు నిన్నటిలోకి వెళ్తున్నారు - నిన్నటిలోకి వెళ్తున్నారు- నిన్నటిలోకి వెళ్తున్నారు" అన్నాడతను మళ్ళీ

"ఎక్కడికీ వెళ్ళటం లేదు" అన్నాడు కర్నల్.

"ఇలా అన్నిటికీ ఎదురు తిరిగితే కష్టమండీ" బుంగమూతితో అన్నాడు సింహాద్రి.

"కష్టమా! మరి మా బేబీ ఎదురుగ్గా ప్రదర్శన ఇచ్చావుగా? ఇప్పుడేమయింది ఆ ఫోజంతా? చూశావా బేబీ- నేను చెప్పలేదూ ఇదంతా ట్రాష్!"

"కావాలంటే మా చిరంజీవిని చేస్తానండీ" బతిమాలసాగాడు సింహాద్రి.

"అవునండీ! మొన్న భలే బాగా చేశాడు నన్ను"

"కంప్లీట్ బంకమ్"

"బంకమ్ అంటే ఏమిటి సార్?"

"ఆల్ ట్రాష్"

"కాద్సార్ మూడు బావుండలేదు"

"ఆల్ రైట్! నన్ను చేయడానికి మూడ్ బావుండలేదు కదా?"

"అవున్సార్"

"అయితే మా కుక్కను చెయ్"

"కుక్కనా?" నీరసంగా అన్నాడు సింహాద్రి.

"అవును! ఒరే రంగా" గట్టిగా పిలిచాడు కల్నల్.

రంగా పరుగుతో వచ్చాడక్కడికి.

"ఏం సార్?"

"మన ఆల్సేషన్ని తీసుకురా!"

"అలాగే సార్" అంటూ పరుగుతో బయటికెళ్ళి అయిదు నిమిషాల్లో మనిషంత ఎత్తువున్న ఆల్సేషన్‌తో తిరిగి వచ్చాడు.

"హలో జిబ్రికా" అన్నాడు కర్నల్.

ఆల్సేషన్ ఆనందంగా అతని దగ్గరకెళ్ళి అతని చుతులు నాకి ఆజ్ఞకోసం ఎదురుచూస్తూ నిలబడింది.

"గోటూ దట్ డెకాయిట్ అండ్ సిట్ దేర్ జిబ్రికా" అన్నాడు కర్నల్.

జిబ్రికా సింహాద్రి దగ్గరకొచ్చి అతని కెదురుగ్గా కూర్చుంది.

సింహాద్రి కాళ్ళు, చేతులు వణుకుతున్నాయ్ దానిని చూస్తుంటే.

"కమాన్! డూ ఇట్" అరిచాడు కర్నల్ సింహాద్రి వంక చూస్తూ.

సింహాద్రికేమీ పాలు పోవడం లేదు.

"ఆల్సేషన్ని హిప్నటైజ్ చేయడం కుదరదండీ" అన్నాడు చిరంజీవి.

"కల్నల్ చిరంజీవివేపు కోపంగా చూశాడు.

"ఏం? ఎందుకని కుదరదు?"

"ఏమోసార్! కుదరదని పుస్తకాల్లోరాశారండీ"

"చూశావా బేబీ! నేను నీకు ముందే చెప్పాను కదా! అంతా ట్రాష్" అన్నాడు కర్నల్ శ్రీదేవితో.

శ్రీదేవి కోపంగా సింహాద్రి వేపు చూసింది. సింహాద్రి చిరంజీవేపు చూశాడు. చిరంజీవి సీలింగ్స్ వేపు చూశాడు.

"జిబ్రికా! వెరీగుడ్ నేమ్" అన్నాడు కర్నల్‌తో.

"డోంటాక్" అన్నాడు కర్నల్.

"ఒరే రంగా" మళ్ళీ పిల్చాడు కర్నల్.

"సార్"

"గన్ క్లీన్ చేశావా?"

"చేశాన్సార్?"

"ఏదీ... తీసుకురా!"

రంగా జిబ్రికాను తీసుకెళ్ళి రెండు నిమిషాల తర్వాత గన్‌తో తిరిగి వచ్చాడు.

కర్నల్ గన్ తీసుకుని పరీక్షించాడు.

"బారెల్లో వేడినీళ్ళు పోశావా?"

"పోశాన్సార్"

"పుల్ త్రూ కొట్టావా?"

"కొట్టాన్సార్"

"మాగజైన్ తీసి క్లీన్ చేశావా?"

"అది రావటం లేదండీ! ఎలా తీయాలో మర్చిపోయాను"

కర్నల్ కోపంతో మండిపడ్డాడు.

"ఇడియట్! మాగజైన్ ఎలా తీయాలో తెలీదుట్రా!"

"తెలుసుగానండీ! మర్చిపోయాను. ఎంత లాగినా రావటం లేదు"

"బ్లడీఫూల్! మాగజైన్ తీయటం తెలీదా? ఎవడినడిగినా చెప్తాడా విషయం! ఏ వెధవాయిని తీయమన్నా తీసి చూపిస్తాడు"

అని ఆ పని ఎవరితో చేయించాలా అని చుట్టూ చూశాడు. అతనికి చిరంజీవి తప్పితే ఇంకెవరూ కనిపించలేదు.

"ఏమోయ్ మాగజైన్ ఎలా తీస్తారో నీకు తెలీదూ?"

చిరంజీవి ఈ అవకాశాన్ని వదలదల్చుకోలేదు. ఎన్.సి.సి.లో తను సంపాదించిన విజ్ఞానమంతా ఉపయోగించి కల్నల్‌ని సంతోషపెట్టాలని నిర్ణయించుకున్నాడు.

"తెలుసండీ! అసలు గన్‌లో మూడు భాగాలుంటాయండీ! అవి వరుస క్రమంలో బట్ గ్రూప్, బాడీగ్రూప్, బారెల్ గ్రూప్‌గా వ్యవహరించబడును. మాగజైన్ బయటకు తీయాలంటే ట్రిగ్గర్‌కి సమీపమున ఒక మీట ఉండును. అంటే ఉదాహరణకు డోర్‌బెల్‌కి మీ బిల్డింగ్‌లో కింద మీట ఉన్నట్లు..."

కర్నల్‌కి అతనిమీద సదభిప్రాయం కలగడం మొదలుపెట్టింది.

తను చాలామంది ఎన్సీసీ స్టూడెంట్స్‌ని చూశాడు కానీ ఇలా ఇన్ని రోజులు పార్ట్స్ గుర్తుపెట్టుకున్నవాళ్ళు బహు కొద్దిమంది.

"నువ్వు ఎన్సీసీలో ఉన్నావా?" అడిగాడు కల్నల్.

"అవునండీ"

"ఆర్మీలో ఎందుకు జాయినవలేదు మరి?"

"వాళ్ళు రానీలేదండీ"

"ఎందుకని?"

"తెలీదండీ!"

"అయ్‌విల్ రికమెండ్ యువర్ కేస్"

"థాంక్యూ సర్"

ఇంకాసేపు అలా మాట్లాడితే అతనిమీద పూర్తి సదభిప్రాయం కలిగేదేమోకాని ఇంతలోకి సింహాద్రి మాట్లాడాడు.

"అవునండీ! చిలకల పంజరం డోర్‌కి ఆ వెనుకవేపు గోడకు మీట ఉన్నట్లు మాగజైన్‌కి కింద మాట ఉంటుందండీ!"

"కర్నల్ అనుమానంగా సింహాద్రివేపు చూశాడు.

"వాట్.... పంజరానికి మీటా? మీట అక్కడ ఉన్నట్లు మీకెలా తెలుసు?"

చిరంజీవి సింహాద్రివేపు చూసి పళ్ళు పటపట కొరికాడు.

జరిగిన తప్పు తెలుసుకుని నాలిక్కరుచుకున్నాడు సింహాద్రి.

"అబ్బే! మాకు తెలీదండీ"

"తెలీదా?"

"వట్టండీ? తెలీదు"

"నిజం చెప్పండి! ఆ మీట నొక్కారా మీరు?"

"అబ్బే లేదండీ! అదసలు ఉందనే తెలీదు"

"తెలీందే గోడకి మీట ఉన్నట్లు ఎలా చెప్పావ్?"

"ఊహించానండీ"

"అయ్ డోన్ట్ బిలీవ్. నేను వెళ్ళి పంజరం చూసి వస్తాను" అంటూ రెండడుగులు వేసి మళ్ళీ అనుమానంగా ఇద్దరివేపూ చూశాడతను.

"ఒరే రంగా! వీళ్ళిద్దరూ పారిపోకుండా చూస్తూండు" అని చెప్పి బయటికెళ్ళాడు.

ఇదే అదననుకుని సింహాద్రి శ్రీదేవిని బతిమాలసాగాడు.

"శ్రీదేవిగారూ! మమ్మల్ని రక్షించండి ప్లీజ్"

శ్రీదేవి కోపంతో మండిపడింది.

"వీల్లేదు! మిమ్మల్ని కాల్చిపారెయ్యాల్సిందే"

"అదేంటండీ! మనిద్దరం ప్రేమించుకున్నాం కదా?"

"అది ఇందాక చదువుతున్న నవల పూర్తి కాకముందు సంగతి"

"మరిప్పుడండి?"

"ఇప్పుడు అయ్ హేట్ యూ అండ్ యువర్ హిప్నాటిజం"

"మరి సైకోపతి, టెలీపతి, విలోపతి సంగతి?"

"అయ్ హేట్ ఎవ్రిథింగ్"

"ఐసీ" అన్నాడు సింహాద్రి.

"యస్. యూ కెన్ గో టూ హెల్" అందామె ఇంకా కోపంగా.

"కానీ మీరు ఎందుకండీ వాటిని ఇంత సడెన్‌గా హేట్ చేస్తున్నారు?"

"ఇప్పుడు నేను చదివిన నవల వల్ల"

"అలాగాండీ!"

"యస్!"

"ఏమయిందండి ఆ నవల్లో?"

"ఇంకేమవుతుంది? ఆ విలన్‌గాడు తనకొచ్చిన హిప్నాటిజం, టెలీపతీ, సైకోపతి ద్వారా హీరోయిన్‌నీ, ఆమె ఫామిలీ మెంబర్స్‌నీ నానా అవస్థలూ పెట్టి చంపిపారేశాడు. వాటి వల్ల ఇంత చెడు జరగడానికి కూడా అవకాశం వుందని నాకింతవరకూ తెలీదు"

"తెలుస్తే ఏం చేసేవారండీ?"

"ఆ చెత్త ఏనాడో చదవడం మానేసేదాన్ని"

సింహాద్రికేం మాట్లాడాలో తెలీలేదు. దీనంగా చిరంజీవి వేపు చూశాడు. చిరంజీవికి అతనని చూస్తే జాలేసింది. వెంటనే వాడిని రక్షించకపోతే తమ స్నేహానికి ఉపయోగం

ఏముందీ అనిపించింది.

"శ్రీదేవిగారూ!" అన్నాడు గొంతు సవరించుకుని.

"యస్" ప్రశ్నార్థకంగా అతనివేపు చూసిందామె.

"నిజం చెప్పాలంటే హిప్నాటిజం అంటే మీకెంత ద్వేషమో పాపం వాడికి కూడా అంతే ద్వేషం అండీ" అన్నాడు సీక్రెట్ బయటపెడుతున్నట్లు.

శ్రీదేవి నమ్మలేనట్లు చూసింది.

"ద్వేషమా?"

"అవునండీ!" తలూపాడు సింహాద్రి.

"నేన్నమ్మను"

"అలా అనకండి! మీమీద వట్టు"

"ఆ పుస్తకాలే రాస్తూ అవంటే అసహ్యం అంటారేమిటి? మీకేమయినా మెదడుందా అసలు?"

"మెదడుందండి! ఈ మధ్యే ఎక్స్‌రే తీయించినప్పుడు క్లియర్‌గా కనిపించింది" చెప్పాడు చిరంజీవి.

"అయితే మరి అలా పిచ్చిమాటలు ఎందుకు మాట్లాడుతున్నట్లు?"

"పిచ్చిమాటలు కాదండీ ఫాక్ట్! వీడు కేవలం కమర్షియల్ రైటర్! అంతే"

"అంటే?"

"అంటే కేవలం బిజినెస్ కోసం- అంటే అలాంటి పుస్తకాలు ఎక్కువ అమ్ముడవుతాయి కాబట్టి రాస్తున్నాడు"

"నేనమ్మను"

"ప్లీజ్! ఈ ఒక్కసారికీ నమ్మండి" బతిమాలాడు సింహాద్రి.

"నో"

"శ్రీదేవిగారూ!"

"మిస్ శ్రీదేవి అనండి"

"మిస్ శ్రీదేవి"

అప్పుడే కర్నల్ లోపలికొచ్చాడు మళ్ళీ.

"నిజం చెప్పండి. ఆ మీట నొక్కింది మీరా, కాదా?" సింహాద్రి దగ్గరకొచ్చి అడిగాడతను.

"అబ్బే- నిజంగానండీ! మాకేం తెలీదు" అన్నాడు సింహాద్రి.

"అవున్సార్! మాకేమాత్రం తెలీదు. మేము కేవలం డోర్ బెల్ కోసం వెతుకుతూంటే

శ్రీదేవిగారే తలుపు తెరచి డోర్ బెల్ మీట కాళ్ళకిందే వుందని చెప్పారు"

"అవునండీ! మీ కుక్క కన్వీనియెన్స్ కోసం అలా ఏర్పాటు చేశామని కూడా అన్నారు"

"కానీ మీ కుక్క పేరు చాలా బావుందండీ! వెరీనైస్ నేమ్"

"ఆ పంజరంలోని చిలకలన్నీ ఏమయిపోయినయ్?" కర్కశంగా అడిగాడు కర్నల్.

"ఎగిరిపోయాయండీ" అనేసి నాలిక్కరచుకున్నాడు సింహాద్రి.

"వాట్? ఎగిరిపోయాయా?"

"అవునండీ"

"అంటే- అది మీ పనేనన్నమాట"

"అబ్బే! మాకదేం తెలీదండీ"

"తెలీందే ఎగిరిపోయినాయని ఎలా చెప్పావ్ మరి?"

"ఎలాగంటేనండి- ఎలాగంటేనండి - ఎలాగంటే..." సహాయం కోసం చిరంజీవివేపు చూశాడతను.

"అది జస్ట్ కామన్ సెన్సండీ" జొరపడుతూ అన్నాడు చిరంజీవి.

"కామన్సెన్సా?" కోపంగా అడిగాడు కర్నల్.

"అవునండీ! చిన్నప్పుడు మీరు తెలుగువాచకంలో గేయం చదువలేదూ? ఆ గేయం పేరు చక్కని ఓ పక్షులారా' చాలా అద్భుతంగా వుంటుంది. రాసిందెవరంటే- సారీ పేరు గుర్తులేదు, కానీ గేయం పేరుమాత్రం... చక్కని ఓ పక్షులారా"

"టు హెల్ విత్ దట్ గేయం" పళ్ళు కొరుకుతూ అన్నాడు కర్నల్.

"అఫ్‌కోర్స్! ఆ గేయం మనకు ఆ ప్రస్తుతం! నేను మీ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను" అన్నాడు సింహాద్రి.

"అయితే కేజ్ డోర్ తెరచింది నువ్వేకదూ?"

"లేద్సార్! జస్ట్ కామన్‌సెన్స్ ప్రకారం చెప్పాను. అంతే!"

"ఏమిటా కామన్‌సెన్స్?"

"అదే జంతువులు పరుగెత్తును, చేపలు ఈదును, పక్షులు ఎగురును- ఇవన్నీ కామన్‌సెన్సే కదండీ! జస్ట్ కామన్‌సెన్స్"

"టు హెల్ విత్ కామన్‌సెన్స్! కేజ్ డోర్ ఎవరు తెరచారు?"

* * * * *

ఇలా ఆ సంభాషణ ఇంకెంత సేపు కొనసాగేదోగాని ఈలోగా ఓ పొడుగాటి వ్యక్తి బ్రీఫ్‌కేస్ తీసుకుని సరాసరి లోపలికొచ్చేశాడు.

"గుడ్ మాణింగ్" అన్నాడు కర్నల్‌తో.

కర్నల్ అతనివంక అయిష్టంగా చూశాడు

మాంఛి ముఖ్యమయిన సన్నివేశంలో ఉండగా పర్మిషన్ తీసుకోకుండా ఇంట్లో జొరబడటమే కాకుండా– పేరుపేరునా అందరినీ విష్ చేయడం, ఆ తర్వాత గ్రూప్ విష్షింగ్ ఇవన్నీ పరమ చిరాకు కలిగించినయ్ అతనికి. ఇలా ముక్కూ మొఖం తెలీని సజ్జంతా ఇంట్లో జొరబడి ఇకిలించడానికి ఇదే డ్రామా కంపెనీ కాదుగదా!

"హు ఆర్ యూ?" అన్నాడావ్యక్తి వేపు తిరిగి కోపంగా.

ఆ వ్యక్తి మళ్ళీ చిరునవ్వు నవ్వాడు.

"ఓ! నన్ను గుర్తుపట్టలేదన్నమాట" అన్నాడు ఆశ్చర్యంగా.

"హూ ఆర్ యూ?" మరింత కోపంగా అన్నాడు కర్నల్.

అతను మళ్ళీ చిరునవ్వు నవ్వాడు.

"ఇదే మొదటిసారి ఎవరయినా నన్ను గుర్తుపట్టకపోవడం" అన్నాడు వేదాంతధోరణిలో.

"నువ్వెవరు?" తెలుగులో అడిగితే అర్థం చేసుకుంటాడే మోనని అడిగాడు కర్నల్.

సరిగ్గా అప్పుడే వంట అమ్మాయ్ లోపల్నుంచి వచ్చి "భోజనం రడీ" అంది.

ఆమెను చూడగానే ఆ కొత్తవ్యక్తి మొఖం మీద చిరునవ్వు– మరింత వెలిగిపోయింది. ఆమె దగ్గరకెళ్ళి–

"హాపీ బర్త్‌డేటూ యూ, హాపీ బర్త్ డే టూ యూ, హాపీ బర్త్‌డే టూ యూ" అన్నాడు ఇంచుమించుగా నృత్యం చేస్తున్నట్లు కదులుతూ.

కర్నల్‌కి పగ్గాలు తెగిపోయాయ్.

"నోర్మూసుకుని నువ్వెవడివో చెప్పు" అంటూ అరచాడు.

అప్పటికి ఆ వ్యక్తి చెక్కు చెదరలేదు. "శ్రీదేవిగారిల్లు ఇదేనా?" అనడిగాడు అనుమానంగా.

"అవును" అన్నాడు సింహాద్రి.

"అయితే– ఐయామ్ ఇన్ కరెక్ట్ ప్లేస్ ఓన్లీ" మళ్ళీ చిరునవ్వుతో అని వంటమ్మాయ్ వేపు తిరిగాడు.

"మీరు కూడా నన్ను గుర్తుపట్టలేదా?" అనడిగాడు.

ఆ అమ్మాయి భయపడిపోయింది.

"ఎవర్నువ్వు?" అంది రెండడుగులు వెనక్కు వేస్తూ.

"హాపీ బర్త్‌డే టూ యూ" అన్నాడతను మళ్ళీ.

కర్నల్ పిస్టల్ పైకి తీశాడు.

"నోర్మూసుకుని ముందు నువ్వెవడివో చెప్తావా లేదా?" అన్నాడు ఆఖరుసారిగా

ఆ వ్యక్తి పిస్టల్ చూసి కంగారుపడ్డాడు. ఆ మాట అన్నది తనను కాదేమోనని అటూ ఇటూ చూశాడు.

"నిన్నే అడిగేది– అలా దిక్కులు చూస్తావేమిటి? చెప్పు! హూ ఆర్ యూ?"

ఇంక ఇంట్రడ్యూస్ చేసుకోవడం చాలా ఆరోగ్యకరమయిన విషయంగా కనిపించిందా వ్యక్తికి.

"ఓకే! ఓకే. నా ఫోటో ఎప్పుడూ చూడలేదా?" కర్నల్ నడిగాడతను.

"అడ్డమైన ఫోటోలు చూసేవాడిక్కడ ఎవడూ లేదు" అన్నాడు కర్నల్.

"నేననేది అడ్డమయివాళ్ళ ఫోటోల సంగతి కాదండీ! నా ఫోటో సంగతి"

"నీ ఫోటో సంగతే చెప్తున్నాను" అన్నాడు కర్నల్.

ఆ వ్యక్తి కొంచెం ఖంగుతిన్నాడు.

"ఆల్ రైట్.. ఆల్ రైట్! అయామ్ ధనుంజయ్. ప్రఖ్యాత రచయిత ధనుంజయ్‌ని నేనే" అంటూ ఆనందంగా చుట్టూ చూశాడు.

"వ్వాట్" అదిరిపడ్డాడు కర్నల్.

అతనితోపాటు సింహాద్రి, చిరంజీవి, గదిమూల సోఫాలో కూర్చున్న శ్రీదేవి కూడా అదిరిపడ్డారు.

"ప్రఖ్యాత రచయిత ధనుంజయ్ అంటే నువ్వా?" మళ్ళీ అడిగాడు కర్నల్.

"సెంట్ పర్సెంట్"

కర్నల్ జెర్క్ ఇచ్చినట్లు తలతిప్పి సింహాద్రివేపు చూశాడు. సింహాద్రి కూడా అదే స్పీడ్‌లో చిరంజీవి వేపు చూశాడు. చిరంజీవికి ఎటు చూడాలో తెలీలేదు. అంచేత కర్నల్ వేపు చూసి–

"ఇహిహి" అన్నాడు.

"డోంట్ లాఫ్" అన్నాడు కర్నల్.

శ్రీదేవి మెల్లగా లేచి గది మధ్య కొచ్చింది.

"మీరు రచయిత ధనుంజయ్‌గారా?" అంది ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ.

"సెంట్ పర్సెంట్ నేనే రచయిత ధనుంజయ్‌ని. శ్రీదేవిగారి పెన్ ఫ్రెండ్‌ని" అంటూ చిరునవ్వుతో వంట అమ్మాయ్ వేపు మళ్ళీ రెండడుగులు వేవాడు.

"ఇప్పుడు తెలిసిందా శ్రీదేవిగారూ! అయామ్ ధనుంజయ్ మీ బర్త్ డే కదూ ఇవాళ. అందుకే హాపీ బర్త్ డే టూ యూ, హాపీ బర్త్‌డ్ టూ యూ, మెనీ హానీ రిటర్న్ ఆఫ్ ది డే టూయూ..."

అతని వాలకం చూసి వంటమనిషి బయపడిపోయింది. కెవ్వున కేకవేసి వెళ్ళి కర్నల్ వెనుక దాక్కుంది.

"స్టాపిట్" బిగ్గరగా అరచాడు కర్నల్.

ధనుంజయ్ అదిరిపోయి మాట్లాడడం ఆపేశాడు.

"ఎవరు అరచిందిప్పుడు?" అన్నాడు చుట్టూ అందరినీ కలియజూస్తూ.

"నేను" అన్నాడు కర్నల్.

"ఎందుకలా అరచారు?"

"నా ఇష్టం!" ఇంకా కోపంగా అన్నాడతను.

"అలా అరవకండి. చిన్నప్పటినుంచీ నాకు అరుపులంటే భయం. గుండెల్లో దడవస్తుంది. ఎప్పటినుంచీ అలా జరుగుతోందో తెలుసా? సెవెన్త్‌క్లాస్ చదివే టప్పుడు మా హిందీ మాస్టారు నేను కాపీ కొట్టటం చూసి బిగ్గరగా అరచారు అప్పుడు.."

"ఐసే షటప్" మళ్ళీ అరచాడు కర్నల్.

ధనుంజయ్ నిస్సహాయంగా వంట మనిషివేపు చూశాడు.

"శ్రీదేవిగారూ! నన్ను ఆహ్వానించి ఏమీ మాట్లాడరేమిటి?" అన్నాడు దీనంగా.

"శ్రీదేవి నేను కాదు" అంది వంట మనిషి.

"ఆ... మీరు కాదా?"

"కాదు" చిరాకుగా అందామె.

"మరెవరు?"

"అదిగో ఆ అమ్మాయిగారు"

"ఏ అమ్మాయిగారు? మీరా?" శ్రీదేవి వంక చూస్తూ అడిగాడతను.

"అవును" అందామె ముక్తసరిగా.

"ఓ! అయామ్ సారీ! ఆమెను చూసి మీరనుకున్నాను. సారీ! వెరీసారీ! గ్లాడ్ టు సీయూ– గ్లాడ్ టూ మీట్ యూ! నిన్నే మీరు పంపిన ఇన్విటేషన్ అందింది– కొంచెం లేట్‌గా చేరిందనుకోండి! అయినా ఫ్లరేదు. బెటర్ లేట్ దేన్ నెవర్!"

బైది వే నేనిప్పుడు అదివరకటి ఇంట్లోలేను. అడ్రస్ మారింది ఇప్పుడు మా ఇంటి నంబరు 6-3-8-12-269-268-ఎహెచ్ఎన్-ఎస్‌హెచ్ఎల్ ఆ తర్వాత.... ఆ తర్వాత సారీ! ఆ తర్వాత మర్చిపోయాను. రెండు నిమిషాలు టైమిస్తే డయిరీ చూసి చెప్పేస్తాను" అన్నాడు బ్రీఫ్‌కేస్ తెరవబోతూ.

"అఖ్ఖర్లేదు" అంది శ్రీదేవి హడావుడిగా.

"అఖ్ఖర్లేదా?"

"అఖ్ఖర్లేదు"

"ఎందుకని? ఓకే... ఓకే. తర్వాత ఇస్తాను! అన్నట్లు ఇవాళ మీ పుట్టిన్రోజు కదూ! ముందు నన్ను గ్రీటింగ్స్ చెప్పనీండి! హాపీ బర్త్ డే టూ యూ... హాపీ బర్త్‌డే టూయూ... మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే టూ యూ"

కర్నల్‌కి తిక్క పూర్తిగా రేగిపోయింది. ముందు ఆ బర్త్‌డే స్లోగన్స్ కట్టించెయ్యకపోతే కోపంతో తనకి పిచ్చెక్కడం ఖాయమని అనుమానం వచ్చేసింది.

"స్టాప్ దిస్ నాన్సెన్స్" ఇల్లెగిరిపోయేలా అరచాడు.

"అలా అరవద్దని ఓసారి చెప్పాను గదండీ! నాకు గుండె దడ వస్తుంది. మీకిందాక చెప్పాను కదా– నేను సెవెన్త్‌క్లాస్ చదివేటప్పుడు మా హిందీ మాష్టారు...."

"అయ్ సే షటప్" పిస్టల్ కిటికీలోంచి గాలిలోకి పేలుస్తూ అన్నాడు.

అందరూ అదిరిపడ్డారు.

ధనుంజయ్ నిశ్శబ్దం అయిపోయాడు.

"నిజం చెప్పు! ఎవడివి నువ్వు?" అన్నాడు కర్నల్ పిస్టల్ అతని గుండెలకు గురిపెట్టి.

"అదేమిటి? చెప్పాను కదా! నేను రచయిత ధనుంజయ్‌ని" ఆశ్చర్యంగా అన్నాడతను.

"నాన్సెన్స్" మళ్ళీ అరిచాడు కర్నల్.

"ఏమిటి నాన్సెన్స్?"

"నువ్ చెప్పేదంతా నాన్సెన్స్"

"ఎందుకని?"

"రచయిత ధనుంజయ్ ఇదుగో వీడు" సింహాద్రిని చూపిస్తూ అన్నాడు కర్నల్.

"వ్వాట్?" అదిరిపడ్డాడు ధనుంజయ్.

"యస్! రచయిత ధనుంజయ్ వీడు"

"ఇంపాజిబుల్ ఇందులో మోసం ఉంది. రచయిత ధనుంజయ్‌ని నేను"

కర్నల్‌కి చిరాకు పుట్టుకొచ్చింది.

సర్వీస్ మొత్తంలో నాలుగు యుద్ధాల్లో పాల్గొన్నాడు గానీ ఎప్పుడూ ఇంతటి క్లిష్టమయిన పరిస్థితి రాలేదు.

"బేబీ" నెమ్మదిగా పిలిచాడాయన.

"యస్ డాడీ!"

"అసలీ ధనుంజయ్ పేరుగల రచయితలెంతమంది ఉన్నారు?"

"ఎందుకు డాడీ?"

"ఒక్కొక్కరినీ వెదికి కాల్చడంకంటే అందరినీ పోగుజేసి ఒకచోట వరుసగా నిలబెట్టి

కాల్చేస్తే బులెట్స్ వేస్ట్ కావుకదా! బైదిబై ఇప్పుడు బులెట్ ధరలు పెరిగిపోయాయ్. నీకు తెలుసా?"

"తెలీదు డాడీ! ఎంత పెరిగాయ్?"

"ఫిఫ్టీ పర్సెంట్! కెన్ యూ ఇమేజిన్?"

"మైగాడ్"

"స్టీప్ రైజ్" అన్నాడు చిరంజీవి.

కర్నల్ మెచ్చుకోలుగా చిరంజీవివేపు చూశాడు.

"ఎకానమీ ఈజ్ ది నీడ్ ఆఫ్ ది అవర్" అనానడు చిరంజీవి మరింత ఉత్సాహంగా.

"ఎగ్జాట్లీ" అన్నాడు కర్నల్.

శ్రీదేవి కోపంగా సింహాద్రి దగ్గరకు నడిచింది.

"ఎవర్నువ్వు?" అంది అనుమానంగా.

"నిజం చెప్పేస్తాను" అన్నాడు సింహాద్రి.

"రెండు నిమిషాలు టైమిస్తున్నాను" అన్నాడు కర్నల్.

"దేనికి?" అడిగాడు సింహాద్రి.

"ఇద్దరిలో ఎవరు ఒరిజినలో ప్రూవ్ చేసుకోడానికి"

"ఎలా ప్రూవ్ చేసుకోవడం?" భయంగా అడిగాడు ధనుంజయ్.

"అదంతా నాకు తెలీదు! ఇప్పుడు టైమ్ పన్నెండూ నలభై రెండు నిమిషాలు" అన్నాడు కర్నల్.

"ఒకవేళ ఇద్దరూ ప్రూవ్ చేసుకోలేకపోతే?" అడిగాడు చిరంజీవి.

"ఒకే బులెట్‌తో ఇద్దరి పనీ పూర్తవుతుంది! నిజానికి సేనదే జరగాలని కోరుకుంటున్నాను. బులెట్స్ ధర ఎంత పెరిగిపోయిందో నీకు చెప్పాను కదూ?"

"అవునండీ! ఫిఫ్టీ పర్సెంట్ రైజ్"

"కరెక్ట్! టైమ్ పన్నెండూ నలభై మూడు" అన్నాడు కల్నల్ టైమ్ చూసుకుని.

సింహాద్రికి చెమటలు పట్టేస్తున్నాయ్. ధనుంజయ్ పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. ఏ క్షణంలోనయినా స్పృహ తప్పేట్లున్నాడు.

"పన్నెండూ నలభై నాలుగు" అన్నాడు కర్నల్ పిస్టల్ పైకి తీస్తూ.

"ఓ మాగజైన్‌లో నా ఫోటో వుండాలి. చూస్తానుండండి' అంటూ తన బ్రీఫ్‌కేస్ తెరిచాడు ధనుంజయ్.

"శ్రీదేవిగారూ" నెమ్మదిగా మాట్లాడాడు సింహాద్రి.

"ఏమిటి?"

"నేను ధనుంజయ్‌ని కాదు"

"మైగాడ్"

"మైగాడ్ కూడా కాదండీ! నాపేరు సింహాద్రి"

"సింహాద్రా?" ఆశ్చర్యంగా అంది శ్రీదేవి.

"సింహాద్రా?" ఆశ్చర్యంగా అడిగాడు కర్నల్. "పేరెక్కడో విన్నట్లుందే" ఆలోచిస్తూ అన్నాడు.

"వినే వుంటారండీ! నా పేరు కూడా అదే" అన్నాడు సింహాద్రి.

"షటప్" అన్నాడు కర్నల్.

"మోసం! ఇంపరసొనేషన్" అంది శ్రీదేవి కోపంగా.

ధనుంజయ్‌కి పరిస్థితి అర్థమయిపోయింది.

తనకంటే ముందే మరొకడు తన పేరుతో శ్రీదేవి బర్త్‌డే పార్టీ కొచ్చి హోరాహోరీ యాక్షన్ చేసేస్తున్నాడన్న విషయం చాలా చిరాకు కలిగించింది.

"దిసీజ్ టెరిబుల్" అన్నాడు కర్నల్‌తో.

కర్నల్ శ్రీదేవి వేపు చూశాడు. శ్రీదేవి సింహాద్రి వేపు చూసింది. సింహాద్రి చిరంజీవి వేపు చూశాడు. చిరంజీవి కర్నల్‌వేపు చూశాడు.

"వెంటనే పోలీసులను పిలిపించండి" అన్నాడు ధనుంజయ్.

"పోలీసులా?" అడిగాడు చిరంజీవి.

"అవును"

"పోలీసులెందుకు?"

"ఎందుకేమిటి? ఇది చీటింగ్ కింద వస్తుంది. సెక్షన్ ఐ.సి.సి. 420"

"రాదు" అన్నాడు చిరంజీవి.

"రాదా?" కోపంగా అడిగాడు ధనుంజయ్

"ఏమాత్రం రాదు"

"ఎందుకని?"

"ఎందుకంటే ఇది చీటింగ్ కాదు కాబట్టి"

"నీకెలా తెలుసు?"

"నేను ఓ లాయరు ఇంటిపక్కన కొన్నాళ్లు అద్దెకున్నాను"

"ఆల్ రైట్ సెక్షనేదయినా కానీ! ముందు వాడిని అరెస్ట్ చేయాలి"

"నాట్ నెసెసరీ"

కర్నల్‌కి పిచ్చెక్కిపోతోంది.

"స్టాప్ దిస్ నాన్సెన్స్" అంటూ అరచాడు గట్టిగా.

ధనుంజయ్ అదిరిపడ్డాడు.

"మళ్ళీ మీరేనా అరచింది?" అన్నాడు గుండెలు చేత్తో పట్టుకుని కర్నల్ వంక చూస్తూ.

"అవును"

"మీకు చెప్పానుగదండీ అలా అరవగూడదని! చిన్నప్పుడు అంటే సెవెన్త్‌క్లాసులో మా హిందీ మాష్టారు నేను కాపీ కొడుతూండగా చూసి..."

'షటప్" మళ్ళీ పిస్టలు పైకి తీసి అరచాడు కర్నల్.

అంతా నిశ్శబ్దం అయిపోయింది.

కర్నల్ శ్రీదేవి వంక చూసాడు.

"ఏం బేబీ? పోలీసులను పిలిచి వీడిని అప్పగిద్దామంటావా?" సలహా అడిగాడు.

"ఏయ్ మిస్టర్" సింహాద్రి వంక చూస్తూ పిలిచింది శ్రీదేవి.

"ఏమిటండీ"

"ఎందుకీ నాటకమాడేవ్ నువ్వు?"

సింహాద్రి ఈ అవకాశం కోసమే చాలా సేపటినుంచీ ఎదుర్చూస్తుండడం వల్ల అడగగానే ఠకీమని అందుకున్నాడు.

"అసలు జరిగిందేమిటంటేనండీ. మీరు రాసిన లెటర్, పంపిన ఫోటో ధనుంజయ్ ఒరిజనలు అడ్రస్ ప్రకారం నాకు అంటే మా రూమ్‌కి వచ్చింది..."

"సైలెన్స్" సింహాద్రి వంక చూస్తూ అరచాడు కర్నల్.

"వీడికి పిచ్చెక్కినట్లు నాకు చాలా అనుమానంగా ఉంది" అన్నాడు శ్రీదేవితో.

"అబ్బే లేదండీ! యూ ఆర్ మిస్టేకన్" అన్నాడు చిరంజీవి.

"డోంటాక్ నాన్సెన్స్"

"సంగతేమిటంటే అదివరకు ఈ రచయిత ధనుంజయ్ ఉన్న ఇంట్లో సింహాద్రి అద్దెకు దిగాడండి! దిగాక శ్రీదేవిగారు ధనుంజయ్‌కి పంపిన ఫోటో వీడి చేతిలోపడిందంతే! ఆ ఫోటో చూసి శ్రీదేవిగారిని గాఢంగా ప్రేమించాడండీ! ఆమె ప్రేమను పొందడానికి వేరేమార్గం లేక ఇలా ధనుంజయ్‌గా యాక్షన్ చేశాడండీ'

"వ్వాట్? ఈ డెకాయిట్ మా బేబీని ప్రేమించాడా?"

"నేను డెకాయిట్ కాదండీ! క్రాఫ్ చెదిరిపోయింది. అంతే!"

"టు హెల్ విత్ యువర్ క్రాఫ్. నువ్వు మా బేబీని ప్రేమించావా?"

"అబ్బే. అది మిమ్మల్ని చూడకముందు సంగతండి"

ధనుంజయ్ ఇంక ఆలస్యం చేయలేకపోయాడు.

"ఇంకా చూస్తారేమిటి? ముందు అర్జంటుగా పోలీసులకు ఫోన్ చేయండి! మీ ఇట్లో ఫోన్ లేదూ?" కల్నల్ నడిగాడతను.

కర్నల్‌కి ఆ ప్రశ్నతో వళ్ళు మండిపోయింది.

"మిస్టర్! నువ్ మేడమీదకు పద ముందు" అన్నాడు కర్కశంగా.

"నేనా?"

"అవును?"

"ఎందుకు?"

"నిన్ను ఇక్కడ షూట్ చేస్తే ఫర్నిచర్ పాడవుతుంది"

"వ్వాట్?" అదిరిపడ్డాడు ధనుంజయ్ "నన్ను షూట్ చేస్తారా?"

"అవును!"

"నేనెవరనుకుంటున్నారు? ప్రఖ్యాత రచయిత ధనుంజయ్‌ని."

'అందుకే షూట్‌చేయడం. బై దిబై నీకు ఏదంటే ఇష్టం? పిస్టలా, రివాల్వరా, త్రీనాట్ త్రీ రైఫిలా? దేంతో కాల్చమంటావో నువ్వే చెప్పు. ఛాయిస్ నీకే ఇస్తున్నా..."

"ఇదన్యాయం! నన్నెందుకు కాలుస్తున్నారు?"

"లేపోతే హిప్నాటిజం మీద నవలలు రాసి మా శ్రీదేవి బ్రెన్ పొల్యూట్ చేసేస్తావా?"

"అందులో తప్పేముంది? అయ్ లైక్ హిప్నాటిజం! అయ్ లవ్ హిప్నాటిజం! అయ్ ఎడోర్‌హిప్నాటిజం! అండ్ అయ్ ప్రాక్టీస్ హిప్నాటిజం'

"హిప్నాటిజం- గిప్నాటిజం అంతా ట్రాష్" అరచాడు కల్నల్.

"అవునండీ! అంతా ట్రాష్" అన్నాడు చిరంజీవి.

"బోగస్" అన్నాడు కర్నల్.

"రబ్బిష్" అన్నాడు చిరంజీవి.

"నేనొప్పుకోను" అన్నాడు ధనుంజయ్.

కర్నల్‌కి అప్పటికప్పుడే అతనిని కాల్చిపారేద్దామన్నంత కోపం వచ్చింది. పిస్టల్ పైకితీశాడు గానీ పెరిగిపోయిన బులెట్స్ ధర గుర్తుకొచ్చేసిరికి కొంచెం తగ్గాడు. ఇలా ఎవరికి వారిని విడివిడిగా కాలుస్తూ కూర్చుంటే బులెట్స్ ఖర్చు తడిసి మోపెడవుతుంది.

"అయితే నన్ను అర్జంటుగా హిప్నటైజ్ చెయ్యి చూద్దాం" అతని దగ్గరగా నడుస్తూ అన్నాడు కర్నల్.

"ఇప్పుడా?"

"ఈ క్షణంలో"

"ఆల్ రైట్" ఉత్సాహంగా అన్నాడు ధనుంజయ్.

"ఇప్పుడే స్టార్ట్ చేస్తాను. మీరు నా వంకే చూస్తూండండి" అన్నాడు అతని కళ్ళల్లోకి చూస్తూ."

"చూస్తున్నాను" అన్నాడు కర్నల్.

"నాకళ్ళలోకే చూడండి"

"చూస్తున్నాను"

"మీరు నావంకే చూస్తున్నారు మీరు నావంకే చూస్తున్నారు మీరు నావంకే చూస్తున్నారు" అన్నాడు ధనుంజయ్ కర్నల్ కళ్ళలోకి గుచ్చిగుచ్చి చూస్తూ.

"అవును చూస్తున్నాను. ఇందాకే చెప్పానుగా ఆ విషయం?" చిరాగ్గా అన్నాడు కర్నల్.

"మీరు నిద్రపోతున్నారు- నిద్రపోతున్నారు- నిద్రపోతున్నారు" తిరిగి అన్నాడతను.

"ఏడ్చావ్! నేను మేలుకునే ఉన్నాను" అన్నాడు కర్నల్ కోపంగా.

"మేలుకునే ఉన్నారా?" ఆశ్చర్యంగా అడిగాడు ధనుంజయ్.

"అవును!

"కొంచెం కూడా నిద్రపట్టటం లేదా?"

"అరవీసం కూడా లేదు"

"పోనీ మగతగా ఉన్నట్లనిపిస్తోందా?"

"రవ్వంత కూడా అనిపించటం లేదు"

"అయ్‌సీ" అన్నాడు ధనుంజయ్!"

అతనికి ఎక్కడలేని చిరాకూ పుట్టుకొచ్చింది. తను చాలామందిని హిప్నటైజ్ చేశాఆడుగానీ ఎక్కడా ఇలా దెబ్బతినలేదు. కిక్కురుమనకుండా హిప్నటైజ్ అయిపోయి చెప్పిన పనల్లా చేసేవాళ్ళు.

"ఆల్ రైట్" అన్నాడు ధనుంజయ్. అని మరింత తీక్షనంగా కర్నల్ కళ్ళల్లోకి చూస్తూ "మీరు కళ్ళుమూసుకున్నారు.. కళ్ళు మూసుకున్నారు.... కళ్ళు మూసుకున్నారు?" అన్నాడు.

"మూసుకోలేదు. తెరచే ఉన్నాను. కనబడ్డంలా?" అడిగాడు కర్నల్.

"ఎందుకని మూసుకోలేదు?"

"ఎందుకు మూసుకోవాలి?"

"ఇలా మీరు ఎదురుప్రశ్నలేయకూడదు" అన్నాడు ధనుంజయ్ ఉక్రోషంగా.

"నాయిష్టం! నేను వేస్తాను"

"అలా మీరు ఎదురుతిరగ్గూడదసలు"

"నాయిష్టం! నేను తిరుగుతాను"

ధనుంజయ్‌కి కోపం వచ్చింది కాని అణిచేసుకున్నాడు.

"ఆల్ రైట్! ఇంకోసారి ట్రై చేస్తాను" అన్నాడు.

"మీరు నిద్రపోతున్నారు- నిద్రపోతున్నారు - నిద్రపోతున్నారు"

"పిచ్చివాగుడు వాగకు! నేనేం నిద్రపోవటంలేదు"

"అలా అయితే ఇంపాజిబుల్" అన్నాడు ధనుంజయ్.

"ఏమిటి ఇంపాజిబుల్?"

"మిమ్మల్ని హిప్నటైజ్ చేయడం సాధ్యంకాదు!"

"ఏం.. ఎందుకని?"

"హిప్నాటిజంకి లొంగనివాళ్ళు చాలామంది వుంటారు. అందులో మీరొకరు"

"ఎందుకని లొంగరు వాళ్ళు?"

"అదంతేనండీ! దటీజ్ సైంటిఫిక్ లా"

"ఆల్ ట్రాష్" అరచాడతను.

"ట్రాష్ కాదు"

"ట్రాష్ కాకపోతే రబ్బిష్! అదీగాకపోతే యింకోటి"

"ఆల్ రైట్! మీ యిష్టం. ఎవరి అభిప్రాయం వాళ్ళది"

"అవునా. అందుకే నిన్ను మేడమీదకు రమ్మనేది"

"మేడ మీదకెందుకు? నా నవల మీద మీ అభిప్రాయం చెప్పండి చాలు- దేర్ ఎండ్స్ ది మేటర్!"

"నా అభిప్రాయం కూడా అదే! నిన్ను మేడమీదకు తీసుకెళ్ళి కాల్చటం"

"అయితే మేము యింక వెళ్ళిపోవచ్చు కదండీ?" అడిగాడు సింహాద్రి.

"మీరెక్కడికి?"

"మా ఊరికండీ"

"పోలీసులు రాందే ఎట్లా వెళ్తారు. నోనో యిక్కడి నుంచి కదలడానికి వీల్లేదు" అంటూ ఫోన్ తీసి డయల్ చేశాడు. "హలో పోలీస్! అర్జంటుగా బాంబ్ నిలయానికిరండి. యిక్కడ యిద్దరు పిచ్చివాళ్ళున్నారు"

సింహాద్రి దిగులుపడిపోయాడు.

"మమ్మల్ని క్షమించండి సార్. రచయిత వేషాల్లో యింత రిస్క్ వుంటుందని తెలీదు. తెలుస్తే వేసేవాళ్ళం కాదు ఇంకోటేదేనా సెలక్ట్ చేసుకునేవాళ్ళం" అన్నాడు దీనంగా.

"షటప్"

సరిగ్గా అప్పుడే డోర్ తెరచుకొని లోపలికొచ్చాడు విశ్వనాథం. అతని వెనుకే భావయ్య.

సింహాద్రీ, చిరంజీవి ఇద్దరూ ఖంగారు పడిపోయారు.

"ఇప్పుడేమంటావురా! పిచ్చివున్నట్లు యాక్షన్ చేస్తావా? చెయ్‌రా! చెయ్! యిదిగో భావయ్య ఎవరో తెలుసా? మేజిస్ట్రేట్! నీకు నిజంగానే పిచ్చివుందని సర్టిఫికెట్ యివ్వడానికి వచ్చాడు."

కర్నల్‌కి సహనం పూర్తిగా చచ్చిపోయింది.

ముక్కూ మొఖం, అడ్రసూ తెలీని జనం అంతా ఇష్టమొచ్చినట్లు నటించడానికీ, వాగడానికీ తన ఇంటినే ఎందుకు ఎన్నుకుంటున్నారో ఏమాత్రం అర్థం కావడం లేదు. తనిలా ఊరుకుంటే కాసేపట్లో ఇలాంటి పిచ్చివాళ్ళతో ఇల్లు నిండిపోయి "హౌస్‌ఫుల్" బోర్డ్ పెట్టాల్సి వస్తుంది.

"హూ ఆర్ యూ?" అన్నాడతను విశ్వనాథం వేపు చూసి.

"నువ్వెవరు?" అన్నాడు విశ్వనాథం ఎదురుతిరిగి.

దాంతో కర్నల్ కోపం బోర్డర్స్ దాటేసింది.

"బ్లడీఫూల్! నా ఇంట్లో పర్మిషన్ లేకుండా జొరపడింది కాకుండా, "నువ్వెవరు" అని నన్నే అడుగుతావా? గెటవుట్"

భావయ్య కంగారుపడ్డాడు.

"ఏమి విశ్వనాథం! నిండా తప్పు సేస్తివి. "సారీ" సెప్పు పెద్దసార్ వాడికి" అన్నాడు.

"ఎందుకు చెప్పాలి? నేను చెప్పను"

"చెప్పకపోతే బయటకు నడవండి! లేకపోతే గెంటాల్సివస్తుంది"

విశ్వనాథం అదేమీ వినిపించుకోలేదు.

"ఇప్పుడు మా సింహాద్రి కండిషన్ చూశారుగా! త్వరగా సర్టిఫికెట్ రాయండి" అన్నాడు భావయ్యతో.

"వాట్ సర్టిఫికెట్?" అరచాడు కర్నల్.

"ఆ సింహాద్రికిదా సైకలాజికల్ కండిషన్ చాలా ప్రమాదంలో ఉండాది. అదిదా సర్టిఫికెట్ ఇస్తుండాను"

అని భావయ్య అక్కడే సోఫాలో కూర్చుని సర్టిఫికెట్ రాయడం ప్రారంభించాడు.

"దిసీజ్ టు సర్టిఫై...."

"గెటప్" అన్నాడు కర్నల్ తన పిస్టల్ భావయ్యకు గురిపెట్టి.

అది చూడగానే భావయ్య పెన్ను, పుస్తకం క్రిందపడి పోయినయ్.

"వ్వా వ్వా వ్వా వ్వా...." అన్నాడు లేచి నిలబడి.

"ఇద్దరూ బయటకు నడవండి"

విశ్వనాథం ఇలా లాభంలేదని కర్నల్‌ని బతిమాలాడు.

"ఒక్క సర్టిఫికెట్ రాయనీండి సార్"

"వాట్? సర్టిఫికెట్ ఎందుకు?"

"వీడికి పిచ్చి ఉందని" అన్నాడు సింహాద్రిని చూపిస్తూ.

"ఉంటే సర్టిఫికెట్ ఎందుకు?"

"ఆ సర్టిఫికెట్ ఉంటే వాడి చేతికి ఆస్తి ఇవ్వాల్సిన అవసరం ఉండదు"

"ఆస్తా? ఆస్తేమిటి?"

ఆ మాటతో సింహాద్రి అదిరిపోయాడు. చిరంజీవి వంక కంగారుగా చూశాడు.

"ఆ సర్టిఫికెట్ చెల్లదు" అన్నాడు చిరంజీవి గంభీరంగా.

"ఎందుకు చెల్లదు?"

"ఎందుకంటే ఆ సర్టిఫికెట్ ఇచ్చే వాళ్ళ మానసిక పరిస్థితి బాగుండాలి కనుక!"

"అంటే నాకు పిచ్చి ఉండాదంటావా?" కోపంగా అన్నాడు భావయ్య.

"అవును! లేకపోతే వీడికి పిచ్చి ఉందని సర్టిఫికెట్ ఇస్తారా ఎవరయినా?"

"ఏమయ్యా ఏమిటి సెప్తావు? నువ్వే వాడికి పిచ్చి ఉండాదని అన్నావు" అన్నాడు భావయ్య.

"డాడీ! ఆ రోజు ఇతనినే సింహాద్రి హిప్నటైజ్ చేసి రన్నింగ్ రేస్ పెట్టాడు" అంది శ్రీదేవి.

కల్నల్ ఆశ్చర్యపోయాడు.

"రన్నింగ్ రేపా?"

"అవును డాడీ"

"రన్నింగ్ రేసేమిటి?"

"ఈయనా, సింహాద్రీ, చిరంజీవిగారూ, కుక్కా..."

"కుక్కా?"

"యస్– ఎ కంట్రీడాగ్"

"కంట్రీ డాగ్ రన్నింగ్ రేస్ చేస్తుందా?"

"చేసింది డాడీ"

"ఇక్కడేమయినా కుక్కలున్నాయా" కుక్క విషయం గుర్తురాగానే భయంగా అడిగాడు విశ్వనాథం.

"ఎందుకు? రేస్ స్టార్ట్ చేస్తావా?" అడిగాడు కర్నల్.

"భావయ్యగారూ! ముందు మీరు సర్టిఫికెట్ రాయండి" అన్నాడు విశ్వనాథం.

"విట్‌నెస్ ఎవరుంటారు?"

"ఎవరో ఒకరుంటారు. ముందు రాయండి"

"ఆయన వద్దంటున్నాడుగా?" అన్నాడు భావయ్య కర్నల్‌ని చూపుతూ.

"సార్! కొంచెం రాయనీండి!" ఇది ఇలా అర్జంట్"

"వాట్ అర్జంట్?"

"సర్టిఫికెట్ అర్జంట్"

"వాట్ సర్టిఫికెట్?"

"వీడికి పిచ్చి ఉందని"

"నా యిల్లు అడ్డమైన రాస్కెల్స్ సర్టిఫికెట్లు రాసుకునే సత్రం కాదు. గెటవుట్! రెండు నిమిషాల్లో కాంపౌండ్ బయట ఉండాలి! లేపోతే ఇద్దరూ అవుట్. ఇప్పుడు టైమ్ ఒంటిగంటా ఇరవై రెండు నిమిషాలయింది" అన్నాడు కర్నల్ టైమ్ చూసుకుంటూ.

"సరే పదండి! బయట రోడ్డుమీద కూర్చుని రాసుకుందాం" అన్నాడు విశ్వనాథం.

"ఏమయ్యా! ఏమిటయ్యా సెప్తావు? మేజిస్ట్రేట్‌ని రోడ్డు మీద సర్టిఫికెట్లు రాస్తునా? నిండా బుద్ధిలేదేమి నీకు?"

"ఫరవాలేదండీ ఈ ఒక్కసారికీ"

"ఇంటిగంటా ఇరవై మూడు" అన్నాడు కర్నల్.

"అప్పుడే ఒక నిమిషం అయిపోయిందప్పా" గాబరాగా అన్నాడు భావయ్య. ఇంతలో హడావుడిగా నలుగురు కానిస్టేబుల్స్, ఓ సబిన్‌స్పెక్టర్ వచ్చేశారు లోపలికి.

"గుడ్ మార్నింగ్" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"గుడ్ మార్నింగ్" అన్నాడు కర్నల్.

"ఎవరు పిచ్చివాళ్ళు ఇందులో"

"వీళ్ళిద్దరూ" అన్నాడు కర్నల్ విశ్వనాథాన్ని, భావయ్యను చూపుతూ– ముందు వాళ్ళ పీడ వదిలించుకోవాలిని చాలా కోరిక కలగిందతనికి. ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

"మేమా?" అన్నాడు విశ్వనాథం.

"ఏమయ్యా సెప్తావు మేము పిచ్చివాళ్లమా?" అన్నాడు భావయ్య.

ఇన్‌స్పెక్టర్ కానిస్టేబుల్స్‌కి సైగ చేశాడు.

వాళ్ళు ఇద్దరినీ రెక్కలు విరిచిపట్టుకుని బయటికి ఈడ్వటం మొదలు పెట్టారు.

"ఏమయ్యా ఏమి సేస్తారు? నేనుదా పిచ్చివాడినా? మేజిస్ట్రేటునయ్యా"

"అందరూ ఇలాగే చెప్తార్లే. నడు నడు" అన్నాడు కానిస్టేబుల్.

"అదేమయ్యా అట్లాఅంటావు? రియల్ మేజిస్ట్రేట్‌ని"

"అందుకే పద. అక్కడ కేసులు చూద్దాగాని"

"నిజంగానండీ! మేము పిచ్చివాళ్ళం కాదు" అన్నాడు విశ్వనాథం.

"కాపోతే మరీ ఇంటికెందుకొచ్చారు?"

"ఇదిగో ఈ న్యూస్ పేపర్లో ఈ అమ్మాయి ఫోటో వేసి ఇవాళ బర్త్‌డే అని రాశారుదానే. తప్పక మా సింహాద్రి ఇక్కడ ఉంటాడని వచ్చాం"

"మీ సింహాద్రా? ఎవరతను?"

"అదుగో అతను"

"అతను నీకేమవుతాడు?"

"నాకు వరుసకు మేనల్లుడు"

"వాట్ మిస్టర్! వీడు చెప్పేది నిజమేనా?" సింహాద్రి నడిగాడు ఇన్‌స్పెక్టర్.

"అంతా అబద్ధమండీ! అసలింతవరకూ నేనాయన మొఖమే చూడలేదు" ఇన్‌స్పెక్టర్ విశ్వనాథం వంక చూశాడు.

"ఒరేయ్ సింహాద్రీ! ఏమన్నావురా! నేనెవరో తెలీదా నీకు?" కోపంగా అరచాడు విశ్వనాథం.

"పాపం! సివియర్ మెంటల్‌షాక్ తగిలి ఉంటుంది. అందరినీ మేనళ్ళుళ్ళు అనుకుంటున్నాడు" అన్నాడు చిరంజీవి.

ఇన్‌స్పెక్టర్ ఇంకొక్క మాట కూడా మాట్లాడకుండా వాళ్ళిద్దరినీ ఈడ్పించుకుంటూ బయటికెళ్ళిపోయాడు.

కర్నల్ తేలిగ్గా గాలి పీల్చుకున్నాడు.

"మీకో విషయం అర్జంటుగా మనవి చేయాలని అనుకుంటున్నామండీ" అన్నాడు చిరంజీవి కర్నల్‌తో.

"ఏమిటది?"

"వీడు ప్రస్తుతం ఓ నవల రాస్తున్నాడండీ"

"అదేమిటి? వీడసలు రచయిత కాదుగా?"

"కాపోయినా సరే! రాస్తున్నాడండీ"

కర్నల్‌కి ఆశ్చర్యంగా ఉంది.

"హౌ ఇటీజ్ పాజిబుల్? రచయిత కాన్దే ఎలా రాస్తారు?"

"దాన్దేముందిసార్! రచయితలు కూడా మొదటి నవల రాసేముందు మామూలు మనుషులే కదండీ"

కర్నల్ ఆలోచించాడు.

"అఫ్ కోర్స్! వాళ్ళూ మనుష్యజాతికి చెందినవారే! కరెక్ట్! అయితే ఇప్పుడేమంటావ్?"

"వీడు రాయబోయే నవల్లో ఈ హిప్నాటిజం గిప్నాటిజం, మంత్రాలూ, మాయలూ, అంతా ట్రాష్ అని మెసేజ్ ఇస్తున్నాడండీ"

"అవునండీ! ఆ నవల మీకే అంకితం ఇవ్వాలని కూడా అనుకుంటున్నానండీ" తనూ అందుకుంటూ అన్నాడు సింహాద్రి.

కర్నల్ మెత్తబడ్డాడు.

"ఓకే! మీ విషయం తర్వాత ఆలోచిస్తాను. మిస్టర్ ధనుంజయ్... మేడమీదకు పద! అన్నట్లు బేబీ! నేను వీడిని రెండు నిమిషాల్లో కాల్చేసి కిందకొస్తాను. ఈలోగా నా జోక్ బుక్ రడీగా ఉంచు! ఇలాంటివాళ్ళను కాల్చినప్పుడు ఓ జోక్ చదువుతేగాని మూడ్ రాదు మళ్ళీ"

ధనుంజయ్ భయపడిపోయాడు.

"బాబోయ్! ఇంకెప్పుడూ నవలలు రాయను. నన్నొదిలేయండి"

ఈలోగా శ్రీదేవి ఆలోచనల్లోనుంచి బయటపడింది.

"డాడీ"

"యస్ బేబీ"

"నేను సింహాద్రిని మారేజ్ చేసుకుంటాను డాడీ"

"వాట్... ఈ డెకాయిట్‌నా?"

సింహాద్రికి ఆ కొటేషన్ నచ్చలేదు.

"నేను డెకాయిట్ కాదండీ! జర్నీలో క్రాఫ్ చెదిరిపోవడం వల్ల అలా కనబడుతున్నాను. అద్దం, దువ్వెనా ఇప్పిస్తే...."

"షటప్" అరచాడు కర్నల్. "ఇలాంటి దొంగవేషాలేసే వాడిని పెళ్ళి చేసుకుంటావా బేబీ!" ఆశ్చర్యంగా అడిగాడు కర్నల్.

"అది వాడి ప్రొఫెషన్ కాదండీ! జస్ట్ పార్ట్ టైం, ఒరిజినల్‌గా వాడు బిజిలీ అండ్ బిజిలీ కంపెనీలో ఎకౌంటెంట్ అన్నాడు చిరంజీవి.

"ఇలాంటివాడిని ఎకౌంటెంట్‌గా పెట్టుకుని ఆ కంపెనీ ఎలా మూతపడలేదో నాకర్థం కావటం లేదు" అన్నాడు కర్నల్.

"ఇందులో అర్థం కాపోడానికేముందండీ! వీడు ఎక్కువగా అబ్సెంట్ అవుతాంటాడు కదా?"

కర్నల్‌కి అర్థమయింది.

"దట్ మస్ట్‌బీ ది రీజన్" అన్నాడు తలపంకిస్తూ.

"అవునండీ! దటీజ్ ఓన్లీ ది రీజన్" అన్నాడు చిరంజీవి.

"అయినాగాని ఆఫ్టరాల్ ఓ బిజిలీ అండ్ బిజిలీ కంపెనీ ఎకౌంటెంట్‌ని నువ్వు పెళ్ళి చేసుకోవడం నాకిష్టం లేదు" అంతలోనే తేరుకొని నిష్కర్షగా చెప్పేశాడు కర్నల్.

సింహాద్రి నీరు కారిపోవాలనుకున్నాడు గానీ, అలా నీరు కారిపోతే ఫారిన్ తివాచీ తడచిపోవటం, దానివల్ల కల్నల్‌కి మళ్ళీ తిక్కరేగి పిస్టల్‌ని తనవేపు తిప్పడం జరుగుంతదని ఆగిపోయాడు.

"కాని డాడీ.. అతనికింకా మంచి ఉద్యోగం దొరుకుతుందేమో కదా" అంది శ్రీదేవి సర్ది చెప్పడానికి ప్రయత్నిస్తూ.

"ఆ! అవునండీ! మా ఫ్రెండ్ ఒకడు ఇలాగే అప్పడాల కంపెనీలో పద్దులు రాసే వాడండీ! అలాంటి వాడు సడెన్‌గా అయ్.ఏ.యస్.కి సెలక్టయిపోయాడు. అంచేత మనం ఎవరి భవిష్యత్తు ఎలా వుంటుందో చెప్పలేమండీ" అన్నాడు చిరంజీవి.

"ట్రాష్" అరచాడు కర్నల్ "నేన్నమ్మను"

"మొదట్లో నేనూ నమ్మలేదండీ! కానీ వాడు ఆర్డర్స్ తీసుకొచ్చి నాకు చూపించి ఏడ్చాడండీ!"

"ఏడ్చాడా?

"అవును..."

"ఏడవటం ఎందుకు?"

"ఆనందం పట్టలేకండీ"

"అయ్‌సీ!"

"అవునండీ!"

"వాడి పేరేమిటి?"

"పేరా పేరూ.... ఛిస్పే లపాడియా"

"ఎక్కడ వర్క్ చేస్తున్నాడో చెప్పు. నువ్వు చెప్పేది నిజమో కాదో ఇప్పుడే తేల్చుకుంటాను" అన్నాడు కర్నల్ రిసీవర్ చేతిలోకి తీసుకుంటూ.

చిరంజీవి కంగారుపడ్డాడు.

"అబ్బే వాడిప్పుడు ఎక్కడా పని చేయటం లేదండీ!"

"ఏం ఎందుకని?" అనుమానం ఎక్కువయిపోయింది కర్నల్‌కి.

"ఎందుకంటేనండీ- పాపం వాడు చచ్చిపోయాడు."

"వ్వాట్? చచ్చిపోయాడా?"

"అవున్సార్. పూర్ ఫెలో! ఆర్డర్స్ తీసుకుని రైల్లో మసూరీ వెళ్తుంటే ఆ రైలుకి

ప్రమాదం జరిగి చచ్చిపోయాడు" కన్నీళ్ళు తుడుచుకుంటూ అన్నాడు చిరంజీవి.

"పోతేపోనీ! స్టిల్ అందరూ ఛిస్పే కపాడియాలు కాలేరు! దిసీజ్ మై ఒపినియన్" అన్నాడు కర్నల్.

"అఫ్‌కోర్స్- అఫ్‌కోర్స్" అన్నాడు చిరంజీవి ఇంకేమనాలో తెలీక.

"అందులోనూ ఇలాంటి డెకాయిట్స్ ఛస్తే ఐఏఎస్‌కి సెలక్ట్ కాలేరు. నేను రాసిస్తానలా అని"

"అబ్బే! రాయనవసరంలేదండీ! మా మాట మీద నాకు చాలా గురి"

"అవున్సార్! మీ మాటంటే నాకూ గౌరవం!" అన్నాడు సింహాద్రి.

శ్రీదేవికి వుక్రోషం ముంచుకొచ్చింది. తండ్రిని ఎలా కన్విన్స్ చేయాలో ఏమాత్రం అర్థం కావటం లేదు.

"కాని డాడీ అతనికి వాళ్ళ కంపెనీలోనే ప్రమోషన్ వచ్చి మేనేజర్ అయిపోవచ్చు కదా!" అంది మరో పాయింట్ పట్టుకుని.

చిరంజీవి ఠక్కున అందుకున్నాడు.

"అవునండీ! మీకు చెప్పటం మర్చిపోయాను. వీడు ఏ క్షణాన్నయినా మేనేజర్ అయిపోవచ్చు"

"ఎలా అవుతాడు? యింత పనికిరానివాళ్ళు ఎక్కడయినా మేనేజర్లు అవుతారా?"

"అందరి సంగతీ నాకు తెలీదుగానండీ, వీడు డెఫినెట్‌గా అవుతాడు-"

"ఎందుకని?"

"ఎందుకనంటే- ఎందుకనంటే- ఆ! వీళ్ళ కంపెనీని మన ప్రభుత్వం తీసేసుకుంటోంది-"

"తీసుకుంటే?"

"ప్రభుత్వం రంగ సంస్థల గురించి మీకు తెలిందేముంది సార్! వాటిల్లో పెద్ద హోదా గల ఉద్యోగాలన్నీ ఎందుకూ పనికిరాని వాళ్ళకేగా యిస్తారు?"

"అఫ్‌కోర్స్- అఫ్‌కోర్స్"అన్నాడు కర్నల్. అతనికి చిరంజీవి మాటల్లో చాలా నిజం కనిపించింది.

"స్టిల్ అయ్‌డోంట్ డైజెస్ట్..." అంటూ సింహాద్రిని చూసి ఏదో చెప్పబోయాడు. శ్రీదేవి చప్పున అడ్డుపడింది.

"డాడీ! ఇంకేమీ చెప్పకండి డాడీ! ప్లీజ్-" అంది బ్రతిమాలుతూ. కర్నల్‌కి శ్రీదేవిని చూస్తే జాలేసింది.

"నువ్ బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నావా బేబీ?" అడిగాడు అనుమానంగా.

"అవును డాడీ! పాపం అతను నన్ను ఎంతగానో ప్రేమించబట్టేగదా ఇంత రిస్క్ తీసుకుని యిన్ని వేషాలేశాడు?" అందామె కారణం చెప్పేస్తూ.

"అఫ్‌కోర్స్- అందులో పాయింటుంది!" వప్పుకున్నాడు కర్నల్.

"అయితే ఇంక లైన్ క్లియరే కదండీ?" అడిగాడు చిరంజీవి.

"కానీ..." డౌటుగా అన్నాడు కర్నల్.

"అబ్బా- ఇంకేమిటి డాడీ మళ్ళీ-" గారంగా అంది శ్రీదేవి.

"ఆఫ్టరాల్- మూడొందల యాభయ్ రూపాయలు తెచ్చుకునే ఎకౌంటెంట్ నీకేం సుఖం యివ్వగలడమ్మా? ఒకపూటే తింది, ఒక కాలికే చెప్పు కొంటాడు-"

"నా జీతం మూడొందల యాభయ్ కాదు- మూడొందల అరవై-" ఉక్రోషంగా అరచాడు సింహాద్రి.

సరిగ్గా అప్పుడే చిరంజీవి "అహ్హహ్హహ్హ" అంటూ విలన్లా నవ్వాడు. కర్నల్‌కి వళ్ళు మండిపోయింది.

"ఎందుకలా నవ్వావ్?" అడిగాడు కోపంగా.

"మీరు సింహాద్రిని అండర్ ఎస్టిమేట్ చేశారు-"

"అంటే?"

"అసలు వాడెవరనుకుంటున్నారు మీరు?" ఫోజుతో అడిగాడు.

"అంటే వీడి అసలు పేరు సింహాద్రి కూడా కాదా?" పిస్టల్ మళ్ళీ చేతిలోకి తీసుకుంటూ అడిగాడు కర్నల్.

"అబ్బే పేరు సింహాద్రేలెండి! అందులో మార్పేమీలేదు. కానీ వీడి ఫైనాన్షియల్ స్టేటస్ మీకు తెలీదింకా! వీడు లక్షాధికారండీ! వీడి పేర లక్షల ఆస్తి వుంది-"

"ట్రాష్" అరచాడు కర్నల్.

"ట్రాష్ కాదండీ! వీడికి పాతికేళ్ళు వచ్చేవరకూ వీడి ఆస్తికి వీళ్ళ మావయ్య ట్రస్టీ అండీ. వీడి ఆస్తి వీడికి రావటానికి ఇంకొక్క సంవత్సరం గడవాలండీ!"

"ఇది మరీ ట్రాష్. నేనస్సలు నమ్మను-"

"తప్పకుండా నమ్మి తీరతారు సార్! ఇంతకుముందు మీరు పోలీసులకు పట్టిచ్చిన వాళ్ళల్లో ఒకతను "నేను సింహాద్రి మావయ్యను" అన్నాడు చూడండి. అతను నిజంగా సింహాద్రి మావయ్యే సార్!"

కర్నల్‌కి వాళ్ళిద్దరూ తనెదురుగ్గా మాట్లాడిన మాటలన్నీ గుర్తుకొచ్చాయ్.

"మరి అతనిని సింహాద్రి యింవతరకూ ఎప్పుడూ చూడలేదన్నాడుగా?"

"అలా అనకపోతే వీళ్ళ మావయ్య ఆ మేజిస్ట్రేట్‌తో సింహాద్రి పిచ్చివాడని సర్టిఫికెట్

రాయిస్తాడండీ–"

"ఎందుకా సర్టిఫికెట్టు?"

"ఎందుకంటేనండీ! వాడసలు వీడికి ఒరిజనల్ మామయ్య కాదన్నమాటండీ! కజిన్ మావయ్య. అందుకని వీడికి పిచ్చి అని సర్టిఫికెట్ రాయించి ఆస్తంతా తను కొట్టెయ్యాలని ప్లాన్ వేశాడండీ"

"అయ్‌సీ" అన్నాడు కర్నల్.

"మరింక ఓకే కదండీ?" అడిగాడు సింహాద్రి. కర్నల్ సింహాద్రివేపు చూశాడు. సింహాద్రి శ్రీదేవి వేపు చూశాడు. శ్రీదేవి కర్నల్ వేపు చూసింది.

"ప్లీజ్ డాడీ! కాదనకండి"

"ఆల్‌రైట్!" అన్నాడు కర్నల్.

అందరి మొఖాలు వెలిగిపోయాయ్!

"అలాగయితే బర్త్‌డేతోపాటు దండలు మార్చుకునే కార్యక్రమం కూడా సాయంత్రమే కానిచ్చేస్తే సరిపోతుంది. ఏమంటావోయ్ చిరంజీవి?"

"చాలా సూపర్బ్ ఆలోచినండీ! వాళ్లిద్దరూ ఈడూ జోడూ చాలా బాగుంటారు" అన్నాడు చిరంజీవి.

తనూ ఏదొకటి కల్పించుకుని మాట్లాడితే తనను షూట్ చేసే విషయం మర్చిపోతాడేమో అని ఆశ పుట్టింది ధనుంజయ్‌కి.

"అవునండీ! చిలకా గోరింకల్లా ఉంటారు" అన్నాడు మధ్యలో జొరబడి.

కల్నల్‌కు ఠక్కున పంజరం, అందులో మాయమయిన చిలుకలు గుర్తు కొచ్చినయ్.

"అయితే అది నీ పనేనన్నమాట" పిస్టల్ ధనుంజయ్‌కి గురిపెడుతూ అన్నాడు.

"ఏ పనండీ?" భయంగా అడిగాడు ధనుంజయ్.

"అదే! పంజరం తలుపు తీసి నా చిలకలను వదిలేసింది నువ్వే కదూ?"

"నాకదేం తెలీదండీ" అన్నాడు గాబరాగా.

"తెలీందే చిలకాగోరింకా" అంటూ ఎందుకన్నావ్?"

"మామూలుగా అన్నానండీ"

"ఐ డోంట్ బిలీవ్"

"డాడీ!" గారంగా అంది శ్రీదేవి.

"యస్ బేబీ!"

"పార్టీకి టైమవుతోంది"

కర్నల్ టైమ్ చూసుకున్నాడు.

"మైగాడ్! అర్జంట్‌గా నేను మార్కెట్ కెళ్ళాలి. ఎలా?"

"వెంటనే జీప్‌లో వెళ్దామండీ" అన్నాడు చిరంజీవి.

"మరి ఈ ధనుంజయ్‌ని షూట్ చేయడం?"

"అది ప్రస్తుతానికి పోస్ట్‌పోన్ చేద్దాం సార్"

కర్నల్ ఓ క్షణం ఆలోచించాడు.

"ఓకే! ఎగ్రీడ్! చూడవోయ్ చిరంజీవీ! బర్త్‌డే ఎరేంజ్‌మెంట్స్ అన్నీ నువ్వే చేసెయ్. పెళ్ళి ఎరేంజ్‌మెంట్స్ నేను చూస్తాను. నీకు హెల్పర్‌గా ఇదిగో ఈ ధనుంజయ్‌ను తీసుకో! అండర్‌స్టాండ్?"

"అండర్‌స్టాండ్ సార్"

"అదీగాక ఆ పంజరంలో నుంచి వదిలేసిన నా చిలకలన్నీ తిరిగి తెచ్చిచ్చే వరకూ వీడిని కాల్చగూడదు మనం"

"అవున్సార్"

"ఆ పని కూడా నువ్వే దగ్గరుండి చేయించు"

"ఆల్ రైట్ సర్"

కర్నల్ సంతృప్తిగా చిరంజీవి భుజం మీద చరచి బయటకు నడిచాడు.

* * * * *

ఇప్పుడు మార్కెట్లో ఉంది -

యర్రంశెట్టి శాయి

లవ్ ఎట్

"హాయ్ రోజా! నేనెవరో చెప్పుకో చూద్దాం–"

రోజా తలెత్తి భవానీని చూసి ఆశ్చర్యంగా లేచి నిలబడింది. గుర్తు తెచ్చుకోడానికి ఎంత ప్రయత్నించినా అతనెవరో ఏమాత్రం గుర్తురావటం లేదు.

"సారీ! అయ్ కాన్ట్ రిమెంబర్–" అంటూ తండ్రి వేపు చూసింది.

"ఆదేంది? నీ బచ్‌పన్ కా దోస్త్‌నే గుర్తుపట్టవా?" అడిగాడు జైరాజ్ హాపీ మూడ్‌లో కొస్తూ. రోజా కన్‌ఫ్యూజయింది.

"బచ్‌పన్ కా దోస్తంటే..."

సబిత చెప్పేస్తూంటే భవానీ వారించాడు.

"నువ్ చెప్పద్దాంటీ– నేనే ఒక క్లూ ఇస్తా–" అంటూ రోజా దగ్గరకొచ్చి ఆమె చెవిలో "ఏయ్ ఉల్లిపాయ్! ఇంత త్వరగా నన్నెట్లా మర్చి పోయావే?" అన్నాడు సీక్రెట్‌గా.

ఉలిక్కిపడింది రోజా–

అతనిని ఎగ్జయిట్‌మెంట్‌తో చూసింది.

"ఓగాడ్! నువ్ రాకేష్‌వా?"

"ఏం డౌటా?"

"నువ్ రాకేష్‌లాగా లేవు–"

"రాకేష్‌నయితే కదా - అలా ఉంటానికి–"

"అంటే?"

"పదేళ్ళకిందటి రాకేష్ వేరు నేను వేరు - చాలా మారిపోయాను కదా! అసలు నా రూపమే మారిపోయింది–"

టీవీ చానెల్ వార్‌లో

వెంటనే ఎంజాయ్ చేయండి

లేటెస్ట్ కామెడీ నవల

సెకండ్ సైట్

"యా– యా! అదే నేనూ ఫీలవుతున్నా–"

"నువ్ మాత్రం తక్కువేంటి? నేను కాబట్టి గుర్తుపట్టాను గానీ– అదే ఇంకెవరయినా అయితే ఇంకోదాన్ని వెతుక్కునే వాడు!" రోజా అతని డైలాగ్‌లకు కొంచెం అనీజీగా ఫీలయింది.

"నువ్ కొంచెం డిగ్నిఫైడ్‌గా మాట్లాడితే బావుంటుంది–" అంది కోపం అణచుకుంటూ.

జైరాజ్ వెంటనే వివరణ ఇచ్చాడు.

"రోజా జరంత ఇంటలెక్చువల్ టైప్ అనుకోరాదు– లాంగ్వేజ్, బిహేవియర్– అన్నీ అమెరికా టైపన్నట్లు!"

"ఓ! నౌ అయ్ అండర్‌స్టుడ్! చిల్లర్ టైప్‌ని లైక్ చేయదన్నమాట! అయితే ఇండియాలో ప్రాబ్లెమే– పాపం! అవునా రోజా–"

"యా! యా! బిగినింగ్‌లో కొంచెం ప్రాబ్లెమ్ అయింది. కానీ స్లోగా మా చానెల్ వాళ్ళందరినీ ఎడ్యుకేట్ చేసి ఒక లెవల్‌కి తీసుకురావ డానికి చాలా శ్రమపడాల్సి వచ్చింది–" గర్వంగా చెప్పింది రోజా.

"వావ్! యూ ఆర్ రియల్లీ గ్రేట్! ఒబామాకి నీ లెవల్ తెలుస్తే పరేషానవుతాడు! ముల్కీ రూల్స్ కాన్సిల్ జేసి ఇండో–అమెరికన్ పోరీలు జిందాబాద్ అంటాడు–"

రోజాకి ఆ డైలాగ్ కూడా నచ్చలేదు.

"ఆ లూజ్ టాకే నాకిష్టం ఉండదు" అంది చికాకుగా.

"ఓ సారీ! ఏం చేస్తాం! ఆదత్ సే మజ్‌బూర్ హై!"

మళ్ళీ మీ భవానీ శంకర్

ప్లాన్ నెంబర్ టూ –

మెంబర్ ఆఫ్ పార్లమెంటు భీమారావ్ – తను ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రి అయే అవకాశం పోయినందుకు దిగులుతో వాళ్ళింటిముందు లాన్స్‌లో కూర్చుని ఉంటారు. అప్పుడు కాంపౌండ్ బయటనుంచి ఓ రాయి విసురుగావచ్చి ఆయన తలకి తగుల్తుంది. ఆయన 'అబ్బా' అని తలమీద చేయి పెట్టుకునేసరికి రక్తం తడిగా తగులుతుంది. సరిగ్గా ఆ సమయంలో దీప్‌చంద్ గేటు తీసుకుని ఓ ట్రేలో బాండేజ్, టింక్చర్, అయొడిన్, కాటన్‌తో లోపలికొస్తాడు. ఆయన తలకయిన గాయానికి నొప్పి తెలీకుండా కట్టు కట్టేస్తాడు. ఆయన ఆశ్చర్యంగా, ప్రేమగా దీప్‌చంద్ వంక చూస్తుంటారు.

"బాబూ! ఇంత క్లిష్ట పరిస్థితుల్లో వచ్చి నాకింత సహాయం చేశావ్! ఎవర్నువ్వు? నీ ఋణం ఎలా తీర్చుకోను?" అనడుగుతారు దగ్గుతూ. అప్పుడు మీరు లోపల్నుంచి నెమ్మదిగా లాన్స్‌లో కొస్తారు.

"ఈయన ఫేమస్ రచయిత దీప్‌చంద్ డాడీ! గాయాలు తగిలిన వారందరికీ కట్లు కట్టడం ఈయనకు హాబీ! ఎన్.సి.సిలో 'సి' సర్టిఫికెట్ కూడా ఇచ్చారీయనకు–మీరు అంగీకరిస్తే మేమిద్దరం వివాహం చేసుకుంటాం డాడీ! మీరసలే రాజకీయాలో ఉన్నారు. ఎప్పుడే ప్రదర్శన జరుగుతుందో తెలీదు.

మీరు పార్టీ మారినప్పుడల్లా ఎవరే రాయి వేస్తారో తెలీదు. అలాంటప్పుడు ఇలా ఇరవై నాలుగ్గంటలూ బాండేజీ, టింక్చర్, అయొడిన్, కాటన్‌తో సిద్ధంగా ఉండే అల్లుడు ఇంట్లోనే ఉంటే ఎంత బావుంటుంది?" అంటారు. ఆయన నెమ్మదిగా లేచి దీప్‌చంద్‌ని కౌగలించుకుంటారు.

"వ్వాట్? ఇంతటి అమృతహృదయుడ్నేనా, నేను నా కళ్ళకు కనబడకుండా అరసెకనులో పరుగెత్తమని ఆదేశించింది? క్షమించు దీప్ చంద్ – క్షమించు..." అంటారు.

నెమ్మదిగా తెరపడుతుంది – "సుఖాంతం" అన్న అక్షరాలు పడతాయ్.

ఎలావుంది?" అడిగాడు భవానీశంకర్ ఉత్సాహంగా.

"ఒండర్‌ఫుల్..." అంది అమ్మాయ్ అతనిని అభినందన పూర్వకంగా చూస్తూ.

"కానీ..." అన్నాడు దీప్‌చంద్ బెరుగ్గా.

"ఊ–కాని?" అడిగాడు భవానీశంకర్.

"కానీ..." అన్నాడు దీప్‌చంద్. "బయటినుంచీ రాయివచ్చి వాళ్ళ డాడీకెట్లా తగుల్తుంది?"

"వెరీ రీజనబుల్ ప్రశ్న! ఇలా ప్రశ్నలడిగే బాలురంటే నాకెంతో ఇష్టం! బయటినుంచీ రాయి ఎలావచ్చి ఆయనకు తగుల్తుంది? అని కదూ అడిగావ్! వెరీ ఇంటలిజెంట్ కొశ్చన్! ఆ రాయి ముందు నువ్వే వేస్తావ్! అంచేత తగుల్తుంది..."

దీప్‌చంద్ ఆ ఊహకే వణికిపోయాడు...

యర్రంశెట్టిశాయి

అందిస్తోన్న పూర్తి రియల్‌లైఫ్ కామెడీ

హనీమూన్

మధ్యతరగతి కుటుంబాల

హనీమూన్ అనుభవం ఎలా ఉంటుంది?

రిజర్వేషన్ కోసం రికమండేషన్ ఫార్స్–

సినిమా రికార్డుల మధ్య టెలిఫోన్ భాగోతం–

మిడిల్ క్లాస్ లగేజ్ హెడేక్–

స్లీపర్ కోచ్‌లో తాతయ్య వీరవిహారం–

ఉత్తరదేశంలో మద్రాసు దోశె కథ–

త్రివేణీ సంగమంలో దొంగలు –

డార్జిలింగ్ కామెడీ అనుభవాలు –

సిలిగురి సింగాడే –

ఈ నవ్వుల నావలో మీరు ప్రేమయాత్ర ప్రారంభించండి.

యర్రంశెట్టిశాయి

అందిస్తోన్న ఆనాటి+ఈనాటి కామెడీ కథలు

కామెడీ పెరేడ్

శివుడు పార్వతీ భూలోకంలోకొస్తే

వ్యవహారం ఎలా ఉంటుంది ...

టీవీ సీరియల్ ఈ రోజుల్లో తీయాలంటే టెక్నిక్ ఏంటి?

కేవలం టీవీ సీరియల్స్

చూడటంలోనే లీనమైపోతున్న

మన లేడీస్ ఫ్యూచర్ ఎలా ఉంటుంది?

చిత్ర విచిత్రమైన ప్రజెంట్ డే

లైఫ్ నుంచి పుట్టిన కామెడీ కథలు...

చదవండి..

ఎంజాయ్ చేయండి...

మార్కెట్లో ఉన్న నవలలు :

హ్యూమరాలజీ 1, 2, 3
రాంభరోసా అపార్ట్‌మెంట్స్
మొగుడు- ఇంకోపెళ్ళాం - వజ్రాలు
రైల్వే జంక్షన్
ప్రేమకు ఫుల్‌స్టాప్ ఉందా
సినీ పంచతంత్రం
సినీ బేతాళం
లవ్ ఎట్ సెకండ్ సైట్
బెస్ట్ జోక్స్- లేటెస్ట్ కూడా
అమ్మాయీ.. ఓ అమ్మాయీ ....
కామెడీ పెరేడ్
పాఠకులున్నారు జాగ్రత్త
హనీమూన్

త్వరలో రిలీజవబోతూన్న క్రైమ్ కామెడి థ్రిల్లర్
కాళీదాదా అపార్ట్‌మెంట్స్